Insan Aur Uske Masaail
(Telugu)

మానవులు - సమస్యలు

మూలం

మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ ఉమరి

అనువాదం

ఎస్.ఎమ్. మలిక్

పరిచయం

మానవుని గురించి అధ్యయనం రెండు విధాలుగా జరుగుతుంది. ఒకటి తాత్వికమయింది, ఇది యదార్థాన్ని ప్రత్యక్షంగా చర్చిస్తుంది. మానవ సృష్టి, అతని లక్ష్యం, ఆశయం; ఈ సువిశాల విశ్వంతో అతని సంబంధ బాంధవ్యాలు ఇత్యాది విషయాల పట్ల తత్వశాస్త్రం పూర్తిగా, స్వచ్ఛంగా శాస్త్రీయ ఫక్కీలో చర్చిస్తుంది. ఈ చర్చా విధానం క్లిష్టమయినది. ప్రయోజనకరమయినా కేవలం శాస్త్రీయ జ్ఞానం, పరిశోధనల ప్రమాణం ఉన్నతమయిన వారికే పరిమితం. కాని అంతగా ఉన్నత జ్ఞాన స్థాయిలేని వారు దీని ద్వారా ప్రయోజనం పొందలేరు. వీరి కొరకు మరో చర్చా విధానం అధికంగా ప్రయోజనకరమవుతుంది. అది, మానవుని వాస్తవికతను అతని సమస్యల వెలుగులో పరిశీలించడం. సాధారణ మేధ, నేరుగా యదార్థాన్ని గ్రహించలేదు. అది నిజాన్ని దైనందిన సమస్యలలో ఎదురయ్యే పరిస్థితుల మధ్య, వాటి ద్వారా పరిశీలించడానికి అలవాటుపడి ఉంటుంది. జీవితపు మెట్టపల్లాలను దాటుకుంటూ మానవుడు ఎదుర్కొనే సమస్యలే అతని వాస్తవ సమస్యలు. ఈ సమస్యల పట్ల జరిగే చర్చ సైద్ధాంతికంగా జరిగే చర్చకన్నా ఆసక్తికరంగానూ ఉంటుంది, ప్రయోజన కరంగానూ ఉంటుంది. అందులో మానవుని మస్తిష్కంలో ప్రొద్దస్తమానూ తలెత్తే ప్రశ్నలకు సమాధానాలుంటాయి. ఆ సమస్యలు, ప్రశ్నల పరిష్కారానికి మానవ నైజం తహతహలాడుతూ ఉంటుంది కూడా.

ఈ పుస్తకంలో చర్చ, పరిశీలనలకు ఈ రెండవ విధానాన్నే ఎన్నుకున్నాము. మొదట సమస్యల సైద్ధాంతిక విభజన జరిగింది. తరువాత ఆ విభజన రీత్యా ఇస్లామీయ బోధనల్ని ముందుంచడం జరిగింది. మా దృష్టిలో ఇస్లామ్, మానవుల చిన్న పెద్ద సమస్యలన్నింటికీ సరయిన, ఫలవంతమయిన పరిష్కారాన్ని చూపుతుంది. అందులో శాశ్వత సత్యాలున్నాయి. వాటి ద్వారా అది దేశ కాల వ్యత్యాసంలేకుండా అన్ని సమస్యల్నీ పరిష్కరించగలదు. ఇస్లామ్ సమాధానమివ్వలేని, జీవితపు ఏ ప్రశ్నా లేదు. మానవుడు తన సమస్యల పరిష్కారానికి నేటి వరకు కనిపెట్టుకున్న తత్వాలు, సిద్ధాంతాలన్నీ పూర్తిగా విఫలమయ్యాయి లేదా వైఫల్యం వైపునకు సాగు తున్నాయి. వీటి మార్గదర్శకత్వపు పరిధుల నుండి మానవుడు బయటపడనంత వరకు తన్ను తాను వినాశం నుండి తప్పించుకోలేడు. ఈ పుస్తకంలో శాస్త్రీయ చర్చలను, సాంకేతిక పరిభాషను వీలయినంత మటుకు దూరముంచడం జరిగింది. భాష కూడా అత్యంత సులువయినది, సరళమయినదీ ప్రయోగించాము. చివరన, ఇస్లామ్ వైపునకు మనిషి ముందడుగు వేయడానికి అవరోధంగా ఉన్న కారణాలను క్లుప్తంగా పరిశీలించడం జరిగింది. ఈ పుటల్లో తమ సమస్యలకు పరిష్కారాన్ని వెదికే సోదరులకు, ఇన్షా అల్లాహ్, నిరాశ కలగదు. ఈ రచనకు ఉద్దేశ్యం ఇదే.

జలాలుద్దీన్
24.8.1960

పునఃపరిశీలన

ఈ పుస్తకం (ఉర్దూలో) మొదటిసారి 1960లో ప్రింటయింది. ఆ తరువాత ఎన్నో ప్రచురణలు విడుదలయ్యాయి. పాకిస్తాన్‌లోనూ ప్రింటయింది. చదివే వారికి ఇది బాగా నచ్చింది. ఇస్లామ్ పరిచయానికి ప్రయోజనకరమని చాలా మంది భావించారు. దీన్ని పునఃపరిశీలించాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. దైవం సుదీర్ఘకాలం తరువాత ఇప్పటికి ఆ అవకాశం కల్పించాడు. నేను మరోసారి పరిశీలించి దీన్ని మరింత ప్రయోజనకరంగా, ఉత్తమంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించాను. పెద్దగా మార్పులూ చేర్పులు చేయలేదు. ఈ విషయం మీద సవివరమయిన మరో గ్రంథం వ్రాయాలన్న ఆలోచన ఉంది. అందులో పెద్ద భాగం విభిన్న వ్యాసాల రూపంలో ఇప్పటికే అచ్చయి ఉంది. దైవం దాన్ని పూర్తిచేసే సద్బుద్ధీ, అవకాశం కల్పించాలని కోరుకుంటున్నాను.

ఈ పుస్తకం హిందీలోనూ అనువాదమయింది. దీని ఒక భాగం ఇంగ్లీషులో Islam The Universal Truth అన్న పేరుతో ప్రచురించబడింది.

దైవం ఈ ప్రయత్నాలను స్వీకరించి తన దాసులకు వీటి ద్వారా ఇతోధికంగా ప్రయోజనం చేకూర్చాలని ఆశిస్తున్నాను.

జలాలుద్దీన్
29.9.1991

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

1. సమస్యలు

జీవితానికి సంబంధించిన సమస్యలు అనేకం. కూడు, గూడు, గుడ్డ సమస్యలతోపాటు విద్యాబుద్ధులు, సంఘం, సంస్కృతి, యుద్ధం సంధి సమస్యలు; ధన మాన ప్రాణాల సమస్యలు; ఒకటీ రెండు కావు అసంఖ్యాక సమస్యలు మానవుణ్ణి చుట్టుముట్టాయి. ఈ సమస్యలు ఒక వ్యక్తికి సంబంధించినవయినా లేక కుటుంబం, సమాజం, దేశంతో ముడివడి ఉన్నవయినా వీటినన్నింటినీ మూడు పెద్ద శీర్షికలలో విభజించవచ్చు:

సిద్ధాంతాలు, సామాజిక సంబంధాలు, చట్టం. ఏదో ఒక రూపంలో ఈ శీర్షికలకు లోబడి రాని జీవిత సమస్య అంటూ ఏదీ లేదు.

మానవుని సమస్యలన్నింటికీ మూలం ఒకటే. అతను తన గురించి ఏమని ఆలోచిస్తాడు, తన చుట్టూ ఉన్న సువిశాల ప్రపంచం గురించి ఏమని నిర్ణయిస్తాడు అన్నది. దీని ద్వారా విశ్వంలో మానవుని స్థానమేమిటో నిర్ణయమవుతుంది. ఈ నిర్ణయం ద్వారానే అతని సామాజిక సామూహిక కార్యకలాపాల దిశ నిర్ధారించబడుతుంది. అయితే క్రియా ప్రపంచంలో మొదటగా మానవుని ముందుకు వచ్చే ప్రశ్నలు రెండు. ఒకటి, జీవితపు సమస్యలనేకంలో అతను తనలాంటి ఇతర మానవులతో ఏ ప్రాతిపదికల ఆధారంగా వ్యవహరిస్తాడు; రెండు, అతను ఏ శాసనాన్ని అనుసరిస్తాడు; అంటే అతను ఎదిరించలేని అధికార శక్తి ఏది, ఏ శక్తి నిర్ణయం అతనికి అంతిమ నిర్ణయంగా రూపొందుతుంది?

సిద్ధాంతాలు

మానవుడు పుట్టగానే ఒక ప్రత్యేక వాతావరణాన్ని గమనిస్తాడు. ఇక్కడ సూర్యచంద్రాదుల ఉదయం, అస్తమయం జరుగుతున్నాయి. పగలు వస్తుంది, రేయి పోతుంది. ఆకాశాన నక్షత్రాలు మిరుమిట్లు గొలుపుతుంటాయి;

అస్తమించిపోతాయి. నేల సస్యశ్యామలంగా కళకళలాడుతుంటుంది, ఎండి మాడిపోతుంది కూడా. నీటి యేరులు పారుతుంటాయి, ఎండిపోతుంటాయి. చెట్లకు, పొలాలకు వసంతం వస్తుంది, అంతరించిపోతుంది.

ఈ మార్పులు ఇట్టే దాటిపోవు, మానవునిపైన ప్రభావం చూపుతాయి. పొద్దుపొడవగానే మనిషి తన కార్యక్రమాలు ప్రారంభిస్తాడు. రేయి అతని విశ్రాంతికి ఆధారం. నేలపైన మొలిచే పచ్చదనం ద్వారా ప్రయోజనం పొందుతాడు. వర్షాభావమయితే నష్టపోతాడు. నీరు, గాలి అతనికి బ్రతుకునిస్తాయి. కాని ఈ నీరూ గాలులే వరదలయి, తుఫానులయి అతన్నుండి బ్రతుకును దోచుకుంటాయి. భూమి అతనికి విశ్రమనిలయం. కాని భూమి ఒక్కోసారి అతన్ని భరించలేకపోతుంది.

ఈ విధంగా మానవుని చుట్టూ జరిగే మార్పులు అతనికి సుఖసందేశాన్నీ అందజేస్తాయి, దుఃఖకారణాలూ అవుతాయి. అవి అతనికి సౌఖ్యాన్నీ ప్రసాదిస్తాయి, కష్టాన్నీ కలిగిస్తాయి. వీటి ద్వారా అతను ఆరోగ్యాన్నీ పొందుతాడు, రోగాలకూ గురవుతాడు. అందువల్ల ఈ మార్పుల్ని అతను పట్టించుకోకుండా వదలిపెట్టలేదు. వాటిని గురించి ఆలోచించడం అతనికి తప్పనిసరి. వీటన్నింటి వెనక ఉన్న కారణాలేవి? ఇదంతా ఇలా ఎందుకు జరుగుతుంది? అన్నవి అతన్ని వేధించే ప్రశ్నలు.

ఒక్కోసారి అతనికి అనిపిస్తుంది, తన ఆదేశం భూమిపైనా నడవదు, ఆకాశానా సాగదు. సూర్యుడూ తన ఇష్టానికి లోబడి లేడు, చంద్రుడూ లేడు. తన ఆజ్ఞాబద్ధంగా నీరూ లేదు, గాలీ లేదు. విశ్వంలోని అసంఖ్యాకమయిన శక్తుల సమక్షంలో తానొక అత్యంత బలహీనమయిన సృష్టి, అశక్తుడయిన సృష్టి. విశ్వంలోని వాటి మీద తనకు ఎలాంటి ఆధిక్యతా లేదు, అధికారమూ లేదు. అవి కోరితే తన్ను బ్రతకనిస్తాయి, కోరితే చంపివేస్తాయి. ఆరోగ్యం, శక్తినిచ్చినా, వాటిని లాక్కున్నా అంతా వాటి ఇష్టం. ఈ భావన కలగగానే ప్రపంచంలో తనకి లాభనష్టాలు చేకూర్చే ప్రతి వస్తువూ అతన్ని భయపెట్టసాగింది. భూమిని పూజించసాగాడు, అందులో ఎనలేని నిధులూ నిక్షేపాలున్నాయని. ఆకాశాన్ని దేవతగా భావించాడు, అది వరాల జల్లు కురిపిస్తుందని. పర్వతాల ముందు

తలవంచాడు, అవి తనకన్నా ఎంతో ఎత్తయినవని. సముద్రాలంటే ఆపాద మస్తకం వణికిపోయాడు, దాని పొగరుమోతు కెరటాలు తనను నాశనం చేయగలవని. ఇలా ప్రతి చిన్న పెద్ద శక్తి అతని పైన రాజ్యమేలింది, అతడు దానికి విధేయుడయి పోయాడు.

ఒక్కోసారి అతను ఆలోచిస్తాడు, తాను భయవిహ్వాలునిగా చేసిన కొన్ని వస్తువులు - తనకు గొప్ప అధికారంగలవిగా కనిపించే వస్తువులు - అవి కూడా అశక్తతకు, పరాధీనతకు లోనయి ఉన్నాయి. సూర్యుడు ఎల్లవేళలా వెలుగు చిమ్మ డెందుకు? మెరిసే చంద్రుడికి గ్రహణం ఆవహిస్తుందెందుకు? నక్షత్రాలూ అస్త మిస్తాయే? భూమి తన ఇష్టానుసారం ధాన్యం పండించదే? పర్వతాలు సయితం ప్రత్యేక నియమబద్ధమయి ఉన్నాయెందుకు? అంటే విశ్వంలో కొన్ని అగోచర శక్తులు కూడా ఉన్నాయా? అవి పనిచేస్తున్నాయనడానికి ఇదంతా తార్కాణం కాదా? ఆ శక్తుల ఆదేశాల మేరకే నిప్పు మండుతుంది, నీరు వానయి కురుస్తుంది, నేల ధాన్యం పండిస్తుంది. కరవు వచ్చినా, సస్యం పెరిగినా, సుభిక్షమయినా, దుర్భిక్ష మయినా, ఆరోగ్య అనారోగ్యాలయినా, కలిమిలేములయినా, జీవన్మరణాలయినా, ప్రతి విషయంలో అవి తమ జోక్యం కలగజేసుకుంటున్నాయి. ఇక మనిషిలో జిజ్ఞాస పుట్టింది. ఆ శక్తులేవో తెలుసుకోవాలని, అర్థం చేసుకోవాలని తపించాడు. ఆ శక్తుల్ని తాను చూడలేదు కాని వాటి అభివ్యక్తి అన్ని వైపులా కానగలుగుతున్నాడు. ఈ అగోచర శక్తుల భావన మనిషిలోని సహజ జిజ్ఞాసను మరింత పెంచింది. అతను ఆలోచించసాగాడు, నేను చూడని శక్తుల్ని నమ్మడం దేనికి? ఈ విశ్వంలో ఎవరి పరిపాలన సాగుతుందో తెలియనప్పుడు ఆ శక్తిని అంగీకరించడం ఏమిటీ? అతను గ్రహించాడు, విశ్వంలో కొన్ని సాధనాలు ఏకత్రమయినప్పుడు కొన్ని ప్రత్యేక సంఘటనలు జరుగుతాయి. నిప్పు కాల్చుతుంది; వర్షం వల్ల మొక్కల్లో పచ్చదనం పుడుతుంది, మొక్కలు పెరుగుతాయి; విషం మనిషిని చంపుతుంది, అమృతం ప్రాణాన్ని కాపాడుతుంది- ఇదంతా జరుగుతుంది కాని ఇలా ఎందుకు జరుగుతుంది? తేలిందేమిటంటే మనం ఒక వాతావరణంలో జీవిస్తున్నాము. ఇక్కడ మనకు వ్యతిరేక శక్తులూ, అనుకూల శక్తులూ బలోపేతంగా పనిచేస్తున్నాయి. మనం ఆలోచించవలసిందేమిటంటే, ఈ అనుకూల శక్తుల వల్ల ప్రయోజనం

పొందడం ఎలా? ప్రతికూల శక్తుల నుండి తప్పించుకోవడమెలా అన్నదే. పోతే, ఈ ప్రపంచం వాస్తవికత ఏమిటీ? దీన్ని సృష్టించిన వాడెవడు, నడుపుతున్న వాడెవుడు? మనం ఎక్కడినుండి వచ్చామో, ఎక్కడికి పోతామో, మన పైన రాజ్య మేలుతున్న శక్తులేవో అన్న ప్రశ్నలన్నీ అనవసరం, వ్యర్థం.

మానవుడు ఉనికిలోకి వచ్చి ఒక లెక్కప్రకారం అయిదు లక్షల యేండ్లు గడిచాయి. ఈ మధ్యకాలంలో అతడు ఎన్నో ప్రయోగాలు చేశాడు; సంస్కృతీ నాగరికతల్లో ఎంతో ప్రగతి సాధించాడు; కొంగ్రొత్త వస్తువులు కనుగొన్నాడు; శాస్త్రాలు, కళలూ కనిపెట్టాడు; ఫలితంగా ఆలోచన, పరిశీలనలకు క్రొత్త సరకు ప్రాప్తమవుతూ పోయింది; అయినా ఇంతజేసీ ఈ అన్వేషణ ప్రారంభించిన నాటి పరిస్థితిని నేటికీ దాటలేకపోయాడు. అతని మనస్సు ఏ సంభ్రమం, అయోమయావస్థలో ప్రశ్నను లేవనెత్తిందో – ఈ ప్రపంచం ఏమిటో, నేనెవరినో అని – నేటికీ అదే సంభ్రమాశ్చర్యాలతో ఎలుగెత్తి ప్రశ్నిస్తున్నాడు – ఈ ప్రపంచం ఏమిటీ? నేనెవరినీ? అని. ఈ యదార్థాన్ని తెలుసుకోనంత వరకు ఈ ప్రశ్న ప్రశ్నగానే మిగిలి ఉంటుంది!

సామాజిక సంబంధాలు

మనిషి సహజంగా ఒంటరిగా ఉండటాన్ని భరించలేడు. చాలామటుకు సామూహిక జీవితం గడపడానికే బద్ధుడయి ఉన్నాడు. అతను ఇతరుల సహకారం లేకుండా తన కూడు, గూడు, గుడ్డకు సంబంధించిన సమస్యల్ని సయితం పరిష్కరించుకోలేడు. అందువల్ల ఎల్లప్పుడు తోటి మానవులతో తన సంబంధాలను గురించి కూడా ఆలోచిస్తూ ఉంటాడు. ఒక వ్యక్తికి మరో వ్యక్తితో గల సంబంధం ఏమిటీ? మనిషిని రాజకీయ వ్యవస్థతో బంధించే నియమాలేమిటీ? స్త్రీ పురుషుల సంబంధాల సరయిన రూపం ఏది? పొరుగువారు, అపరిచితులు, స్వదేశీయులు, పరదేశీయులు – వీరి పట్ల ప్రవర్తన ఎలా ఉండాలి? దానికి ఆధారాలేమిటీ? ఇలాంటి ప్రశ్నలన్నింటికీ విభిన్నమయిన, విరుద్ధమయిన సమాధానాలు వస్తాయి. కొన్ని విషయాలలో సర్వసమ్మతి కూడా ఏర్పడుతుంది. ఈ ఏకాభిప్రాయం బాహ్యంలో బోధన, శిక్షణల ఫలితంగా కాదు, సహజ నైజం తెచ్చిన వొత్తిడి, అది

కోరే అవసరాలకనుగుణంగా ఏర్పడుంది. అతని నైజమే తెలిపింది, న్యాయం, సామంజస్యం, సంతులనం, నమ్మకం, వాగ్దానపాలనం, క్షమాగుణం, దయాగుణం, ప్రేమ, సానుభూతి, నిజాయితీ, మానాభిమానాలు, సౌశీల్యం లాంటి గుణాల వల్ల సంబంధాలన్నీ సౌహార్ధంగా రూపొందగలవని, ఈ గుణగణాలు సామాజిక సంబంధాలకు ఆధారం కావాలని కూడా అతని సహజ మనస్తత్వం కోరింది. మానవుని అనుభవం కూడా ఇదే. ఈ గుణగణాలు ఎక్కడ ఏ మేరకు అధికంగా ఉన్నాయో అక్కడ ఆ మేరకే మానవీయ సంబంధాలు మెరుగయ్యాయి. సంబంధాల ఈ సహజ నియమాలను నైతిక నియమాలుగా నిర్వచించడం జరుగుతుంది. వీటికి వ్యతిరేకత ఎదురయినప్పుడల్లా సంబంధాలు దెబ్బతిన్నాయి. కలతలు పుట్టాయి, అన్యాయం, అక్రమం, అబద్ధం, మోసం, వంచన, విద్రోహం, విశ్వాస ఘాతం, హక్కులు కొట్టివేయడం, ప్రతీకారం, దోపిడి, ఇత్యాది లక్షణాలు మనిషిని మృగంగా మార్చాయి. ఫలితంగా ఇతరులతో అతని సంబంధాలు మృగాల కన్నా హీనంగా దిగజారాయి.

ఇంత జరిగినా నైతిక నియమాల పాటింపు అసలు ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ ప్రశ్న ఉత్పన్నమవడానికి కారణం ప్రతి వ్యక్తి ప్రయోజనాలు, అభి రుచులు భిన్నమయి ఉండటం. మనిషికి తన పట్ల ఉండే ఆసక్తి ఇతరుల పట్ల ఉండదు. అతడు తన భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులను ప్రేమించినంతగా తన కుటుంబంతో సంబంధంలేని వారిని ప్రేమించలేడు. తన దేశవాసుల ఎడల, జాతి ప్రజల ఎడల గల అభిమానం, ఇతర జాతుల ఎడల, పరదేశీయుల ఎడల కలిగి ఉండలేడు. మనిషి నైతిక నియమాలకు కట్టుబడి వ్యవహరించినట్లయితే అతని ఈ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుంది. ఒకప్పుడు అతనికి వ్యక్తిగత నష్టం కలిగితే మరొకప్పుడు కుటుంబ సంబంధాలు దెబ్బతింటాయి. ఇంకొకప్పుడు జాతి, దేశ ప్రయోజనాలకు హాని కలుగుతుంది. ఒక్కోసారి ఈ నష్టాలు అత్యంత తీవ్రస్థాయికి చేరుకుంటాయి. మనిషి వీటిని సులువుగా భరించలేడు. అప్పుడు అతని మనసులో ప్రశ్న తలెత్తుతుంది- నైతికతకు అంత విలువ ఉందా, ఎట్టి పరిస్థితిలోనూ దాన్ని గౌరవించవలసిందేనా? మెడ పైన కరవాలం వ్రేలాడుతున్నా సత్యతను ఆశ్రయించి నిలకడ చూపడం అవసరమా? శత్రువును మోసగించడం కూడా నేరమేనా? క్షమాగుణం, మన్నింపు అన్నవి అన్ని వేళలా ప్రశంసనీయాలా?

లేక ఎప్పుడయినా పగతీర్చుకోవడం కూడా అభిలషణీయమేనా? అప్పుడే ఒక చర్చ మొదలవుతుంది - నైతికత అంటే ఏమిటీ? దాని ఉద్దేశ్యం ఏమిటీ? నైతిక ప్రమాణాలు మార్చ వీలుకానివా? లేక వాటిలో ఏమయినా మార్పులు సంభవమేనా? కొందరు తత్వవేత్తలు దీనికి సమాధానం స్పష్టంగా చెప్పివేశారు, ఆచరణ రూపేణ మానవుల అత్యధిక శాతం దీన్నే బలపరుస్తుంది కూడా: నైతిక నియమాల నిబద్ధత అన్ని వేళలా అవసరం కాదు, కొన్ని సందర్భాలలో వీటిని వ్యతిరేకించడం అనివార్యమయిపోతుంది. ఒక తండ్రి తనయుణ్ణి సంహరించడం నైతిక నేరం. కాని తనయుడు జాతి విద్రోహి అయినట్లయితే తండ్రి తీసుకునే ఈ చర్య జాతి పట్ల అతని అభిమానానికి నిదర్శనం. సత్యం పలకడం నైతిక సద్గుణం. కాని శత్రువుకు యదార్థాన్ని గురించి తెలుపడం మహా అవివేకం. వినయ వినమ్రతలు మంచిగుణాలు, కాని వీటి వల్ల మనిషి అవమానం పాలయినా లేక పరాభవం ఎదుర్కోవలసి వచ్చినా, ఆత్మాభిమానానికి విఘాతం కలిగినా వీటిని కనబరచడం వాంఛనీయం కాదు.

అయితే ఈ సూత్రాన్ని స్వీకరించి, వ్యక్తిగత, జాతీయ ప్రయోజనాల కొరకు నైతిక నియమాలను ఉపేక్షించవచ్చు అనుకుంటే, ఏ వ్యక్తి అయినా ఆ సూత్రాల మీద నిలకడ కనబరుస్తాడని ఆశించలేము. ప్రతి వ్యక్తికీ తన ప్రయోజనం విలువయినది, ప్రియమయినదిగా అగుపిస్తుంది. ప్రపంచం దాన్ని అప్రముఖంగా, విలువలేనదిగా పరిగణించవచ్చు. అందువల్ల ఏ ప్రయోజనం నైతికతకు లోబడి ఉండాలో మరే ప్రయోజనం నైతికతకన్నా ఉన్నతమయిందో నిర్ణయించడం చాలా కష్టమయిన పని.

దీనికి భిన్నంగా కొందరు నైతికత అన్నది సకల లాభ నష్టాలకు అతీతమయిందిగా ఉండాలని సూత్రీకరించారు. సత్యాన్ని కాదనడం ఎట్టి పరిస్థితి లోనూ సరయినది కాదు. దాని ఫలితంగా తల ఎగిరిపోయే పరిస్థితి ఏర్పడినా, ఘోరాతి ఘోరమయిన నష్టం భరించవలసి వచ్చినా లెక్కచేయరాదు. న్యాయం, ఔచిత్యాలను ఎంతసేపటికీ విడవలేము దాని వ్రేటుకు తన సంతానమే ఎదురయినా సరే. వంచన అన్నది ఎట్టి పరిస్థితిలోనూ అధర్మమయిందే. దానివల్ల జాతికి, దేశానికి ఎంతటి నష్టం వాటిల్లినా సరే అని వారించారు.

కాని మనిషి నైతికత కోసం ఎల్లవేళలా ఇంత గొప్ప త్యాగాలు చేయగలడా? అధికారం, శక్తి ఉన్నప్పటికీ బలవంతానికీ హింసకూ దూరంగా ఉండగలడా? ఆకలిదప్పులలో దొంగతనానికి పాల్పడే ఆస్కారముండదా? మనోకాంక్షల ఉధృతి లోనూ సౌశీల్యానికీ మాన రక్షణకు విలువనివ్వగలగడం సాధ్యమా?

దీనికి సమాధానంగా చెప్పేదేమిటంటే, నైతికతను గౌరవించడం మానవ ప్రకృతిలోనే నిబిడీకృతమయి ఉండటాన నైతికతకు భంగం కలిగించడాన్ని మానవ అంతరాత్మ సదా అపరాధంగానే భావించింది. మానవుడు అనైతికతకు ఎప్పుడయినా పాల్పడితే అది కేవలం బాహ్యప్రభావాల ఒత్తిడివల్లనే, ఇలాంటి ప్రభావాలు లేకపోతే అతను నైతికత కోసం ఏ నష్టాన్నయినా భరించగలడు; అందువల్ల మానవ అంత రాత్మ సజీవంగా ఉండేలా చూడటమే మన ప్రయత్నమయి ఉండాలి, అతని ప్రకృతి మసకబారకుండా చూడాలి. అలా అయితే ఏ మానవుడూ మరో మానవుని మానాభిమానాలను దోచుకోలేడు, ఎవరూ మరెవరి ధన ప్రాణాలను కాజేయలేడు. వంచన, మోసం, అపనింద లాంటి నీతిబాహ్యమయిన పనులకూ ఎవరూ పాల్పడరు.

చట్టం

మనిషి స్వభావసిద్ధంగా మంచిని కాంక్షించే వాడనటంలో సందేహం లేదు. కాని ఒక పనిని పూనుకోవడంలోనూ పని చేయడంలోనూ స్వేచ్ఛ కూడా కలిగి ఉన్నాడు. అందువల్ల మహా ఘోరమయిన అపరాధం కూడా అతని వల్ల సంభవమే. అతను ఇతరులకు నష్టం చేకూర్చగలడు, జాతికి ద్రోహం తలపెట్ట గలడు, దేశశ్రేయానికీ, దేశ ప్రయోజనాలకూ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన గలడు. ఎలాంటి అధర్మమయిన, తప్పుడు పని అయినా అతని వల్ల సాధ్యమే. అందువల్లనే చట్టం అవసరమయింది. నైతికత ద్వారా సంబంధాలను మెరుగుపరచ డమయితే సాధ్యమే కాని అవి గాయపడకుండా నివారించడానికి వీలుపడదు. ఈ పని చట్టం చేస్తుంది. చట్టం లేకుండా కేవలం నైతిక నియమాల ఆధారంగా సామాజిక వ్యవస్థ సవ్యంగా సాగాలంటే మానవుడు దైవదూత అయినప్పుడే సాధ్యం. ఏ విధమయిన నైతిక విరుద్ధ వైఖరి నవలంబించే అవకాశం మానవునికి మిగుల

కుండా ఉండాలి. అయితే ఈ చట్టం విషయంలోనూ ప్రశ్న ఉత్పన్నమవుతుంది. సరయిన చట్టం, తప్పుడు చట్టం అన్నది ఎలా తెలుస్తుంది? మానవుని ఏ చేష్ట వ్యక్తికీ సముదాయానికీ హానికరమో, ఏ చేష్ట శ్రేయస్కరమో ఎవరు నిర్ణయించాలి? మనిషి వ్యాపారం చేయడానికి, వ్యవసాయం చేయడానికి, విద్య, సంస్కృతి, రాజకీయ రంగాలలో ప్రగతి గడించడానికి, భావ ప్రకటనకు, రచనా వ్యాసంగానికీ స్వేచ్ఛ లభించవలసిన పరిమితులేవి? ఈ పరిమితులు అంతమయ్యే ఎల్లలేవి? దీనికి నియంతృత్వం బదులిచ్చింది. చట్టం చేయడం జాతిలో పెద్దవాడయిన వ్యక్తి, అధికారం హస్తగతమయి ఉన్న వ్యక్తి చేయవలసిన పని. జాతికి ఏది మేలో ఏది కీడో అతనికే తెలుస్తుంది. మరే ఇతరునికి జాతి లాభనష్టాలను నిర్ణయించే సామర్థ్యమూ ఉండదు, అతనికి ఆ హక్కూ ఉండదు. ఆదేశాలివ్వడం నియంత బాధ్యత, పాలితుని కర్తవ్యం దాన్ని పాలించడం. ఇది నియంతృత్వపు సిద్ధాంతం. దీనికి తక్కువగా అది దేన్నీ స్వీకరించదు.

నియంతృత్వం మీద ఆక్షేపణ వచ్చింది. జాతిలో అతిపెద్ద వ్యక్తి చేసే చట్టం సదా జాతికి మేలుగానే పరిణమిస్తుందన్న గ్యారంటీ ఏమిటీ? అతను ఇతరుల ప్రయోజనాలపైన తన వ్యక్తిగత అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వలేడా? అతను జాతి భావాలను గాయపరచి, న్యాయం, ఔచిత్య మార్గాలను వదలి అత్యాచార మార్గాన్ని అవలంబించే ఆస్కారముండదా? ముఖ్యంగా అతను అధికార సంపన్నుడయి, అతన్ని ప్రశ్నించే మరే శక్తి లేనప్పుడు ఈ ప్రమాదం అధికం కాదా? ఇది కేవలం సంశయం మాత్రమే కాదు, నియంతృత్వం చరిత్రనంతటినీ పరిశీలిస్తే అది దీన్నే బలపరుస్తుంది. మానవులు అధికార మత్తులో మృగాల కన్నా కాఠిన్యాన్ని ప్రదర్శించారు. నియంతృత్వం వల్ల కలిగే ఈ కఠోర పరిణామాల నుండి విముక్తి పొందడానికి ఓ మార్గం కనిపెట్టారు. చట్టం చేసే హక్కు జాతి మొత్తానికి ఇచ్చివేయడం జరిగింది. అది తన భవితవ్యానికి తానే స్వామి అని, దాని మంచిచెబ్బరలు నిర్ణయించే పని ఏ ఒక్క వ్యక్తి వాంఛపైనా ఆధారపడరాదని ఈ దారి పట్టారు.

ఇక్కడ ఒక ప్రశ్న. జాతి తన ఈ అధికారాన్ని ఎలా వినియోగించాలి? జాతిలోని పెద్దలూ పిన్నలు అందరూ కలసి తమ కోసం ఒక చట్టాన్ని చేసుకునే

అవకాశమేదీ లేదు, పైగా ప్రతి వ్యక్తిలోనూ చట్టం నిర్మించే సామర్థ్యమూ ఉండదు. అందుకు ఒక పద్ధతి ప్రతిపాదించారు. జాతి తన ప్రతినిధుల్ని ఎన్నుకోవాలి. వారు జాతి కోసం చట్టం చేయాలి. ఈ ప్రతినిధులు నిర్మించిన చట్టం జాతి స్వయంగా చేసుకున్న చట్టమన్నమాట. ఈ ప్రతినిధులు దాని విశ్వాసం పొందినవారు, దాని ఆలోచనల్ని ప్రతిబింబించేవారు. ప్రతినిధులు జాతిని ప్రతిబింబించేవరకు, జాతికి వారిమీద విశ్వాసం ఉన్నంత వరకు వారిని ప్రతినిధులుగా నిలబెడుతుంది. వారు జాతి అభీష్టాన్ని, అభిమతాన్ని ఉపేక్షించినట్లయితే వారు ఆ విశ్వాసాన్ని కోల్పోతారు. జాతి వారిని తొలగిస్తుంది. ఈ ఉద్దేశ్యంతో జాతికి ప్రతి కొన్నేళ్ళకొకసారి అవకాశం ఇవ్వబడుతుంది. అప్పుడు అది తన ప్రతినిధులను గురించి తన అభీష్టాన్ని వ్యక్తపరుస్తుంది. ఇది చట్టం నిర్మించే ప్రజాస్వామిక భావన.

కాని ప్రజాస్వామ్యంపైనా, నియంతృత్వంలానే అభ్యంతరాలు వస్తాయి. ప్రజాస్వామ్యం చూపే పరిష్కారంలోనూ జాతి యావత్తు అభిప్రాయాలు ప్రతిఫలించడం సాధ్యం కాదు. కేవలం ఒక అల్పసంఖ్య అభిప్రాయాలే ప్రతిబింబించడం సాధ్యం. జాతిలో దాదాపు సగం మంది వ్యక్తులు, తమ వయసు, సామర్థ్యం దృష్ట్యా ఏదయినా వ్యవహారంలో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్థితిలోనే ఉండరు. తమ వయసు రీత్యా, తమ ప్రతినిధుల్ని ఎన్నుకోగల యోగ్యతగల వారిలోనూ చాలా మందికి, ఏ చట్టం చేయాలో, ఎవరు చేయాలో అన్న విషయాల పట్ల ఎలాంటి ఆసక్తి ఉండదు. కొంత వరకు ఆసక్తి ఉన్నా క్రియారూపంలో వారు దానికి బహుదూరంగా ఉంటారు.

ఈ పరిస్థితుల్లో విభిన్న పార్టీలు, కొందరు వ్యక్తులు తమ కార్యక్రమాలు ప్రణాళికలు ముందుపెడతారు. ఏ పార్టీకి ఓట్లు ఇచ్చేవారి 'అధిక సంఖ్య' సమర్థన లభిస్తుందో దానికే పరిపాలనాధికారం లభిస్తుంది. ఈ 'అధిక సంఖ్య' నిజానికి ఇతర పక్షాలన్నింటి సదృశంగా 'అల్ప సంఖ్య' కూడా కావచ్చు. ఉదాహరణకు ఒకచోట ఓటు ఇచ్చేవారు 50 వేల మంది ఉంటారు. వారి ముందు పది వేర్వేరు దృక్పథాలున్నాయి. ఒక్కో దృక్పథానికి కొంత భేదంతో సమానంగా ఓట్లు విభజించబడినా, ఏ దృక్పథానికి అయిదు వేలకు కాస్త ఎక్కువ మంది సమర్థన ప్రాప్తమవు

తుందో ఆ దృక్పథమే 50 వేల మందికి ప్రాతినిధ్యం వహించే దృక్పథంగా పరిగణించబడుతుంది.

అంటే ప్రజాస్వామిక విధానంలో మహా అయితే పది లేక 15 శాతం ప్రజల అభిప్రాయాలనే ప్రతిబింబించడం సాధ్యం. ఈ 10 శాతం ప్రజలు మిగతా 90 శాతం వ్యక్తుల అభిప్రాయాలను సరిగ్గా ప్రతిబింబించగలరని నమ్మకమేమిటీ? వారి శ్రేయోభిలాషులవుతారన్న గ్యారంటీ ఏమిటీ? పోతే జాతి అభిప్రాయ సేకరణకు ప్రజాస్వామ్యం నిర్ణయించే వ్యవధి లోపల ఈ ప్రతినిధులు ప్రాతినిధ్యం వహించే ఆ పది శాతం వ్యక్తుల అభిప్రాయాలు సయితం మారుతూ ఉంటాయి. ఈ వ్యవధి ప్రారంభంలో ఓటు ఇచ్చే యోగ్యతలేని చాలా మంది వ్యవధి మధ్యన దానికి యోగ్యులయిపోతారు. వీరందరి అభిప్రాయాల ప్రాతినిధ్యపు బాధ్యతను ఈ ప్రతినిధులు ఎలా నిర్వర్తించగలుగుతారు?

ఈ ఆక్షేపణల్ని ప్రజాస్వామ్యాన్ని సమర్థించే మహా గొప్ప శాస్త్రవేత్త కూడా పరిష్కరించలేకపోయాడు. నిజానికి ప్రజాస్వామ్యం కూడా నియంతృత్వపు అభివృద్ధి చెందిన రూపమే. నియంతృత్వంలో అధికారం ఒక వ్యక్తిలో కేంద్రీకృతమయి ఉంటుంది. ప్రజాస్వామ్యంలో అది, ఒక చిన్న వర్గపు ప్రాతినిధ్యంలోకి మారుతుంది. ఒక ప్రజాస్వామిక వ్యవస్థను నడపడానికి జాతి సమర్ధన ఏ మేరకు అవసరమవుతుందో, ఒక నియంతకు తన అధికారాన్ని నిలుపుకోడానికి కూడా ఆ మేరకు జన సమర్ధన అవసరమయి ఉంటుంది. అతను కూడా జాతిలోని ఒక ప్రత్యేక వర్గాన్ని సంతుష్టపరచడం తప్పనిసరి అవుతుంది. లేకపోతే అతని అధికారం నిలువదు. ప్రజాస్వామ్యం కూడా అంతే.

సిద్ధాంతాలు, సామాజిక సంబంధాలు, చట్టం – ఈ మూడు సమస్యల్లోనే మనిషి సదా చిక్కుబడిపోయాడు. అతను వీటికి ఒక పరిష్కారాన్ని వెదుకుతాడు. అది అనుభవపూర్వకంగా తప్పుగా తేలితే నిరాశ నిస్పృహలతో మరో కొత్త పరిష్కారం కొరకు వెదకులాటలో పడతాడు. అప్పటికీ అతని చిక్కులు వీడకపోతే తన పరాజయాన్ని ప్రకటించి మూడో పరిష్కారాన్ని వెదకడం మొదలెడతాడు. ఆ విధంగా అతను తప్పుడు సిద్ధాంతాలు, తప్పుడు నైతికత, తప్పుడు చట్టాల సుడిగుండం నుండి బయటపడకముందే అందులో ఇరుక్కుపోతాడు.

చరిత్ర తెలిపే దాని ప్రకారం ఏ ప్రకృతి వైపరీత్యమూ మరే మానవ విపత్తూ మానవునికి నష్టం చేకూర్చనంతగా ఈ సిద్ధాంతాలు నష్టపరిచాయి. ఈ సిద్ధాంతాలను స్వయంగా మానవుడే కల్పించుకున్నాడు. రోగాలు, మహమ్మారులు మానవుణ్ణి నాశనం చేసిన దానికన్నా ఎన్నో రెట్లు దుష్ట నైతిక నియమాలు నాశనం చేశాయి. అతను నిర్మించుకున్న చట్టాల కరవాలం ఎంత నిర్దయగా అతని రక్తం ప్రవహింపజేసిందో ఏ వరదలు, తుఫానులూ సయితం అంత హృదయకాఠిన్యాన్ని, కిరాతకాన్ని ప్రదర్శించలేదు.

పీడనకు సంబంధించిన ఈ సుదీర్ఘ గాధలో కొన్ని విరామ సమయాలూ దొరుకుతాయి. అప్పుడు మానవుడు కాస్త ప్రశాంతంగా విశ్రమించాడు. అప్పుడు అతనికి సరయిన సిద్ధాంతాలు, సరయిన నైతిక నియమాలు, సరయిన చట్టాల సిరి ప్రాప్తమయింది. ఈ విరామ వేళలు చాలా క్లుప్తమయినవయినప్పటికీ ఇవి చరిత్ర నుదిటి మీది జ్యోతులు. వీటిని కాదన్న తరువాత చరిత్రలో మిగిలేది అంతా కారుచీకటే. చరిత్రకు ఈ కాంతిని ఇస్లామ్ ప్రసాదించింది. దీన్ని ప్రతి యుగంలోనూ దేవుని ఎన్నికగన్న దాసులు ప్రపంచం సమక్షంలో అందజేశారు. రాబోయే పుటల్లో ఈ కాంతి వెదజల్లిన వెలుగే మీకు కానవస్తుంది. నేడు దారితప్పి తారాడుతున్న మానవుడు ఈ వెలుగులో తన పయనాన్ని కొనసాగిస్తే ఎంత బావుండేది! గమ్యం అతనికి స్వాగతం పలికేది, చరిత్ర ఒక విజయవంతమయిన ప్రయాణ గాధను రచించేది. అయితే మనిషి దీనికి ఇంకా సన్నద్ధుడు కాలేదా?

2. ఇస్లామీయ పరిష్కారం

విశ్వాసాలు, సిద్ధాంతాలు

ఇస్లామీయ సిద్ధాంతాల పునాది కొన్ని యదార్థాలపై ఏర్పడుతుంది. వాటిని మేము పంచేంద్రియాలతో గ్రహించలేము. కాని మన అధ్యయనం, పరిశీలన వాటిని పూర్తిగా సమర్థిస్తుంది. ఇస్లామేతర సిద్ధాంతాలు, ఇస్లామీయ సిద్ధాంతాల మధ్యనున్న వ్యత్యాసం ఇదే. ఇస్లామేతర సిద్ధాంతాలు మానవుడు రేయింబవళ్ళు చేసే పరిశీలనను కాదంటాయి లేదా ఆ పరిశీలనల సహజమయిన, సహేతుకమయిన పర్యవసానాలను స్వీకరించడానికి సిద్ధంకావు. కాని ఇస్లామ్ చూపే సిద్ధాంతాలు ఈ విశ్వ వ్యవస్థతో పూర్తిగా సామరస్యం పొంది ఉంటాయి. వీటిని అంగీకరించడం వల్ల మనిషి పగటిని రాత్రిగా, రాత్రిని పగలుగా ప్రకటించడానికి బద్ధుడు కాడు; లేదా అతను తన అనుభవాన్నో, పరిశోధననో ఖండించవలసిన అవసరము ఉండదు.

అయితే ఇస్లామేతర సిద్ధాంతాలు రెండు రకాల భావనలు ముందుంచుతాయి, ఒకటి బహుదైవారాధన, రెండవది భౌతికారాధన.

బహుదైవతత్వం

బహుదైవారాధనకు భావం, ఈ విశ్వ సృష్టికి అనేక శక్తులు కలసి పని చేశాయి. ఒకటి నీటిని సృజిస్తే మరొకటి గాలిని పుట్టించింది, మరొకటి ఆహార పదార్థాలు సృష్టించింది. ఒకటేమో అగ్నిని సృజించింది. ఒకటి జీవన్మరణాలను మరొకటి వెలుగూ చీకట్లను పుట్టించాయి. ఆ శక్తులే విశ్వ నిర్వహణనూ చూసుకుంటున్నాయి. నీటికర్త వర్షాన్ని కురిపిస్తే, ఆహారకర్త ధాన్యాన్ని పండిస్తాడు. జీవన్మరణాల కర్త జీవితాన్ని ప్రసాదిస్తాడు, మృత్యువునూ కలిగిస్తాడు. వెలుగూ చీకట్ల స్వామి రేబవళ్ళను నియంత్రిస్తాడు. బహుదైవారాధనా భావం, తన ఈ వాదనకు నిదర్శనంగా ఇలా చెబుతుంది: ఈ విశ్వాన్ని ఒకే అస్తిత్వం ఏదయినా సృష్టించి ఉంటే, విరుద్ధ శక్తులు ఇక్కడ పని చేస్తూ కనిపించేవికావు, అంతా

సమైక్యత, సమానత గోచరించేది. నిర్మాణంతోపాటు విచ్ఛిన్నత కూడా తోడుగా ఉండటాన్ని బట్టి సర్వాధికార సత్తా ఏదో ఒక అస్తిత్వంలో కాక అనేక అస్తిత్వాలు తమ తమ అభీష్టాన్ని నెరవేర్చుతున్నాయని తెలుస్తోంది. బహుదైవారాధనా భావం, ఒక రూపాన్ని కల్పించిన చేతులే దాన్ని రూపుమాపగలవని ఊహించజాలదు. ఈ విశ్వాన్ని సృష్టించింది ఒకే అస్తిత్వం అని ఒప్పుకున్నా దీని నిర్వహణాధికారాలు ఒకటికి మించిన అనేక శక్తులలో ఉందని అది నమ్ముతుంది. ఆ అధికారాన్ని విశ్వకర్త స్వయంగానూ అడ్డుకోలేడని భావిస్తుంది.

ఈ విశ్వంలో కానవచ్చే రకరకాల విభిన్న రూపాలను చూసి వీటి వెనక విభిన్న శక్తులు పనిచేస్తున్నాయని అనుకోవడం అవివేకం. ఇక్కడ సృష్టిరూపాలు భిన్నమయినవే కాని వాస్తవం భిన్నమయింది కాదు. ఈ విశ్వ వ్యవస్థ ఒక నియమం ఒక సూత్రం ఆధారంగా సాగుతోంది. ఆ నియమానికి మరో రూపం ఎక్కడా కానరాదు. ఈ విశ్వంలో ఉత్థానపతనాలు రెండూ ఉన్నాయన్నదీ వాస్తవమే, కాని అవి కూడా ఒక నియమానికి లోబడే ఉన్నాయి. పువ్వు ఏ నియమానుసారం వికసిస్తుందో అదే నియమానుసారం అది కుమిలిపోవడమూ జరుగుతుంది. ఈ విశ్వం విరుద్ధశక్తుల నిలయం కాదని అనడానికి, అది ఒక నియమానికి కట్టుబడి ఉండటమే సరిపోతుంది.

బహు దైవభావన ఈ విశ్వానికి తెలిపే మర్మహేతువు, వాస్తవికతకు విరుద్ధ మవడం అలా ఉంచి, దాన్ని మానవుని నిరంతర అనుభవం కూడా తప్పని నిర్ధారి స్తుంది. మానవుడు చరిత్రలో చేసిన అనేక ప్రయోగాల్లో అతి ఘనంగా వచ్చిన ఫలితాలను బట్టి అధికారం రెండు సమాన భాగాల్లో పంచినప్పుడల్లా తప్పనిసరిగా విభేదాలు, విచ్ఛిన్న ధోరణులు పొడసూపాయి. కాని మనం ఈ విశ్వంలో అత్యంత సామరస్యాన్ని చూస్తున్నాము. ఇక్కడ అనేక మంది దేవుళ్ళు ఉన్నట్లయితే ఈ సంతులనం, ఈ ఔచిత్యం నెలకొనడం అసాధ్యం. ఒక మనిషి ఇద్దరు అధికారులకు ఒకే సమయాన విధేయుడయి మెలగడం సాధ్యం కానట్లే, ఈ విశ్వంలోనూ ఒకరిని మించి మరొకరి అధికారం సాగడం అసాధ్యం. భూమి నిర్వహణ ఒకరి చేతుల్లోనూ ఆకాశ నిర్వహణ మరొకరి చేతుల్లో ఉన్నట్లయితే ఇద్దరిలో ఏకాభిప్రాయం, ఏకతా భావం ఎలా పుట్టాయి. వీటి నిర్వహణలో ఎక్కడా వైరుధ్యం, ఘర్షణ, కానరావడం

లేదే. సూర్యుడు ఏ ఆజ్ఞకు బద్ధుడయి భ్రమిస్తున్నాడో చంద్రుడి మీదా అదే ఆజ్ఞ చెలామణికాకపోతే ఆ రెంటినీ ఒకే వ్యవస్థలో కట్టిపెట్టిన శక్తి ఏది? నీటి మీదా, నేల మీదా వేర్వేరు అధికారుల పరిపాలన సాగితే ఈ రెండూ ఒకదానినొకటి స్వాధీనపరచుకోవడానికి ప్రయత్నించవెందుకు?

నేల మీద మనం చూసే పచ్చదనం, దానికి తగిన వాతావరణం, నీరు, గాలి ప్రాప్తం కానిదే ఉనికిలోకి రాదు. సూర్యుడు ప్రత్యేక పరిమాణంలో వేడిమిని అందజేయకపోతే, మేఘాలు నీటిని కురిపించకపోతే, రేబవళ్ళ మార్పు సంభవించకపోతే, అది ఎలా పుడుతుంది? సూర్యుడు, మేఘాల వ్యవస్థ, రేబవళ్ళ మార్పు, ఒకే శక్తికి హస్తగతమయి లేకపోతే ఒక చిన్న మొక్క పెరుగుదల కోసం ఈ ఏర్పాట్లన్నీ ప్రత్యేక నిష్పత్తిలో ఎలా ఏకత్రమవుతాయి? అదే విధంగా మానవుడు, ఇతర ప్రాణుల జీవనం కోసం వాటికి అవసరమయిన రీతిలో నీరు, గాలి, ఆహారం, ఇతర అవసరాలు ప్రాప్తమవడం తప్పనిసరి. ఈ అవసరాలు ఓ ప్రత్యేక పరిమాణంలో ప్రాప్తం కాకపోతే అవి మనగలగడమే అసాధ్యం. ప్రతి ప్రాణికి తన అస్తిత్వం, తన మనుగడకు అవసరమయిన వస్తువులు ఏ పరిమాణంలో అవశ్యమో అవి ఆ పరిమాణంలోనే అతనికి దొరకుతున్నాయి. వాటిలో తరుగుదలా ఉండదు, పెరుగుదలా ఉండదు. నీరు అవసరానికి మించి దొరకడమో, గాలి అవసరానికి తక్కువగా దొరకడమో సంభవించదు. వెండి బంగారాలు, ఇనుము, బొగ్గు లాంటి ఖనిజాల నిక్షేపాలు అధికంగా దొరికి ధాన్యమే దొరక్కపోవడమన్నదీ ఎన్నడూ జరగదు.

ఈ విశ్వాన్ని ఒకే శక్తి తన అధికారం, దివ్యదృష్టితో నడిపిస్తుందనడానికి ఇది నిదర్శనం. లేకపోతే ఈ విభిన్న అంశాలలో సంతులనం లేకపోయేది. ఒక్కోసారి గాలి ఎక్కువయి నేలలోని తేమ ఆరిపోయేది, మరోసారి నీరు ఎక్కువయి నేల నిలబడటానికే తగనిదిగా అయ్యేది.

పోతే బహు దైవారాధనలోని మరో భావనను చూద్దాం. విశ్వసృష్టి కర్త అయితే ఒక్కడే గాని దీన్ని అనేక శక్తులు నడిపిస్తున్నాయి అనేది ఈ భావన. ఇది మానవ ప్రకృతికి పొసగని భావన. మానవుడు ప్రపంచంలో కాలిడగానే ప్రప్రథమంగా తెలుసుకునే అంశాల్లో ఒకటి, ఒక వస్తువును నిర్మించడంలో,

తయారీలో ఒకే వ్యక్తి శక్తి నుపయోగించినట్లయితే దాని మీద అధీనం కూడా అతనిదే కావాలన్నది మానవ అనుభవం; ఇతర వ్యక్తి ఎవరికయినా దాన్ని ప్రయో గించే హక్కులేదు. భూమ్యాకాశాల ఈ విచిత్రమయిన కర్మాగారాన్ని సృష్టించిన శక్తి ఒక్కటే దీని స్వామి కాదు, ఇంకా ఇతర అస్తిత్వాలకూ స్వామ్యం ఇందులో ఉందంటే మానవుని ఈ సహజ స్పృహ స్వీకరించే అనుమతి నివ్వదు.

మానవ అంతరాత్మ, అతని భావోద్రేకాలు ఎలుగెత్తి చాటుతున్నాయి, ఈ విశ్వకర్త మాత్రమే దీనికి ధర్మబద్ధమయిన స్వామి, అధికారి కూడా అని. ఆయన ఆదేశాలే ఈ విశ్వంలో చెలామణి కావాలి. ఈ విశ్వ సృష్టిక్రియలో ఎలాంటి భాగం లేనివారు దేని ఆధారంగా దీని స్వాములు, అధికారులు కాగలుగుతారు?

ఈ విశ్వాన్ని సృష్టించిన వాడు నిర్వహణాధికారాలు ఇచ్చి దీన్ని ఇతరులకు అప్పగించి చేతులు దులుపుకున్నాడంటే ఇది మింగుడుపడని మాట. ఈ విశ్వవ్యవస్థ నిర్వహణ, దాని సృష్టికర్తకు అంతగా భారమయిపోయిందా అతడు దాన్ని ఇతరుల తల మీద రుద్ది స్వయంగా నిష్క్రియాశీలుడయిపోవడానికి? నిజానికి ఈ విశ్వకర్తే దీని నిర్వహణ విషయంలో అశక్తుడయినట్లయితే విశ్వంలో ఈ మహాభారాన్ని మోయగల శక్తి మరేదయినా కాగలదా?

బహు దైవారాధనా ప్రధానమయిన మనస్తత్వం ఈ అసమంజసమయిన భావనను సహేతుకమని నిరూపించడానికి దాన్ని మరో రూపంలో ముందుంచు తుంది. దాని ప్రకారం, విశ్వకర్త సన్నిధిలో కొన్ని సృష్టితాలకు చాలా పలుకుబడి ఉంది, జోక్యం చేసుకునే అధికారముంది. కడకు కర్త కూడా వాటి అభీష్టానికి భిన్నంగా ఏమీ చేయలేడు. అయితే ఈ భావన వల్ల స్వయాన విశ్వకర్త భావనకే విఘాతం కలుగుతుంది. సూర్యుడు, చంద్రుడు, నేల, సముద్రాలు సృష్టించినవాడి విషయంలో, కొన్ని సృష్టితాలు ఆయనపై ఆధిక్యత వహించడాన్ని, అధికారం చెలాయించడాన్ని అంగీకరించడం, అత్యంత హేయమయిన ఊహ. ఒక జీవికి లేక నిర్జీవమయిన సృష్టిరాశికి లోబడిపోయే, శక్తిహీనమయిన, గత్యంతరం లేని అస్తిత్వం ఇంత బ్రహ్మాండమయిన జగతిని సృష్టించగలుగుతుందని ఆలోచించడం కూడా బుద్ధి తక్కువే.

ఒక్క మాటలో బహు దైవారాధనకు సంబంధించిన ప్రతి భావన మానవ ప్రకృతికి అపరిచితం, దానికి వ్యతిరేకమయింది కూడా. తన ప్రకృతిపైన తెరలు క్రమ్ముకున్న వ్యక్తి మటుకే దీన్ని ఒప్పుకుంటాడు.

భౌతిక తత్వం

ఇక భౌతిక తత్వాన్ని పరిశీలిద్దాము. దీని భావమేమిటంటే ఈ జగతిని ఏ సచేతన శక్తీ పుట్టించలేదు. ఇది ఒక పదార్థం ద్వారా ఉనికిలోకి వచ్చింది. అది చలనంగల పదార్థం. అది తన ఈ చలనం కారణంగానే స్వయంగానే విభిన్న నక్షత్రాలుగా గ్రహాలుగా రూపొందుతూ పోయింది. ఫలితంగా అది ఒక చోట సూర్యుడిలా ఏర్పడితే మరోచోట చంద్రుని రూపు ధరించింది. ఒక చోట శుక్ర నక్షత్రమయితే మరో చోట మన భూమిగా మారింది. అలా ఇంకా అనేక వంద లాది, వేలాది నక్షత్రాలు ఉనికిలోకి వచ్చాయి. తరువాత క్రమేణ ప్రతి నక్షత్రంలోనూ దానికి తగిన పరిస్థితులూ ఏర్పడసాగాయి. ఈ నిర్జీవ పదార్థం నుండి సజీవ నిర్జీవ, సచేతన అచేతన, చర అచర–అన్ని రకాల వస్తువులు ఉనికిలోకి రాసాగాయి.

ఒక ఉపమానం ద్వారా దీన్ని అర్థం చేసుకుందాము. సుదీర్ఘకాలం వరకు ఎక్కడయినా నిరంతరం రాళ్ళు రువ్వుతూ ఉంటే ఒక్కోచోట కొండలు తయారవుతాయి, మరోచోట కట్టడాలు నిర్మాణమవుతాయి, ఒక్కోచోట కాలువలు, యేర్లు, వంతెనలు తయారయితే మరో చోట సత్రాలు, హోటళ్ళు నిర్మాణమవుతాయి. ఒక్కో కంకర రాళ్ళ కుప్ప నుంచి మానవులు, జంతువులు కూడా ఉనికి ధరిస్తాయి. క్రమంగా అక్కడ ఒక క్రమబద్ధమయిన పద్ధతి ప్రకారం ఒక బస్తీ ఏర్పడుతుంది.

విశ్వవ్యవస్థకు సంబంధించిన ఈ హేతువు మానవ మేధకు అందనిది, అతని అనుభవాలకు విరుద్ధమయింది. మానవుని గతంలోని సుదీర్ఘ అనుభవం, వర్తమానంలోని అతని పరిశీలన ప్రకారం నేటి వరకు ఈ పద్ధతిననుసరించి ఏ దేశమూ దానంతట అదే ఏర్పడలేదు, ఒక ఉద్యానవనమూ రూపొందలేదు, ఒక్క కర్మాగారం ఉనికిలోకి రాలేదు, ఒక్క వ్యాసం, ఒక్క ఉత్తరమయినా దానంతట అదే వ్రాయబడలేదు. ఒక సాధారణ గడ్డి పోచ కూడా ఒకరు కదలించనిదే తన స్థానాన కదలదు. ఒక పని ఎంత పెద్దదయితే, ఎంత గొప్పదయితే దానికి అంతే

పెద్ద యోచన, యోజన, శ్రమ, ఆసక్తి, పథక రచన అవసరమవుతాయి. ఒక అందమయిన కట్టడం, ఒక గొప్ప యంత్రం తయారవ్వాలంటే ఉత్తమ సామర్థ్యాలున్న వ్యక్తులు తమ మేధోపరమయిన క్రియాపరమయిన కృషినంతా వినియోగించవలసి ఉంటుంది.

మనిషి తన అనుభవానికి విరుద్ధంగా, ఈ సువిశాల, అనంత జగతి ఒక సృష్టికర్త లేనిదే ఉనికిలోకి వచ్చిందని ఎలా ఊహించగలడు? ఈ విశ్వంలో ఎక్కడా ఏ కొరత, ఏ రగడ కానరాదు, దీనిలోని ప్రతి వస్తువు తన సౌందర్యం, పరిపూర్ణతల దృష్ట్యా గొప్ప యదార్థం. ప్రతిదీ తన స్థానాన ఎంతో కుదురుగా ఇమిడిపోయి ఉంది. దాన్ని అక్కడి నుండి కదిలిస్తే చాలు వ్యవస్థ అంతా ఛిన్నాభిన్నమైపోతుంది. సూర్యుడు, చంద్రుడు, భూమి, అసంఖ్యాక గ్రహాలు – అన్నీ ప్రత్యేక సంతులనంతో తమ తమ కక్ష్యల్లో పరిభ్రమిస్తున్నాయి. ఈ సంతులనంలో ఏ మాత్రం వ్యత్యాసం ఏర్పడినా ఈ విశ్వవ్యవస్థ అంతా క్షణాల్లో అంతమయి పోతుంది. ఏమీ చూడలేని, వినలేని అస్తిత్వం ఏదయినా సరే ఒక కార్యక్రమంలో ఇంతటి సువ్యవస్థను, సామరస్యాన్ని సృష్టించగలదా అన్న ఆలోచనతోనే మనిషి సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోతాడు.

అయితే అచేతన పదార్థంలో ఏర్పడిన యాదృచ్ఛిక కదలిక నిప్పులో వేడిమిని, నీటిలో చల్లదనాన్ని, రాయిలో గట్టిదనాన్ని, మైనంలో మెత్తదనాన్ని, అమృతంలో జీవితాన్ని, విషంలో చావును పొందుపరచిందా? దాని ద్వారానే అయస్కాంతంలో ఆకర్షణ శక్తి, ఇనుములో ఆకర్షితమయ్యే స్థితి పుట్టిందా? ఒకే భూమిలో యాదృచ్ఛికంగానే ఇనుము, బొగ్గు, బంగారం, వెండి, ఉప్పు తదితర ఖనిజాలన్నీ ప్రోగయ్యాయా? విశ్వంలోని విభిన్న విరుద్ధ వస్తువులలో కారణమూ కారణహేతువు, లక్షణమూ లాక్షణికుల సంబంధం యాదృచ్ఛికంగానే నెలకొన్నదా? సూర్యుని వేడిమికి సముద్రంలోని నీరు ఆవిరి రూపంలో పైకెగిసిపోతుంది, గాలి దాన్ని వాతావరణంలో వ్యాపింపజేస్తుంది, అది తిరిగి నీరుగా మారి భూమ్యాకర్షణ వల్ల వర్షిస్తుంటుంది. భూమి అంతటా హరిత విప్లవం వస్తుంది. ఇది, ఇక్కడ నివసించే ప్రాణులన్నింటి మనుగడకు, ఎదుగుదలకు దోహదపడుతుంది. ఇదంతా యాదృచ్ఛికతా మహత్యమేనా?

భౌతికతత్వ భావన ఈ విశ్వవ్యవస్థలో ఏ విధంగానూ అతకదు, అమరదు. మానవ బుద్ధీ అనుభవాలు దాన్ని సమర్థించవు. అయినా దాన్ని ఒప్పుకోవడానికి మానవుడు, ఈ జగతికి ఏదో ఒక భౌతికమయిన గోచరమయ్యే కారణం చెప్పుకోవాలనుకున్నాడు. కారణం, ఈ విశ్వవాస్తవికత దీని కనిపించే రూపంలోనే పరిమితమయి ఉందని మనిషి ముందే నిర్ణయించుకోవడం; బయటికి కనిపించే భౌతికత వెనక మరేదీ లేదని ముందే అనుకోవడం; నిజానికి ఇది కేవలం ఊహ మాత్రమే. ఈ ఊహకు మనిషి ఇంతవరకు ఏ ఆధారమూ, నిదర్శనమూ పొందుపరచలేక పోయాడు. ఇది నిజానికి దుస్సాహసం. తన కంటిచూపు మేరకు ఆవల ఏదయినా ఉందన్న విషయాన్ని నిరాకరించాడు, తన అజ్ఞానానికి జ్ఞానమని, తన అనుమానానికి దృఢవిశ్వాసమని పేరు పెట్టుకున్నాడు. ఫలితంగా విశ్వవ్యవస్థకు, రెండు రెండు కూడితే నాలుగయినట్లే ప్రయోగం చేయగలిగే కారణం చెప్పుకోవాలని పట్టుపట్టాడు. తన జ్ఞానేంద్రియాల ద్వారా, ఆ ప్రయోగాన్ని ధ్రువపరచాలని కోరుకున్నాడు. నిజానికి ఈ విశ్వవ్యవస్థను గురించి జ్ఞానేంద్రియాలకు లోబడి కారణం చెప్పుకోగలగడానికి కావలసినంత విస్తృత జ్ఞానం, విశాల పరిశీలనాశక్తి ఇంతవరకు మనిషికి ప్రాప్తం కాలేదు. మానవుడు నివసించే ఈ భూమండలం గురించి కూడా ఇతనికి తెలిసింది బహు స్వల్పం. విశ్వంలో చాలా భాగం ఇతనికి ఇంకా మహా రహస్యమే. అనుదినం జరుగుతున్న ఆవిష్కారాలు, తెలుస్తున్న కొంగ్రొత్త విషయాలు ఈ అనంత విశ్వంలో ఇతని అశక్తతను, దాని సమక్షంలో ఇతని తెలివి లేమిని మరింత అంగీకరింపజేస్తూనే ఉన్నాయి.

మనిషి తనకున్న అతిస్వల్పమయిన జ్ఞానం ఆధారంగా ఈ సువిశాల విశ్వం ఆద్యంతాలు తెలుసుకోగోరుతున్నాడు. ఇతను దీని ప్రాతిపదికను కేవలం ఊహించగలడే తప్ప యదార్థాన్ని తెలుసుకునే విశ్వసనీయమయిన, ఖచ్చితమయిన సాధనాలు ఇతని వద్ద ఏవీ లేవు.

యదార్థ జ్ఞానం

ఇస్లామ్ మనకు యదార్థ జ్ఞానం అందజేస్తుంది. అది విశ్వవ్యవస్థను గురించి అందజేసే భావన ద్వారా, బహు దైవతత్వం, భౌతిక తత్వాలు సృష్టించిన ప్రశ్నలన్నీ పరిష్కృతమవుతాయి. దీని ద్వారా, ఈ విశ్వం ఎలా ఉనికిలోకి వచ్చిందో, ఇందులో

సువ్యవస్థ, సంతులనం, ఔచిత్యం ఎలా సుస్థిరంగా నెలకొన్నాయో, ఈ వ్యవస్థ ఏ విధంగా నడుస్తోందో అన్ని విషయాలూ సందేహరహితంగా తెలిసిపోతాయి.

దాని ప్రకారం, ఈ విశ్వం దానంతట అదే ఉనికిలోకి రాలేదు. దీన్ని ఒక సృష్టికర్త సృష్టించాడు. ఆయన ఉనికి అనన్యమయింది, ఆయన ఒకే ఒక్కడు. ఆయనకు సరిసమానమయినవాడు, సహవర్తుడు మరెవడూ లేడు. ఆయనకు సలహాదారుగాని, సహాయకుడుగాని, సహకారిగాని లేడు. ఆయన అధికారం అందరికన్నా ఉన్నతమయింది, విశాలమయింది, అనంతమూ అపరిమితమూ అయింది. ఈ నిఖిల జగతి ఆయన ఆదేశానికి లోబడి, విధేయమయి ఉంది. ఆయన ఇష్టం లేకుండా చెట్టునుండి ఒక్క ఆకు కూడా రాలదు, ఒక్క చీమ కూడా ప్రాకదు. అన్నీ ఆయన అవసరమున్నవే, ఆయనే అందరి, అన్నింటి అవసరాలను తీర్చేవాడు. ఒకరి ఆశలను ఆకాంక్షలను నెరవేర్చేవాడు ఆయన తప్ప మరెవరూ లేరు. ఆయన సర్వోపరిజ్ఞాని, పరమ వివేకీ, విజ్ఞతా ధురంధురుడు. ఆయన అత్యంత ఔచితీ విజ్ఞతతో, మరెంతో విశాల దృష్టితో ఈ జగతిని నిర్వహిస్తు న్నాడు. ఆయన చేసే ఏ పనిలోనూ కొరతగాని, తప్పుగాని ఏదీ కానరాదు. ఆయనే సకల శుభాలకు అన్ని మేళ్ళకు ఉనికిపట్టు; ఎటువంటి లోపాలకు గాని, దోషాలకు గాని అతీతుడు, పరిశుద్ధుడు.

ఈ భావనకు విశ్వంలో అన్ని వైపుల నుండి సమర్థన లభిస్తుంది. ఇక్కడి ప్రతి చిన్న పెద్ద వస్తువు అది సూర్యగోళమయినా, ధూళి రేణువయినా ఒక సాధికార అస్తిత్వానికి లోబడి మనగలుగుతున్నాయి. అది లేకుండా వాటి ఉనికీ లేదు, ఏ విధంగానూ అవి వ్యవహరించనూలేవు. భూమ్యాకాశాలలో చలనశీలమయిన ప్రతిదీ, నక్షత్రాల భ్రమణం, గాలి, నీటి ఏర్పాట్లు అన్నీ స్వయంగా చాటిచెబు తున్నాయి – ఈ విశ్వానికి ఒక కర్త ఉన్నాడని, ఆయనే దీన్ని నడిపిస్తున్నాడని.

ఈ భావన తప్ప మరే భావనా విశ్వవ్యవస్థకు సరిగ్గా వర్తించదు, దేని వల్లనూ ఈ వ్యవస్థకు పరిపూర్ణమయిన హేతువూ దొరకదు. ఈ భావనే మానవునికి అన్నింటికన్నా అధికంగా స్వీకారయోగ్యం. ఇది మానవుని బుద్ధితో, అతని అనుభవాలతో ఏకీభవిస్తుంది. మానవుడు ఏ వస్తువునూ దాని కర్త లేకుండానే ఊహించలేడు. అలాంటి అనుభవం కూడా మనిషికి ఎన్నడూ కలగలేదు. ఈ

విశ్వవ్యవస్థకు సంబంధించిన భౌతికతత్వం, లేక బహుదైవతత్వం ముందుంచకపోతే మనిషి ఈ వ్యవస్థను పరిశీలించగానే సహజంగా దీనికి ఒక కర్త ఉన్నాడని, ఆయన పరమాధికార సంపన్నుడని, ఆయనే దీన్ని నిర్వహిస్తున్నాడని ఎటువంటి అరమరికల్లేకుండా ఎలుగెత్తి చాటుతాడు. ఈ విశ్వాన్ని అధ్యయనం చేస్తే మనిషిలో ఉత్పన్నమయ్యే భావాన్ని ఇస్లామ్ ధ్రువీకరిస్తుంది.

ఇస్లామ్ తెలిపే విశ్వవ్యవస్థ భావనే మానవ నైజానికి, అతని భావోద్రేకాలకు, అతని గ్రహణ శక్తికి పూర్తిగా అనుగుణ్యమయింది, సామరస్యం కలది. మరే భావన వల్లనూ అతని భావాలకు పరిపూర్ణత సిద్ధించదు, సంతృప్తి లభించదు. ఈ విశ్వంలో ఎన్నెన్ని సాధనా సంపత్తులున్నా మానవుడు, తాను అత్యంత అశక్తుడని కనుగొంటాడు. ఒక వైపున అతని సహజ అవసరాలున్నాయి, ఆశలు, ఆకాంక్షలు, ఉత్సాహాలు, ఉబలాటాలున్నాయి. మరో వైపున వాటి పరిపూర్తి మార్గాన వచ్చే అవరోధాలున్నాయి. ఈ అవరోధాలు అడుగడుగునా అతని భావాలను గాయపరుస్తాయి. అతని అనుభూతులకు విఘాతం కలిగిస్తాయి. మానవుడు తరచుగా వీటిని భరించలేడు, నిరాశకు లోనవుతాడు. అతడు తనకు కావలసిన ఆహారాన్ని సంపాదించుకోవాలన్నా, వస్త్రాలు సమకూర్చుకోవాలనుకున్నా లేక ఏదయినా భౌతిక అవసరం తీర్చుకోవాలనుకున్నా, లేక ఏదయినా భావనా పూర్వకమయి, మానసికమయిన శాంతి, సంతృప్తిని పొందాలనుకున్నా వీటికి కావలసిన సాధనాలు అతనికి ఎల్లవేళలా ప్రాప్తం కావు.

గాలి అతని ఇష్టానుసారం వీయదు, వాన ఇతని ఆదేశం మేరకు కురవదు, భూమ్యాకాశాలలోని నిధులన్నీ ఇతని చేజిక్కవు. ఆరోగ్యం, శారీరక దారుఢ్యం అతని ఆధీనంలో లేవు. అందువల్ల అతను ఎల్లవేళలా విశ్వసించదగ్గ ఆధారం ఒకటి అతనికి కావాలి. అతను తుఫానులో, సుడిగుండంలో చిక్కుకున్నప్పుడు ఆ ఆధారాన్ని పిలిస్తే అది అతన్ని ఆ సుడిగుండం నుండి తప్పించాలి. అడవిలో దారితప్పిపోయినప్పుడు అతను కేక వేస్తే అది అతన్ని గమ్యం చేర్చాలి. అతని అమాయకుడయిన పసి బాలుడు వ్యాధిగ్రస్తుడయినప్పుడు, శుశ్రూష చేసేవారు నిరాశకులోనయితే, డాక్టరు పెదవి విరిస్తే, అప్పుడు ఇతను ఆయన ముందు చేయి చాచి అర్థిస్తే అతని చేతులు వరాలతో నిండిపోవాలి. ఒక్క మాటలో, ఆ

ఆధారం, అతని ప్రతి ఆపదలో ఆపద్బాంధవుడని, అతని అవసరాన్ని తీర్చేవాడు అని గట్టి నమ్మకం మనిషికి కలగాలి.

మానవుడు ఇలాంటి ఒక అస్తిత్వాన్ని వెదుకుతున్నాడు. ఇలాంటి ఒక అస్తిత్వం ఈ ప్రకృతిలో తప్పక ఉండాలని అతని ప్రకృతి ఘోషిస్తోంది. మానవుడు నివసించే జగతిలో మానవుని ఉనికికి, అతని మనుగడకు కావలసిన అత్యావశ్య మయినవన్నీ ఉండి అతని ఆంతర్యంలో అనుక్షణం ఉత్పన్నమయ్యే సహజమయిన ఆకాంక్ష పరిపూర్తికి కావలసిన ఎలాంటి ఏ ఏర్పాటూ లేకపోవడమన్నది సాధ్యంకాని విషయం. నీరు, గాలి మొదలుకుని జీవితంలోని ప్రతి చిన్న పెద్ద అవసరాన్ని తీర్చే విశ్వవ్యవస్థ, ఈ ఒక్క అవసరాన్ని - అది నెరవేరకపోతే ఈ విషయాలన్నీ అతనికి అర్థరహితమయిపోయేటటువంటి అవసరాన్ని - తీర్చే ఏర్పాటు చేయదా?

ఇస్లామ్ దీనికి సకారాత్మక సమాధానమిస్తుంది. మానవ నైజం చేసే ఈ అన్వేషణ అనవసర అన్వేషణకాదు అంటుందది. ఈ విశ్వంలో ఇలాంటి బలోపేత మయిన శక్తి ఉంది. దాని ఛాయలో మనిషి శరణు పొందగలడు. అదే దేవుని అస్తిత్వం. వేలాది లక్షలాది సజ్జనులయిన మనుషులు దీన్ని సమర్థిస్తారు. ఈ వ్యక్తులు ప్రపంచంలో ప్రతి చోటా, ప్రతి యుగంలోనూ దొరుకుతారు. వారు ఒక ఆస్తిత్వాన్ని విశ్వసించారు, నమ్ముకున్నారు. అది వారి ప్రార్థనలను ఆలకిస్తుంది, వారు దాన్ని అర్థిస్తే వారి కోరికలు నెరవేరుతాయి. వారు దాని సమక్షంలో తమ వినయ శిరస్సు వినమ్రం చేస్తే ఆ శక్తి సాన్నిహిత్యాన్ని అనుభవిస్తారు. వారు దాని మహత్తును ఔన్నత్యాన్ని అనునిత్యం కానగలుగుతారు. వారికి అన్ని వైపులా దాని అపార శక్తి మహిమలే దర్శనమిస్తుంటాయి.

ఈ మానవులంతా అబద్ధం చెప్పారని మనం చెప్పలేము. వారి జీవితాల్లో అబద్ధమూ, మోసమూ మనకు మచ్చుకయినా కానరావు. లేక వారే మోసపోయారని, లేక వారికి మంత్ర తంత్ర ప్రభావమయిందని కూడా అనలేము. వారు తమ కాలానికి చెందిన గొప్ప వివేకవంతులు, అంతర్ దృష్టి గలవారు, చాలా తెలివయినవారు. వారి ప్రవర్తన ఒక్కొక్కటే చాటి చెబుతుంది వారు మోసపోనూ లేదు, వారిపై మంత్రప్రభావమూ కాలేదని.

మానవ పరీక్ష

ఈ విశ్వవ్యవస్థలో ఒక సాధికార అస్తిత్వం ఉండి, దాని ఆదేశాలే అన్నింటి పైనా సాగుతున్నప్పుడు మానవుడు కూడా దానికే ఆజ్ఞాబద్ధుడు, విధేయుడయి ఉండాలి. భూమ్యాకాశాలు, సూర్యచంద్రులు ఎవరి అధికారానికి, ఆజ్ఞకు బద్ధులయి ఉన్నాయో మానవుడు సయితం ఆ శక్తి అధికారానికే లోబడి మనడం తప్పనిసరి. కాని మానవుడు స్వేచ్ఛను అనుభవిస్తున్నాడు. అతడు తనను, ఈ సృష్టికీ కర్త ఉన్నాడని అంగీకరిస్తాడు, ఒక్కోసారి అంగీకరించడు కూడా, ఆ శక్తికి విధేయుడై, ఆజ్ఞాబద్ధుడయి ఉండేందుకయినా, ఆజ్ఞోల్లంఘన జరపడానికయినా శక్తి కలిగి ఉన్నాడు. ఎందుకు?

దీనికి సమాధానమిచ్చింది ఇస్లామ్. ఇక్కడ మానవుని నిజస్థాయిని పరీక్షించడం జరుగుతుంది. మానవుడు ఆ స్థాయిని నిలబెట్టుకుంటాడా లేక దాన్ని ఉల్లంఘిస్తాడా? తన కర్త, స్వామి అయిన దైవానికి దాస్యం చేస్తాడా లేక ఆయన పట్ల విద్రోహానికి పాల్పడి అవిధేయుడవుతాడా? అన్నదే ఆ పరీక్ష. ఈ ఆశయ సిద్ధికి, మానవుణ్ణి ఒక రాయిలా ఎక్కడయినా నిలబెట్టడంగాని, కదిలే యంత్రంలా రూపొందించడంగాని సరయినది కాదు. అతనికి వాంఛనీయమూ, అవాంఛనీయమూ రెండు వైఖరుల్నీ ఆచరించే సమానమయిన స్వేచ్ఛ ఇవ్వడం అవసరం. పరీక్షకు స్వేచ్ఛే సరయిన పనిముట్టు. మానవుడు తప్ప ఈ విశ్వంలోని సమస్త చరాచర వస్తువులు తమ సృష్టికర్తకు విధేయత కలిగి ఉన్నాయి. ఆయన ఆదేశాన్ని ఇసుమంతయినా జవదాటలేవు. అందువల్ల వాటికి పరీక్ష కూడా లేదు.

ఈ ఉద్దేశ్యంతో ఈ విశ్వ వ్యవస్థనంతటినీ మానవునికి పరీక్షాస్థలంగా మార్చివేయడం జరిగింది. మానవుడు దాన్ని తన ఇష్టానుసారం వినియోగించుకునేందుకు వీలుగా దీని నిర్మాణం జరిగింది. నేలపైన పండే ధాన్యం ద్వారా శక్తిని ఆర్జించి అతడు తన స్వామి, ప్రభువుకు విధేయతను పాటించగలడు, ఆ శక్తినే ఆయన పట్ల అవిధేయతకూ వినియోగించగలడు. సూర్యుని వేడిమితో దేవుని సజ్జనులయిన దాసులూ లాభమొందుతారు, దుర్జనులూ లాభమొందుతారు. ఈ ప్రపంచంలో వ్యాపించి ఉన్న సాధనా సంపత్తిని వినియోగించి ఒక నేరస్థుడూ విజయం సాధించగలడు, సజ్జనులూ విజయం పొందగలరు. కేవలం మంచి

ఉద్దేశ్యానికే అవి వినియోగపడతాయని, చెడు లక్ష్యానికి వినియోగపడవని నియమం లేదు.

ఒక రాజ్యాధినేత, తన సామ్రాజ్యంలో తన ఇష్టానికి వ్యతిరేకంగా ఆచరించే తన అధికారుల్ని వెంటనే తొలగించి గట్టిగా శిక్షించినట్లే ఈ విశ్వవ్యవస్థకు నిజ స్వామి, మానవుని తప్పుడు చర్యలకు వెంటనే లెక్కలు అడగడు, అలాగే అతని మంచి వైఖరికి వెంటనే బహుమానాలూ ప్రసాదించడు.

బహుమానమూ, శిక్ష

అయితే మానవుని ఆచరణకు ఫలితం దక్కదని అర్థం కాదు. విశ్వకర్తకు విధేయులూ, అవిధేయులు, ఆజ్ఞల్ని పాలించేవారూ, ఉల్లంఘించేవారు- అందరి పరిణామమూ ఒక్కటే అవుతుందని, వారు తమ శీల స్వభావాల ఫలితాన్ని ఎదుర్కో రని కూడా అర్థం కాదు. ఇలా జరగటం ఈ విశ్వవ్యవస్థ నైజానికే విరుద్ధమయింది. విశ్వకర్త భావనకూ విరుద్ధమయింది, మనిషిని ఏ లక్ష్యంతో సృష్టించడం జరిగిందో దానికీ భిన్నమయింది.

విశ్వంలోని ఒక్కొక్క అణువూ తనలో ఓ ప్రత్యేకత కలిగి ఉంది. అలాంటి వ్యవస్థలో ఒక్క మానవుని ఆచరణలకే ఏ ప్రత్యేకతా లేదా? నిప్పులో వేడిమి, నీటిలో చల్లదనం ఉన్నాయి. వీటికన్నా ప్రభావవంతమయిన ఆచరణలకు ప్రత్యేకత ఉండదా? నేలపైన పారవేసే గింజలు వ్యర్థం కాకపోతే,మానవుడు రేయింబవళ్ళు ఆచరించే కార్యాలు వ్యర్థమయిపోతాయా? మనిషి దారిలో నడుస్తూ ఎదురు దెబ్బ తింటాడు, నొప్పి కలుగుతుంది. అతను కరవాలం ఆడించి ఒక కుటుంబాన్ని నాశనం చేసివేస్తే దానికి ప్రభావం అంటూ ఉండదా? వాన చినుకులతో నేల పచ్చదనంతో కళకళలాడితే ప్రపంచంలో సుఖమూ, శాంతి, విశ్రాంతి, నెమ్మది లభించే మానవుని ఆచరణలు నిష్ప్రయోజనమయిపోతాయా? ఇలా జరగడానికి వీల్లేదు. ప్రతి ఆచరణకు దాని ప్రభావం ఉంది. కాని అది ప్రకటితమయ్యే సమయం ఇది కాదు. ఒక చిన్న విత్తనంలో నిలువెత్తు చెట్టు దాగి ఉన్నట్లే, అది బయటపడడా నికి విత్తనాన్ని నేలలో పూడ్చడం అవసరమయినట్లే మానవ ఆచరణల్లో మంచీ చెడు ఫలితాలు, మనిషి పరీక్షా వ్యవధి పూర్తయిన తరువాత వ్యక్తమవుతాయి. ఆ

రోజున విశ్వకర్త తన న్యాయస్థానాన్ని నెలకొలుపుతాడు. ఆచరణా స్వేచ్ఛ ఇచ్చిన ఉద్దేశ్యాన్ని నెరవేర్చిన మానవులకు ఆయన బహుమానాలను ప్రసాదిస్తాడు. మరి ఆ ఉద్దేశ్యానికి హాని కలిగించే చేష్టలు చేసిన వారికి వారి చేష్టలకు ప్రతీకారం తీర్చుకుంటాడు.

మానవుల ఆచరణల లెక్క తీసుకునే రోజు రాకపోతే, మానవుల కర్తకు వారి మంచి, చెడు ఆచరణల పట్ల ఎలాంటి ఆసక్తి లేదని ఒప్పుకోవలసి ఉంటుంది. ఆయన దృష్టిలో మంచీ చెడూ రెండూ సమానమేనని, సత్యం అసత్యం రెండూ ధర్మబద్ధమేనని అనుకోవలసి ఉంటుంది. కాని మనమే నలుపూ తెలుపును, కల్తీ మేలిమిని ఒకటిగా భావించనప్పుడు విశ్వకర్త, న్యాయాన్యాయాలను, మంచీ చెడులను, నీతి అవినీతిని ఒకటిగా ఎలా పరిగణించగలడు? ఇంకా ఇది ఆయన ఔచితీ విజ్ఞతలకు కూడా తగనిది. మనిషికి స్వేచ్ఛనిచ్చి అతని ఆచరణల లెక్క అడగకపోవడం సమంజసమయినది కాదు. అందువల్ల బుద్ధి చెప్పేదేమిటంటే మనిషికి ఆచరణా స్వేచ్ఛనిచ్చినవాడు అతని చేష్టలు తనకు పట్టవని దూరంగా తొలిగిపోలేడు.

దైవ దౌత్యం

సత్ఫలితం, శిక్ష, బాధ్యతాభావం లాంటివి అమలు జరగాలంటే మానవుని సమక్షంలో సత్యాసత్యాలు, తప్పుఒప్పులు, ప్రస్ఫుటమయి రావాలి. మనిషి సత్యాన్ని అవలంబించదలిస్తే దానికి ఎలాంటి అవరోధం మిగులకూడదు. అజ్ఞానం, మూఢత్వం వల్ల అతను అపరాధానికి పాల్పడే పరిస్థితి ఏర్పడరాదు. ఏ దారిన నడిస్తే విజయం లభిస్తుందో, ఏ దారి పరాజయానికి మార్గమో తెలియనంతవరకు అసలు పరీక్ష అంటూ జరగదు. ఎవరినయినా చీకటిలో నిలబెట్టి తూర్పుకు వెళ్ళు పడమరకు వద్దు అని చెప్పలేము. అలాగే ఒక గుడ్డివాణ్ణి కూడా ఇలా కోరలేము.

ఈ ఉద్దేశ్యంతోనే మానవుల్లో దైవప్రవక్తలు వస్తారు. వారు విశ్వకర్త ప్రతినిధులు. మానవుల కర్తకు ఇష్టమయిన పనులేవో, ఏవి కావో వారు మానవులకు తెలుపుతారు. మానవులు అనుసరించవలసిన సరయిన మార్గమేదో, తప్పుడు దారి ఏదో, సత్యం ఏదో, అసత్యం ఏదో విడమర్చి చెబుతారు. వారి మాట విని,

వారి అడుగుజాడల్లో నడిచే వ్యక్తి, దేవుని అభీష్టాన్ని నెరవేర్చుతాడు. ఆయన బహుమానాలకు అర్హుడవుతాడు. వారు చూపిన దారిని కాదనేవారికి దేవుని ఆగ్రహం కలుగుతుంది. దైవ సందేశహరుణ్ణి గుర్తించడం, అతన్ని ఆశ్రయించడం మానవుల ధర్మం. విశ్వకర్త భువిపైకి వచ్చి ఫలానా వ్యక్తి తన సందేశహరుడని ప్రకటించడు. కాని ప్రవక్తలు తాము ప్రవక్తలు అయినందుకు మానవుల సమక్షంలో ఆధారాలు, నిదర్శనాలు చూపుతారు. ఈ విశ్వాన్ని చూసి మనం దాని కర్తను అంగీకరించినట్లే విశ్వకర్త సందేశహరుణ్ణి, అతని లక్షణాలను బట్టి నిజంగానే అతను దైవసందేశహరుడని నమ్మడానికి బద్ధులవుతాము.

ఒక వ్యక్తి విశ్వకర్తకు సందేశహరుడు అవడానికి ముఖ్యమయిన నిదర్శనం అతడు, ఈ విశ్వం ఏమిటో, ఎలా ఉనికిలోకి వచ్చిందో, ఎలా నడుస్తున్నదో, దీని ఉద్దేశ్యం ఏమిటో? మానవుడేమిటో? మానవుని పరిస్థితి ఏమిటో? అతడు చేయవలసిన పనేమిటో? అతని అంతిమ పరిణామం ఏమి కానున్నదో అనే విషయాలు నిర్ధారితంగా తెలుపాలి. ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికే దైవం తరఫు నుండి ప్రవక్తలు ప్రపంచంలోకి పంపబడతారు. అయితే ప్రవక్త అందజేసే సమాధానాలు, బోధనలు సశాస్త్రీయమై ఉండాలి, సామంజస్యతకు హేతువుకూ నిలువాలి. అతడు చేసే ఏ ప్రకటన అయినా మానవునికి బాగా తెలిసిన ఏ యదార్థానికీ విరుద్ధమయి ఉండరాదు, అవి, మానవుని పరిశీలనలు, అనుభవాలు తిరస్కరించేవి కాకూడదు, విశ్వకర్త సందేశహరుడు విశ్వంలోని ఏ యదార్థాన్నీ ఎరుగకపోవడం అన్నది సాధ్యం కాదు. సాధారణ మానవులు తెలుసుకోడానికి ఎలాంటి సాధనమూలేని అనేక విషయాలు అతనికి తెలిసే ఉంటాయి.

దైవసందేశహరుడు, దైవసందేశహరుడే అనడానికి రెండవ నిదర్శనం, అతను అల్లకల్లోలాన్ని, ఉపద్రవాన్నీ సృష్టించకూడదు, అతను మాటల ద్వారా చేతల ద్వారా శుభాన్నీ సంస్కారాన్నీ అందజేసే సందేశాన్ని ఇవ్వాలి. ఒక కల్లోల జనకుడు, ఉపద్రవస్రష్ట విశ్వకర్తకు విద్రోహీ, అవిధేయుడయితే కాగలడుగాని ఆయన ప్రతినిధి కాలేడు, ఆయన ప్రవక్త కాలేడు. ధరణిస్రష్ట ఇక్కడ కల్లోలం, ఉపద్రవం వ్యాపించడాన్ని ఇష్టపడడు. ఆయన ఇక్కడ సదా మంచినీ శుభాన్నే కోరుకుంటాడు.

మూడవ నిదర్శనం, మానవులకు వారి కర్త సందేశాన్ని అంద జేయడం తప్ప అతని ముందు మరో ఉద్దేశ్యం, లక్ష్యం ఉండరాదు. అతను హేయమయిన, నీచమయిన ఏ లక్ష్యాన్నీ చేబూని నిలువరాదు. అతని వెంట రేబవళ్ళు ఉండేవారు, అతను ఎవరి మధ్యనయితే పుట్టాడో వారు, ఇతను వంచకుడు అని, మోసగాడని, అసత్యవాది అని, దైవదౌత్యం నెపంతో తన ప్రపంచాన్ని బాగుపరచుకోగోరుతున్నా డని నిందించరాదు. ఎటువంటి నైతిక రుగ్మత కూడా అతనికి ఆపాదించబడరాదు. దైవదౌత్యం మహత్తరమయిన బాధ్యత. ఈ విశ్వంలో అంతకు మించిన మరో బాధ్యతను ఊహించనూలేము. అంత మహత్తరమయింది. ఈ ఉన్నత బాధ్యతకు అర్హతగా ఉన్నత, ఉత్తమ లక్షణాలు ఉండటం అవసరం.

నాల్గవ నిదర్శనం, ప్రతి వ్యక్తిలో తన కర్తను గుర్తించే భావం, సామర్థ్యం ఉంటుంది. అతనికి సహజంగా విశ్వకర్తతో సాన్నిహిత్యపు ఆనవాలేమిటో తెలిసి ఉంటుంది. తన కర్తకు సన్నిహితుడయిన వ్యక్తిలో ఎలాంటి లక్షణాలు తప్పనిసరిగా ఉంటాయో అతనికి తెలుసు. దేవునికి సన్నిహితుడయిన ఉత్తమ మహనీయ దైవ దాసునిలో ఉండవలసిన గుణగణాలు, ప్రత్యేకతలను గురించి మానవుల్లో శతాబ్దాల తరబడి ఏకాభిప్రాయముంది. అందువల్ల తాను దేవుని సందేశహరుడని వాదించే వ్యక్తి వాస్తవంగానే దేవుని సందేశహరుడా కాడా అని, సజ్జనులయిన దైవదాసులలో ఉండవలసిన సద్గుణాలన్నీ అతనిలో ఉన్నాయా లేవా అనీ ప్రతి వ్యక్తీ పరిశీలించి తెలుసుకోగలడు.

ప్రపంచంలో ఆవిర్భవించిన ప్రవక్తలందరూ ఈ ప్రమాణాలకు సరితూగే వారే. వారు ఏకగ్రీవంగా, సకల శక్తులకు, సామర్థ్యాలకు ఆలవాలమయిన అస్తిత్వాన్ని గురించి అంగీకరించారు. ఆ అస్తిత్వం ఈ విశ్వస్రష్ట అని, స్వామి, పాలకుడని తెలిపారు. విశ్వవ్యవస్థ పట్ల వీరందరి ఏకాభిప్రాయాన్ని బట్టి వీరికి విశ్వకర్త వద్దనుంచి నేరుగా ఈ విషయాలు తెలుస్తున్నాయని స్పష్టంగా ద్యోతకమవుతోంది. దైవప్రవక్తలు తప్ప మరే పెద్ద మానవ సముదాయమూ నేటి వరకు ఈ అగోచర యదార్థాల విషయంలో ఏకాభిప్రాయానికి రాలేదు. ప్రవక్తలు అందజేసిన నైతికత, సదాచారాలకు సంబంధించిన బోధనలు కలతలు, కల్లోలాలు సృష్టిస్తాయని ఏ ఒక్కడూ అనలేదు. వీటిని ప్రయోగించినప్పుడల్లా మంచి ఫలితాలే వచ్చాయి;

మానవులకు సుఖశాంతులు ప్రాప్తమయ్యాయి. ఈ బోధనల్ని ప్రపంచానికి అందజేయడమేకాదు, ప్రవక్తలు అందరికన్నా ముందుగా, అందరికన్నా అధికంగా వాటిని ఆచరించారు. వారు ఈ బోధనలకు మూర్తీభవించిన రూపాలుగా అలరారారు. వారి శత్రువులు సయితం వారి సౌజన్యం, సచ్ఛీలతల్ని ఒప్పుకున్నారు. ఎవరూ వారిని గురించి ఏ ఒక్క నైతిక నేరపు నిందనూ మోపలేదు. దీన్నిబట్టి, వారు తమ సందేశంలో అత్యంత చిత్తశుద్ధిగలవారని, ఎంతో గంభీరంగా తమకూ ఇతరులకూ సాఫల్య మార్గం ఆ సందేశంలోనే ఉందని నమ్మేవారని తెలుస్తోంది.

అంతిమ ప్రవక్త

ఈ ప్రత్యేకతలతోనే క్రీ.శ. 6వ శతాబ్దిలో మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) తాను దైవప్రవక్తనని ప్రకటించారు. ఈ విశ్వానికి ఒక స్రష్ట, స్వామి ఉన్నాడని, ఆయన ఆదేశం మేరకే భూమ్యాకాశాలు స్థిరంగా ఉన్నాయని, ఆయన చేతుల్లోనే రేబవళ్ళ భ్రమణం ఉందని ప్రకటించారు. ఆ స్వామియే జీవన్మరణాల అధికారం గలవాడని, ఆయనే ఆరోగ్యం, శరీర సౌష్టవం ప్రసాదిస్తాడని, ఆయనే అనారోగ్యాన్నీ వ్యాధినీ కలగజేస్తాడని తెలిపారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ విశ్వంలో కేవలం ఆయన ఒక్కరి ఆదేశమే సాగుతుందని, ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా ఎవ్వరికీ కిమ్మనే అవకాశం లేదని అన్నారు. ఆయన తన ప్రకటనకు నిరూపణగా విశ్వంలోని ఒక్కొక్క వస్తువును చూపారు. మానవులు ఆ స్వామి దాస్యమే చేయాలని, తమకు కావలసింది ఆయన్నే అర్థించాలని, ఆయనే ఆరాధనకు అర్హుడు, ఆయనే తన దాసుల కోరికలు ఈడేర్చేవాడని సందేశాన్ని అందజేశారు.

ఆయన బోధనల్లోని కొన్ని అంశాలను దిగువన చూపుతున్నాము:

మేము ఈ ఆకాశాన్నీ, ఈ భూమినీ వాటిలో ఉన్న సమస్తాన్నీ కాలక్షేపం కోసం సృష్టించలేదు. ఒకవేళ మేము ఏదైనా ఆట వస్తువును చేయదలిస్తే - అసలు మేము చేయవలసింది కేవలం ఇంతే అయితే - మేము మా వద్ద ఉన్న దానినే చేసుకునేవారము. కాని మేము అసత్యాన్ని సత్యంతో దెబ్బతీస్తాము, అది దాని తలను పగలగొడుతుంది. చూస్తూ ఉండగానే అది సమసిపోతుంది. మీరు కల్పన చేస్తున్న విషయాల కారణంగా మీకు సర్వనాశనం తప్పదు.

భూమిపైనా, ఆకాశాలలోనూ సృజింపబడినవన్నీ అల్లాహ్‌వే. ఆయన వద్ద ఉండే (దైవదూతలు) వారు తమను తాము గొప్పవారుగా భావించుకుని ఆయన దాస్యాన్నీ ధిక్కరించరు, బాధపడరు కూడ. రేయింబవళ్ళు ఆయన స్తోత్రం చేస్తూనే ఉంటారు, విశ్రమించరు. వారు ప్రపంచంలో కల్పించుకున్న దేవుళ్ళు (ప్రాణంలేని వాటికి ప్రాణం పోసి) లేపి నిలబెట్టగలరా? ఒకవేళ ఆకాశంలో, భూమిలో ఒక్క అల్లాహ్ తప్ప ఇతర దేవుళ్లు కూడా ఉంటే, అప్పుడు (భూమ్యాకాశాల) రెండింటి వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండేది. కనుక అధికార పీఠానికి ప్రభువైన అల్లాహ్ వారు కల్పించే విషయాల నుండి పరిశుద్ధుడు. ఆయన తాను చేసే పనులకు (ఎవరి ముందూ) జవాబుదారు కాడు. కాని అందరూ (ఆయన ముందు) జవాబు దారులే.

ఆయనను కాదని వారు వేరే దేవుళ్ళను కల్పించుకున్నారా? ఓ ప్రవక్తా! వారితో ఇలా అను, "మీ రుజువును తీసుకురండి. ఈ గ్రంథం కూడా ఉన్నది. అందులో నా యుగపు ప్రజల కొరకు హితబోధ ఉన్నది. నాకు పూర్వం ఉన్న ప్రజల కొరకు హితబోధ గరిపిన గ్రంథాలు కూడ ఉన్నాయి." కాని వారిలో చాలా మందికి యదార్థమేమిటో తెలియదు. కాబట్టి వారు విముఖులై ఉన్నారు. మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా, అతనికి వహీ ద్వారా, "నేను తప్ప దేవుడు లేడు. కనుక మీరు నాకే దాస్యం చేయండి" అనే విషయాన్నే తెలియ జేశాము. వారు, "కరుణామయుడు సంతానవంతుడు" అని అంటారు. అల్లాహ్ ఎంతో పరిశుద్ధుడు. వారు (దైవదూతలు) దాసులు, వారికి గౌరవం ఇవ్వబడింది. వారు ఆయన సాన్నిధ్యంలో ముందుకు వచ్చి మాట్లాడరు, కేవలం ఆయన ఆజ్ఞ ప్రకారమే నడుచుకుంటారు. ఆయన వారికి ముందు ఉన్న దానినీ ఎరుగును, వారికి గుప్తంగా ఉన్న దానినీ ఎరుగును. వారు ఎవరిని గురించీ సిఫారసు చేయరు, సిఫారసు వినటానికి అల్లాహ్ ఇష్టపడిన వాని విషయంలో తప్ప. ఆయన భయం వల్ల వారు భీతావహులై ఉంటారు. వారిలో ఎవరైనా, "అల్లాహ్‌తోపాటు, నేను కూడా ఒక దేవుడినే" అని అంటే, అతనికి మేము నరక శిక్ష విధిస్తాము. దుర్మార్గులకు మా వద్ద లభించే ప్రతిఫలం ఇదే.

(అల్ అన్బియా: 16-29)

ప్రవక్త మహనీయులు(స) ఒకే కర్త, స్వామి అయిన దేవుని ఆరాధన ఆధారంగా పరిపూర్ణ జీవన విధానాన్ని రూపకల్పన చేసి చూపారు. ఆరాధనా విధానాలు, సంబంధాల సూత్రాలు, శిక్షలు, చట్టాలు నియమించారు, కలసి మెలసి మెలగడం, కూర్చునే, నిల్చునే, తినే, త్రాగే, మాట్లాడే, వ్రాసే, నిద్రపోయే, మేల్కొనే మర్యాదలు నేర్పారు. జీవితం మొత్తాన్ని దైవ దాస్యానికి లోబడినట్లు మలిచారు. దేవుడూ, దాసుడూ ఉభయుల మధ్య సంబంధాన్ని ఎంతో కుదురుగా ఏర్పరిచారు. ఎట్టి పరిస్థితిలోనూ దానికి ఎలాంటి హాని కలగకుండా సముద్ధరించారు.

ఈ బోధనలు కొత్తవి కావు. పూర్వం ఇతర ప్రవక్తలు అందజేసిన బోధనలే ఇవి. ఆయనకు జ్ఞానం లభించిన కేంద్రం కూడా ఇతర ప్రవక్తలకు జ్ఞానం లభించిన కేంద్రమే అని స్పష్టంగా తెలుస్తోంది. లేకపోతే, ఒక వ్యక్తి, ప్రపంచంలోని తత్వాలు, జ్ఞాన బోధనలు ఏ మాత్రం ఎరుగనివాడు, చదవనూ వ్రాయనూ తెలియని వాడు, పండితులు, ప్రవీణుల సాంగత్యంలో జీవితం గడపని వాడు, కడకు ఏ పండితుణ్ణయినా ఎప్పుడయినా కనీసం కలవనయినా కలవని వాడు శతాబ్దాలకు పూర్వం ఇతర మానవులు చెప్పిన మాటలనే చెప్పడం ఎలా సాధ్యమయ్యేది?

ఆయన ఎలాంటి పూర్వజ్ఞానం లేకుండానే, ఎలాంటి అధ్యయన అనుభవమూ లేకుండానే అకస్మాత్తుగా దైవదాస్య సందేశాన్ని అందజేశారు. ఆయన జీవితంలోని ఒక్కొక్క కదలిక ద్వారా ఆ సందేశం పట్ల ఆయనకున్న ప్రగాఢ విశ్వాసం వ్యక్తమయ్యేది. శత్రువులు ఆయన్ని అనేక బాధలకు గురిచేశారు. అన్ని విధాలా బాధపెట్టారు, ఆకలి దప్పులకు గురిచేశారు. తూలనాడారు, రాళ్ళు రువ్వి కొట్టారు, కడకు స్వస్థలం వదలి వెళ్ళడం తప్ప గత్యంతరం లేకుండా చేశారు. కాని ఆయన విశ్వాసంలో ఏ మాత్రం కొరత రాలేదు, ఇంకా అది పెరుగుతూనే పోయింది.

ఆయన దైవం వైపునకు మరలమని ప్రపంచానికి సందేశం అందజేశారు, ఆ దైవానికే తను ప్రతి విషయంలో మొరపెట్టుకునేవారు. పూర్తిగా భిక్షువునిలా, అగత్యపరునిలా ఆ దైవం సమక్షంలో చేతులు చాచి అర్థించేవారు. రోదిస్తూ తన కోరికలు ఈడేర్చమని వేడుకునేవారు. రాత్రి ఏకాంతంలో ఆయన తన ప్రభువు సన్నిధిలో చేతులు చాచి ఆయన శిక్ష నుండి రక్షించమని మనవి చేసుకుంటూ

ఉండగా, ఆయన్ని చాలా మంది చూశారు. దైవకారుణ్య ఛాయల భిక్ష కోసం వేడుకునేవారు. ఈ విశ్వవ్యవస్థకు కర్త, స్వామి, పాలకుడయిన ఒక శక్తి పట్ల ఆయనకు ప్రగాఢ విశ్వాసముందని, ఆ శక్తి సమక్షంలో తన్ను తాను అత్యంత బలహీనుడిగా, అధీనుడిగా, అశక్తునిగా భావించేవారని ఆయన్ని చూసిన ప్రతి ఒక్కరు గ్రహించేవారు.

ఆయన తన ప్రాపంచిక జీవితాన్ని సుఖమయం చేసుకునేందుకు ఈ వేషమంతా వేశారని అనలేము. ఆయనకు అరేబియా అంతటా సర్వాధికారం ప్రాప్తమయినప్పటికీ ఆయన ఒక నిరుపేద జీవితాన్నే గడిపారు. సకల సౌకర్యాలు, సౌలభ్యాలు కలిగి, సౌభాగ్యవంతమయిన జీవితం గడిపే అవకాశాలున్నప్పటికీ ఆకలిదప్పులతో బీదరికపు బ్రతుకు బ్రతకడాన్నే ఆయన ఎన్నుకున్నారు. కేవలం చాపపైన కాకుండా, కనీసం పరుపు అయినా వేసుకుని విశ్రమించడాన్ని ఆయన ఇష్టపడలేదు. ఆయన సహచరులు, ఆయన కోసం కాస్త మెత్తని పరుపు తయారు చేయాలన్న అభిలాష వ్యక్తం చేస్తే "ఈ ప్రపంచమూ (దాని సుఖాలు, దానితోపాటు) నేను కూడానా?" అంటూ తనకు ఈ ప్రపంచంతో సంబంధమేమిటీ, ప్రపంచంలో నేనొక బాటసారిని. బాటసారి ఏదయినా నీడలో కాస్సేపు సేదతీరడానికి విశ్రమించి దాన్నే తన గమ్యం అని అనుకోడు. ఈ ప్రపంచం నా గమ్యం కాదు అనేవారు.

ఆయన తన వాదనలో అసత్యవాది అని కూడా మనం అనలేము. శత్రువులు సయితం ఆయన సత్యసంధుడు (సాదిక్) అని సాక్ష్యం పలికారు. జీవితంలోని ఏ విషయంలోనూ అబద్ధం పలకని వ్యక్తి ఓ ప్రత్యేక విషయంలో అబద్ధం పలికాడని నిందించడం ఎంత ఘోరమయిన అత్యాచారం? మన వద్ద దీనికి ఆధారం ఏముందనీ? ఒకరి మాట, దాని ఆధారాలు, నిదర్శనాలు మనకు తృప్తినివ్వకపోతే, మహాఅయితే ఆ మాట మనకు మింగుడుపడటం లేదని మాత్రమే అనగలము.

మరో విషయం; అబద్ధం పలికేవాడు చాలా కాలం వరకు తన అబద్ధపు మాట మీద నిలకడ చూపలేడు. కాని ఈయన పూర్తిగా 23 ఏళ్ళపాటు ఒకే మాటను మళ్ళీ మళ్ళీ చెప్పారు; దానికి విరుద్ధంగా ఎన్నడూ ఏ ఒక్క మాట కూడా

ఆయన నోట ఎవరూ వినలేదు. ఇంకా త్యాగధనులైన అభిమానులు ఆయన చుట్టూ చేరినట్లు ఒక అబద్ధాలకోరు చుట్టూ చేరరు. చేరినవారు తాము ఎన్నడూ చూడని అస్తిత్వం (దైవం) గురించి, దేవుని అభీష్టం గురించి వివరాలు ఆయన్ని అడిగి తెలుసుకునేవారు. దేవుని అభీష్టం ఏదో ఆయన తెలిపినప్పుడు వారు తమ ధనాన్నీ త్యాగం చేయడానికి సిద్ధమయ్యేవారు; తమ ప్రాణాన్ని అర్పించేందుకు వెనుకాడేవారు కారు. ఆయన సంజ్ఞ చేస్తే వారు పరుగిడి వాలేవారు. ఆయన పలికిన ప్రతి మాటను దృఢంగా నమ్మేవారు. ఒక అబద్ధాలు పలికే వాని పట్ల అతని అనుచరులు ఎప్పుడయినా ఎక్కడయినా ఇలా వ్యవహరిస్తారా?

ఆయన తన అనుయాయుల ఒక వర్గాన్ని సిద్ధపరిచారు. దైవం అవతరింపజేసిన గ్రంథాన్ని వారికి అప్పగించారు. ఇక దైవదౌత్య పరంపర నిలిచిపోయిందని ప్రకటించారు. దైవదౌత్యపు కట్టడంలో ఖాళీగా ఉన్న ఒక్క ఇటుక స్థలంలో ఆ ఇటుకనూ పేర్చడం జరిగింది. ఇక ప్రళయం వరకు ఆయనకు అవతరించిన గ్రంథాన్నే అనుసరించవలసి ఉంటుంది.

ఆయన్ని దేవుని ప్రవక్తగా అంగీకరించిన తరువాత, దైవదౌత్య అంతానికి సంబంధించిన ఆయన ప్రకటననూ అంగీకరించకపోవడానికి ఏ కారణమూ లేదు. ఆయన ప్రపంచానికి అందజేసిన గ్రంథం, ప్రవక్తలు ప్రపంచంలో ప్రభవిస్తూ వచ్చిన లక్ష్యం నెరవేరిందని సాక్ష్యం పలుకుతోంది. ఇక ప్రవక్తల ఆవిర్భావానికి ఏ అవసరమూ మిగులలేదు. ఆ గ్రంథంలో ప్రళయం వరకు అవసరమయిన శాశ్వత సూత్రాలూ సిద్ధాంతాలూ ఉన్నాయి.

3. మానవీయ సంబంధాలు

విభేదం, వివాదం

ఒకవేళ భూత, వర్తమాన, భవిష్యత్తుకు చెందిన మానవులనందరినీ ఎక్కడయినా ప్రోగుచేసి వారిని, వారి భావాలు, అనుభూతులు, అవసరాలను గురించి ప్రశ్నించినట్లయితే అందరి సమాధానాలు ఒకేలాగుంటాయి. ఏ వ్యక్తీ సుఖ దుఃఖాల భావాలు, వాటి భౌతిక ఆవశ్యకతలు లేనివాడు ఒక్కడూ కానరాడు, ఒకరి అనుభూతులు మరొకరి అనుభూతులకు, ఒకరి భౌతిక ఆవశ్యకతలు మరొకరి భౌతిక ఆవశ్యకతలకు భిన్నమయి ఉండవు. అయినప్పటికీ మానవులు విభిన్న వర్గాలు, గ్రూపులుగా విభజించబడి ఉన్నారు. ప్రతి వర్గం మరో వర్గంతో ఘర్షిస్తూ ఉంది. అంటే ప్రతి వర్గం, ప్రతి వ్యక్తి ప్రకృతి కూడా వేరయినది, వారి అవసరాలు భిన్నమయినవి అన్న మాట. ఆసియాకు చెందిన వానికి జీవితం గడిపే ఏ పదార్థాల అవసరం ఉందో, యూరప్, అమెరికాల వాసి వాటి విషయంలో సంతుష్టుడయి ఉన్నాడు. అతని అవసరాలు మరో విధంగా ఉంటాయి. రోమనుల భావాలు, అనుభూతులకు పూర్తిగా విరుద్ధమయిన భావాలు, అనుభూతులు గ్రీకులకు ఉంటాయి.

మానవులంతా తమ భావాలు, అనుభూతులు ప్రయోజనాలు, అవసరాల రీత్యా ఒకే ఏకాంకమయినప్పుడు, వారిని పరస్పర ఘర్షణకు, పోరుకు పురికొలిపే విషయమేమిటీ? సమాధానం ఒక్కటే. మానవుడు తనకు బాహ్యాజగతిలో ఒక లక్ష్యాన్ని అన్వేషిస్తాడు. దాని చుట్టూ తన జీవితాన్ని పరిభ్రమింపజేయాలని కోరుకుంటాడు. దానికోసం తన ధన ప్రాణాలు, సమయం శక్తుల్ని ధారపోయాలని ఉవ్విళ్ళూరుతాడు. ఇలాంటి లక్ష్యం ఒకటి లేకుండా అతనికి శాంతి లభించదు. అసలు అతను ఆ విధంగా జీవించడమే కష్టం. అయితే ఆ లక్ష్యం ఏదయి ఉండాలన్న విషయంలో మటుకు మానవుడు భిన్నాభిప్రాయాలు కలిగి ఉన్నాడు.

జీవితంలో తప్పుడు లక్ష్యాలు

ఒకరు, కుటుంబాన్నీ వంశాన్నీ సేవించడమే మానవ జీవిత లక్ష్యమని

అన్నారు. తన వంశాన్ని సమర్థించడం, దానికి చేదోడు వాదోడుగా నిలువడం, దాని ప్రయోజనాలకు కృషి చేయడం మానవుని పవిత్ర విధి. వంశమే మానవుని పరిపోషిస్తుంది. అదే అతని ఉనికికి మూలం, అదే అతన్ని క్రియాశీలునిగా రూపొందిస్తుంది. మానవుని సకల శక్తులూ సామర్థ్యాలు వంశం, తెగ ఉపకారాల ఫలితమే. అందువల్ల ఆ శక్తిసామర్థ్యాల ఉత్తమమయిన ఉపయోగం, వంశం సేవలోనే ఇమిడి ఉంది. తన వంశం కోసం తన శక్తిసామర్థ్యాలను వినియోగించిన మానవుడే సాఫల్యం పొందినవాడు.

దానికి బదులుగా మరో వాదన ముందుకువచ్చింది. మానవుని శక్తి సామర్థ్యాల పెంపుదలకు అతను పుట్టిన వంశం ఒక్కటే కారణం కాదు. అతని ప్రగతీ వికాసాలలో అనేక వంశాలు, తెగలు పాలుపంచుకుంటాయి. అందువల్ల మనిషి కేవలం తన వంశం, తెగల వరకే ఆలోచించాలనడం, దాని ప్రయోజనాల కొరకే సర్వమూ చేయాలనడం సబబు కాదు. అతని సేవలు కేవలం అతని వంశం, తెగల వరకే పరిమితం కారాదు. అవి విస్తృతం కావాలి. ఈ విస్తృతి ఒకే భాష మాట్లాడే తెగలో, వంశాలన్నింటికీ వర్తించాలి. భాషే విభిన్న తెగలను సమైక్యపరిచే ప్రముఖ సాధనం. దీని ద్వారానే భావాలలో సమిష్టితత్వం ఏర్పడుతుంది. తెగలు పరస్పరం దగ్గరవుతాయి.

భాషా విస్తృతి కూడా అనేక మార్లు కొన్ని వందల లేక కొన్ని వేల మైళ్ళ దూరంలో అంతమయిపోతుంది. కాని మానవుని అవసరాలు, ప్రయోజనాలు, బహుదూరాల వరకు వ్యాపించి ఉన్నాయి. వాటి పరిధి భాషాపరిధిని అధిగమిస్తుంది. అతనికి జీవితం గడిపేందుకు తన భాషకు భిన్నమయిన భాష మాట్లాడే తెగలవారి తోనూ సంబంధం పెట్టుకోవడం తప్పనిసరి అవుతుంది. అందువల్ల మానవుని ఆర్థిక, సామాజిక తదితర అవసరాలు ఇంకా విస్తృతమయినవి. అవి నైసర్గికంగా కొండలు, నదులు, ఉత్పాదన వనరులు, ఒకే విధమయిన వాతావరణం, రుతువులు ఇత్యాదివాటివల్ల ఏకమైన భూభాగం వరకు విస్తృతి పొంది ఉంటాయని భావించ బడింది. మానవుడు ఈ భూభాగం అంతటితో, ఇందులోని ఒక్కొక్క వస్తువుతో ప్రయోజనం పొందుతాడు. అందువల్ల మానవుని అసలు అంతిమ లక్ష్యం, ఈ భూభాగమంతటికీ తన సేవలందిచడంలోనే ఉంది. ఇందులో ఎన్ని భాషలు

మాట్లాడేవారున్నా, ఎన్ని జాతులు, తెగలూ ఉన్నా, ఎన్ని వర్గాల, వంశాల మనుషులు నివసిస్తూ ఉన్నా సరే.

నేటి యుగంలో ఈ లక్ష్యమే మానవుని అత్యుత్తమ లక్ష్యంగా పరిగణించ బడుతుంది. దీని కోసమే జీవించడం, దీని కోసమే మరణించడం నేడు మానవత్వపు మహోన్నత స్థాయి. ఈ లక్ష్యంకోసం అంతమయిపోయే వ్యక్తి స్మారకాన్ని నిర్మించి అతన్ని గుర్తుంచుకోవడం ధర్మంగా భావించబడుతుంది. అతడు మరణించిన తరువాత అతని పటం సమక్షంలో గౌరవపురస్సరంగా మర్యాదలు పాటించడం భావ్యమని, అతని ప్రస్తావన చరిత్ర పుట్టల్లో భద్రపరచడం అవసరమని తలంచ బడుతుంది.

పైన పేర్కొన్న జీవితాశయాలన్నీ మానవుల్ని సమైక్యపరిచేవి కావు, అవి విచ్ఛిన్నం చేసేవి. వాటిలో ప్రతి లక్ష్యం ఒక పరిమిత లక్ష్యమే. అది ప్రత్యేక వర్గాల, సముదాయాల ప్రయోజనాల కోసమే ఉనికిలోకి వచ్చింది. వీటిలో ఏదీ మానవులందరి ప్రయోజనాలను చర్చించదు. ఒక పరిమిత లక్ష్యం సాధించాలంటే విస్తృత లక్ష్యాన్ని దెబ్బతీయనిదే సాధ్యం కాదు. ఇది వాస్తవం. అందువల్ల ఒక పరిమిత లక్ష్యం కొరకు, ఎవరి ప్రయోజనాలు దెబ్బతింటాయో వారు ద్రోగు కావడం అసంభవం. మానవుని జీవితాశయం కొన్ని ప్రత్యేక కొండలు, నదుల మధ్యన పరిమితమయిపోతే వాటికి ఆవల నుండే మానవులకు దానిపట్ల ఏ విధమైన ఆసక్తి జనిస్తుంది? వారు ఆ కొండలు, నదుల వల్ల ప్రయోజనం పొందడం లేదు కదా? ఒకరి దృష్టి తమ స్వభాషీయులయిన వ్యక్తుల వరకు వెళ్ళి ఆగిపోతే ఇతర భాషీయులు అతనితో సంబంధం పెట్టుకుంటారా, అతన్ని ప్రేమిస్తారా? అలాగే ఒక మనిషి ప్రేమకు కేంద్రం అతని తెగ, లేక జాతి అయినట్లయితే ఇతర జాతుల వారి లాభనష్టాలతో అతనికి ఎలాంటి ఆసక్తీ లేనప్పుడు వారు అతనితో సంబంధం పెట్టుకోవటానికి కారణమేముంది?

అందువల్లనే ప్రతి వ్యక్తి, ప్రతి సంస్థ, ప్రతి జాతికి భక్తి ప్రపత్తుల, ప్రేమాభి మానాల మూర్తి వేర్వేరుగా ఉంది. వారు తమ మూర్తిని సంతోషపెట్టడానికి ఇతరుల మూర్తుల్ని నిందిస్తారు, ఖండిస్తారు, కించపరుస్తారు, తూలనాడుతారు. ఆసియాకు చెందినవాడు యూరపు పట్ల, అక్కడి జాతులు, భాషలకు ప్రతిగా విద్వేషం, వైషమ్యం

ఏర్పరచుకుంటాడు. అలాగే యూరపు నివాసి ఆసియాకు చెందిన ప్రతిదాన్ని ద్వేషిస్తాడు. అమెరికాలో ఆఫ్రికాకు స్థానం లేదు, అమెరికా అంటే ఆఫ్రికాకు విసుగు, విద్వేషం.

దీనికి పరిష్కారంగా విశ్వమానవ సోదరభావ భావన ముందుకు వస్తుంది. అంటే జాతులన్నీ తమ సమిష్టి ప్రయోజనాల కొరకు సమైక్యమయిపోవాలి. వాటి సాధనకు కలసిమెలిసి కృషి చేయాలి. తామూ జీవించాలి, ఇతరుల్నీ జీవించనివ్వాలి. కాని ఇది ఊహాజనితమయిన భావన. క్రియా జీవితం దీన్ని సమర్థించదు. మానవుని ప్రయోజనాలు అతని సిద్ధాంతాలకు లోబడి ఉంటాయి. మనిషి, యుద్ధం, సంధి, స్నేహం, శత్రుత్వం అన్ని వ్యవహారాలూ సిద్ధాంతాల ఆధారంగానే నెరుపుతాడు. సిద్ధాంతాల్లో వైరుధ్యం ఉంటే ప్రయోజనాల్లో సమైక్యత సాధ్యం కాదు. కమ్యూనిజాన్ని నమ్మేవాడు పెట్టుబడిదారీతో సంధి ఒడంబడిక చేయడు. జాతి తత్వంలో నమ్మక మున్నవాడు విరోధజాతి ప్రగతిని సహించడు. ఆలోచనల్లో భిన్నత్వాన్ని గురించి చరిత్ర తెలిపే దాన్నిబట్టి ఈ భిన్నత్వం వల్ల మానవుల్లో సదా వివాదాలు, పోరాటాలు సాగాయి. అలాంటప్పుడు అదే వారి మధ్య ప్రేమానురాగాలకు మార్గం కావడం అసంభవం. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, ఒక భూభాగంలో మనిషికి ప్రయోజనం చేకూరనప్పుడు, ఒక జాతి సిద్ధాంతాలు, విశ్వాసాలు అతని విశ్వాసాలు, సిద్ధాంతా లకు భిన్నమయినప్పుడు, అతని భాషతో మరో భాష సమ్మతం కానప్పుడు అతను వారిని ఎందుకు ప్రేమించాలి? ఇది ఒక సహజమయిన ప్రశ్న. దీన్ని ఇట్టే త్రోసిపుచ్చ లేము. విశ్వజనీన మానవ సోదర భావం సిద్ధాంతాన్ని అందజేసినవారు దీనికి సమాధానం చెప్పడంలో నేటివరకు సఫలీకృతులు కాలేకపోయారు.

సరయిన దృక్పథం

ఇస్లామ్ మానవులందరూ ఒక్కటే అని నిర్ణయిస్తుంది. అది మానవులందరికీ ఒకే ఆశయాన్నీ నిర్ధారిస్తుంది. మానవులందరి కర్త, స్వామి ఒక్కడే, ఆయన భారతీయునికి వేరుగా, చైనీయునికి వేరుగా, రష్యన్‌కు వేరుగా, అమెరికన్లకు వేరుగా లక్ష్యాలు నిర్ణయించలేదు. మానవుల సృష్టికర్త, భువిపై నివసించే ప్రతి వ్యక్తిని, ప్రతి వర్గాన్ని తన దాస్యం చేయమని కోరాడు. ఈ లక్ష్యం విషయంలో

అరబ్బేతరులు ఇది అరబ్బులకే చెందిందని, అరబ్బులు ఇది అరబ్బేతరులకు చెందిందని అనలేరు. ఇందులో ప్రతి వర్గం, ప్రతి వంశం, ప్రతి భూభాగానికి చెందిన మానవులకు ఆకర్షణ ఉంది. తమ కర్త, స్వామి, మహోపకారి వైపునకు మరలడం, ఆయనకు చేరువ కావడం మానవ ప్రకృతిలోని సహజమైన అంశం. అడుగడుగునా ఆయన వైపునకు మరలడానికి, ఆయన శరణులో రక్షణ పొందడానికి అశక్తుడయి ఉన్నాడు మనిషి. కష్టాల్లో అతను ఆయన అండను వెదుకుతాడు, సంతోషాల్లో ఆయన ఉపకారాలకు కృతజ్ఞతాభివందనాలు అర్పించుకుంటాడు. అందువల్ల ఆయన దాస్యం మానవులందరి లక్ష్యం. ఆయన్ని నమ్మడంలో ప్రతి వ్యక్తికి చెందిన వ్యక్తిగత ప్రయోజనముంది. ఆయన్ని తృణీకరించడంలో వ్యక్తిగత నష్టముంది.

పరమ ప్రభువు దైవానికి జాతిగాని, కులంగాని లేదు. ఆయనకు వంశమూ లేదు తెగ కూడా లేదు. ఆయన ఉనికి ఏదో ఒక భూభాగానికి పరిమితం కాదు. ఆయన ఎల్లెడలా ఉన్నాడు. ఎల్లరినీ చూస్తున్నాడు, మొరాలకిస్తున్నాడు, సహాయ పడుతున్నాడు. ఆయనతో ప్రతి మానవుడు బాంధవ్యం నిర్మించుకోవచ్చు. తెల్లవాడు, నల్లవాడు, శ్రామికుడు, యజమాని, కర్షకుడు, వ్యాపారి, చదువుకున్నవాడు, చదువు చెప్పేవాడు, పాలకుడు, పాలితుడు–అందరూ ఆయన దృష్టిలో సమానులే. అందరూ ఆయన వైపునకు సాగగలరు. ఆయనకు చేరువయి ప్రేమకు పాత్రులవగలరు. ఏ వ్యక్తీ ఆయన సమక్షంలో తన వంశం, కులం రీత్యానూ ఉన్నత స్థానం పొందలేడు లేక తన హోదా, స్థానాన్ని బట్టి కూడా పొందలేడు. ఆయన్ని చేరడానికి బీదరికమూ అడ్డుకాదు, సంపదా సహాయపడదు. ఆయన తన వైపునకు వచ్చే ప్రతి వ్యక్తిని ముందడుగు వేసి తనలో చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. అతను ఆఫ్రికాకు చెందిన వాడయినా, అమెరికాకు చెందినవాడయినా, ఇంగ్లీషు మాట్లాడేవాడయినా అరబీ మాట్లాడేవాడయినా సరే – తన్నుతాను ఆయన దాస్యంలో సమర్పించుకునే వానికే ఆయన వద్ద గౌరవాదరణలు, ఔన్నత్యాలు లభిస్తాయి; అతను, ఆయన శిక్షకు భయపడాలి, ఆయన కారుణ్యానికి తపించాలి.

మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని

జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను.

(అల్ హుజురాత్: 13)

దైవభీతి లేని ఆంతర్యాలున్నవారు, ఆయన విధేయతకు విముఖులైనవారు-ఇలాంటివారిని వారి ప్రాభవ వైభవాలు, అధికారాలు, పరిపాలనా శక్తి ఆయన శిక్ష నుండి తప్పించజాలవు. భువిలో ఎన్ని జాతులు, ఎందరు వ్యక్తులు ఉండేవారు, వారికి తమ శక్తిసామర్థ్యాలు, బలాధిక్యత పట్ల గర్వం ఉండేది. వారు దైవదాస్యాన్ని తిరస్కరించారు. ధరణిలో తలబిరుసుతనాన్ని అవలంబించారు. ఫలితంగా వారు భువినుండి దుష్ట పదంలా చెరిపి వేయబడ్డారు. దైవప్రవక్తలు కూడా ఆయనకు సన్నిహితులవడానికి కారణం వారు అందరికన్నా అధికంగా ఆయన ఆజ్ఞాబద్ధులైన వారు కావడమే. వారు ఆయన ఆదేశాలకు విముఖులయినట్లయితే వారికి కూడా ఆయన శిక్షనుండి రక్షణ ఎక్కడా లభించేదికాదు. మహనీయ ముహమ్మద్(స) అందరికన్నా ఎన్నికగన్న దాసుడు. ఆయన నోటి ద్వారా ఇలా ప్రకటన చేయించడం జరిగింది.

"నేను నా ప్రభువాజ్ఞను ఉల్లంఘించినట్లయితే, నాకు ఆ మహానాటి శిక్ష పడుతుందని భయపడుతున్నాను." **(అల్ అన్ఆమ్ : 15)**

దేవుని భూమిలో నివసించేవారిలో ఆయన బహుమానాలు, వరప్రసాదాలకు అర్హులయినవారు, ఆయన పట్ల నిష్ఠాపరులయినవారు, భయభక్తులు కలవారే అన్న మాట దీనివల్ల రూఢమవుతుంది. దేవుని పట్ల నిష్ఠ తప్ప మరే విషయమూ దైవానికి మనిషిని సన్నిహితపరిచేది, ఆయన పట్టు నుండి కాపాడేది ప్రపంచంలో లేనేలేదు. మానవుల మధ్య వర్ణం, వంశం, భాష, భావం, వృత్తి, కృషి, జాతి, దేశం వంటి వ్యత్యాసాలు తారతమ్యాలకు, హెచ్చుతగ్గులకు నిదర్శనాలు కావు. ప్రకృతిలోని దేవుని అసంఖ్యాకమయిన చిహ్నాల్లా ఇవి కూడా ఆయన చిహ్నాలే. అసలు ఆధిక్యత, అధికారం, కేవలం దేవునికే చెల్లు అని ఇవి చాటి చెబుతున్నాయి. ఆయన తాను కోరినవారిని సుందరంగాను మరొకరిని వికారంగాను సృష్టిస్తాడు. తాననుకున్నవారికి సంపదలు అనుగ్రహిస్తాడు, అనుకున్నవారికి అది ప్రాప్తం

కాకుండా చేస్తాడు. ఎవరిని ఏ భూభాగంలో పుట్టించదలుస్తాడో అక్కడ పుట్టిస్తాడు; ఏ భాష నేర్పాలనుకుంటాడో అది నేర్పుతాడు. ఏ వ్యక్తి అయినా వీటిలో దేన్నయినా తన గొప్పతనానికీ మరొకరి హీనతకు ఆధారమని భావిస్తే అతను ప్రకృతిలోని ఒక చిహ్నం ద్వారా గుణపాఠం గ్రహించేందుకు సిద్ధంగా లేడన్నమాట. దేవుని నిదర్శనాలను అధ్యయనం చేయగల సామర్థ్యమున్న దృష్టిని అతను కోల్పోయా డన్నమాట.

ఆయన సూచనలలో ఒకటి ఏమిటంటే; ఆయన మిమ్మల్ని మట్టితో సృష్టిం చాడు. తరువాత అకస్మాత్తుగా మీరు మానవులయ్యారు. (భూమిపై) వ్యాపిస్తూ ఉన్నారు.

ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే; ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు-మీరు వారివద్ద శాంతిని పొందడానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.

ఆయన సూచనలలో, ఆకాశాలనూ, భూమినీ సృష్టించటమూ, మీ భాషల, మీ రంగుల వైవిధ్యాలూ ఉన్నాయి. నిశ్చయంగా విజ్ఞులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.

ఆయన సూచనలలో రాత్రి, పగలు, మీరు నిద్రపోవటం, మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటం కూడా ఉన్నాయి. నిశ్చయంగా, (శ్రద్ధగా) వినేవారికి ఇందులో చాలా సూచనలు ఉన్నాయి. (అర్ రూమ్ : 20-23)

ఈ భావన మానవుల మధ్య దురభిమానాలను అంతమొందిస్తుంది, వారిని ఒకే ఏకాంకంగా రూపొందిస్తుంది. దీన్ని విశ్వసించిన తరువాత మనిషిలో గౌరవపరాభవాల బూటకపు భేదభావాలు తలెత్తవు. దేవుని దాస్యభావన, బానిస-స్వాములను, పాలిత- పాలకులను, రాజు- ప్రజలను, అందరినీ ఒకే వరుసలో నిలబెడుతుంది.

చరిత్రలో సాగిన విషాదకరమయిన విషయమేమిటంటే, మానవ శ్రేయో సాఫల్యాల పేరిట స్వార్థం, స్వప్రయోజనాభిలాషలకు ప్రోత్సాహం లభించింది.

మానవుల్ని వర్గాలుగా, ముఠాలుగా విభజించింది. వారిమధ్య వివాదాలు, సంఘర్షణలు సృష్టించింది. ఇస్లామ్ తప్ప ప్రపంచంలోని ప్రతి సిద్ధాంతమూ మానవుణ్ణి మానవుని సానుభూతిపరునిగా కాక అతని విరోధిగా, శత్రువుగా చేసి, మానవుల్ని ఒకరికెదురుగా మరొకరిని నిలబెట్టింది. ఫలితంగా వంశాలు, తెగలు నాశనమయ్యాయి; వర్గ పోరాటాలు ఉబికాయి. జాతీయ యుద్ధాలు జరిగాయి. హింస, హత్య, దోపిడి, విధ్వంసం, మానభంగాలు విచ్చలవిడిగా సాగాయి. ఒక అత్యాచార గాధ ముగియకమునుపే మరో అత్యాచార గాధ అంతకన్నా భయంకర మయింది మళ్ళీ మొదలయింది. ఈ అన్యాయాలు, అత్యాచారాలు ఏ మేరకు సాగాయంటే, వీటిని కొనసాగనివ్వడానికి ఎదుటి వ్యక్తి ఫలానా వేరే జాతికి చెందినవాడనడమే చాలని అనుకున్నారు. ఫలానా జాతి మేము మాట్లాడే భాష మాట్లాడకపోవడమే చాలని కూడా అనుకున్నారు, లేదా మాకు సంబంధించిన భూభాగంతో సంబంధం లేకపోవడం కూడా చాలని భావించడమూ జరిగింది. ఒక దేశం మీద లేక ఒక జాతిమీద దండెత్తడానికి, ఆ దేశం లేక ఆ జాతి జర్మను జాతి కాకపోవడమే చాలని జర్మనులు ఆధారంగా పేర్కొన్నారు. ఈ అన్యాయాన్నీ, అత్యాచారాన్నీ అంతమొందించగల సిద్ధాంతమేదీ ఇంతవరకు ఎవరూ ముందుంచలేకపోయారు. మానవులందరి సమానత, మానవాళిలోని అన్ని వర్గాల పట్ల న్యాయం ఆధారంగా, మానవులనందరినీ సోదరులుగా ఎంచే ఏ సిద్ధాంతమూ ఏ సూత్రమూ ముందుకు రాలేదు. అందువల్లనే ఇస్లామ్ వైపునకు దృష్టి మరలినప్పుడు మరోవైపు చూసే అవసరం ఏర్పడదు.

అన్యాయం, అత్యాచారాల అంతం

వాస్తవానికి దేవుని దైవత్వంలో గట్టి నమ్మకం, ఆయన దాస్యభావనల ద్వారానే దోపిడి, ద్వేషం, అక్రమం, అన్యాయం, వైషమ్యం, అత్యాచారం లాంటివి అంతమవుతాయి. వీటిస్థానే పరస్పర శ్రేయోభిలాష, సానుభూతి, ప్రేమానురాగాలు ఉద్భవిస్తాయి. దేవుని దాస్యం మానవుని నుండి రెండు విషయాలను కోరుతుంది. ఒకటి, అతను తన భావాలు, అనుభూతులు ఆయనకు అర్పించుకోవాలి, ఆయన సమక్షంలో వినయ విధేయతలతో చేతులు కట్టుకుని నిలబడాలి. తలవంచాలి, అశక్తతా భావంతో వినమ్రుడయి ఆయన సన్నిధిలో పడిపోవాలి. దీన్నే

పారిభాషికంగా ఆరాధన అంటారు. దేవుని దాస్యం కోరే రెండవ కోరిక, మనిషి తన శక్తిసామర్థ్యాలు, తనకు ప్రియమయిన విషయాలు త్యాగం చేయాలి. దీని క్రియారూపమే మానవుల సేవ. దైవదాసులయిన మానవుల సేవ చేయడం, దేవుని సేవ చేయడంతో సమానం. వారి పనులు చేసిపెట్టడం దేవుని కార్యాలు నిర్వహించ డంతో సమానం. మీ సమక్షంలో ఒక దైవదాసుడు చేయిచాచినపుడు మీరు అతన్ని ఖాళీగానే త్రిప్పి పంపినట్లయితే మీరు దేవుని చెయ్యిని ఖాళీగా పంపినట్లు భావం. ఒక వ్యాధిగ్రస్తుడు మీ సహాయానికి అర్హుడయి ఉండగా మీరు అతనికి సహాయ పడకపోతే మీరు దేవునికి సహాయపడటాన్ని నిరాకరించినట్లు. దైవాన్ని ప్రసన్నునిగా చేసుకోవడానికి దేవుని దాసుల ప్రసన్నత పొందడం అవసరం. దివిన ఉండేవాడు సంతోషపడాలంటే భువిన ఉండేవారిని సంతోషపెట్టాలి. ఈ యదార్థాన్ని ప్రవక్త మహనీయులు (స) ఒక సంవాదం రూపంలో ఎంతో మనోజ్ఞంగా, ఎంతో ప్రభావ వంతంగా వివరించారు. ప్రళయ దినాన అల్లాహ్ మానవుణ్ణి సంబోధిస్తాడు:

'ఆదమ్ పుత్రుడా, నేను అస్వస్థతకు లోనయి పడి ఉంటే నీవు నన్ను పరామర్శించలేదు.'

మానవుడు, 'ప్రభూ, నీవు నిఖిలజగతికి పాలకుడవే నేను నిన్ను పరామర్శిం చడమా?' అని ఆశ్చర్యపోతాడు.

దైవం అప్పుడు ఇలా అంటాడు, 'నా ఫలానా దాసుడు వ్యాధిగ్రస్తుడయి ఉండటం నీవు ఎరుగవా? అయినా నీవు అతన్ని పరామర్శించడానికి వెళ్ళలేదు. నీవు అతని వద్దకు వెళ్ళి ఉంటే అక్కడ నన్ను పొందేవాడివి.'

దేవుడు మళ్ళీ అడుగుతాడు, 'ఆదమ్ పుత్రుడా, నేను నిన్ను అన్నం అడిగాను కాని నీవు పెట్టలేదు' అని.

మానవుడు, 'స్వామి, నీవు సకల లోకాలకు పోషకుడవే నేను నీకు ఎలా అన్నం పెట్టగలను?' అని విన్నవించుకుంటాడు.

అప్పుడు సెలవీయడం జరుగుతుంది, 'నా ఫలానా దాసుడు నిన్ను అన్నం అర్థించిన విషయం, నీవు అతనికి అన్నం పెట్టని విషయం నీకు గుర్తు

లేదా? నీకు తెలియదా, నీవు ఆనాడు అతనికి అన్నం పెట్టి ఉంటే ఈనాడు ఇక్కడ నీకు దాని ప్రతిఫలం లభించేది.'

దేవుడు తిరిగి అడుగుతాడు, 'ఆదం పుత్రుడా నేను నిన్ను నీళ్ళు అడిగాను, కాని నీవు నాకు నీళ్ళు ఇవ్వలేదు' అని. దానికి దాసుడు, 'నా ప్రభూ, నీవు సర్వలోకాల స్వామివి, నేను నీకు నీళ్ళు ఇవ్వడమా?' అని మనవి చేసుకుంటాడు.

అప్పుడు దేవుడు పురమాయిస్తాడు, 'నా ఫలానా దాసుడు నిన్ను నీళ్ళు అడిగాడు, కాని నీవు ఇవ్వలేదు. అతనికి నీవు నీళ్ళు త్రాపించి ఉంటే ఇక్కడ దాని ఫలితం పొందేవాడివి.' **(ముస్లిమ్)**

సానుభూతి

దైవప్రవక్త (స) మక్కాలో పదమూడేళ్ళు ఇస్లామ్ సందేశాన్ని అందజేస్తూ ఉన్నారు. ఈ పదమూడేళ్ళ కాలంలో ఆయన సందేశానికి కేంద్రబిందువు, దైవదాస్యం, దేవుని దాసులయిన మానవుల పట్ల ప్రేమ, సానుభూతి. ధర్మానికి మూలాలు ఇవే. వీటి నుంచే ఇతర వివరాలన్నీ ముందుకు వస్తాయి. ఆయన అందజేసే ఈ సందేశాన్ని స్వీకరించేవారికి ఆయన పరలోక సాఫల్యం పొందే శుభ సందేశాన్ని ఇచ్చేవారు. దాన్ని కాదన్న వారికి నిష్ఫలతా హెచ్చరిక చేసేవారు. ఈ రెండు మూలాలను పటిష్ఠపరచడానికే నమాజ్, జకాత్‌లను పాటించాలని మాటిమాటికీ తాకీదు చేసేవారు. నమాజ్, దాసుని ఆరాధనా భావానికి వ్యక్తీకరణ. జకాత్ ద్వారా మానవుడు, తాను, తోటి మానవులయిన దైవదాసుల శ్రేయోభిలాషి అని, సానుభూతిపరుడని ప్రకటిస్తాడు. ఈ రెండు పునాదులు గట్టిపడకపోతే ధర్మం నిలువజాలదు.

నమాజ్ మానవ జీవితంలో అంతర్లీనమయిపోకపోతే మానవ భావాల్లో అనుభూతుల్లో దాస్యస్ఫూర్తి పుట్టజాలదు. అలాగే మానవుల పట్ల ప్రేమ సానుభూతి భావాలు లేని ఆంతర్యాలలో ఉన్నత నైతికత జనించడం అసాధ్యం. మానవుల మధ్య ప్రేమానురాగాలు సృజించే మార్గం ఇదొక్కటే. ఇది లేకుండా వారిలో దయ, కటాక్షం వంటి భావాలు ఉత్పన్నం కావు, వారు పరస్పరం త్యాగం చూపలేరు,

వారిలో క్షమ, చూపోపు గుణాలు పుట్టవు. మానవులకు సాంఘిక, సామాజిక నిర్దేశాలిచ్చే ముందు ఇస్లామ్ వాటికి ప్రతిరూపాలయిన మానవుల్ని రూపొందించింది. వారు దేవుని ఆజ్ఞాబద్ధులు, మానవుల సానుభూతిపరులుగా మారారు. వారు ఇలాంటి స్థితికి చేరుకున్న తరువాత ధర్మబోధనల వివరాలు వారి ముందు పెట్టడం జరిగింది. అప్పుడు వాటిని ఆచరించడం వారికి సులభతరమయిపోయింది. ఇస్లామ్ విశ్వసించేవారి ప్రత్యేక సుగుణాన్ని ఇలా ఎత్తిచూపుతుంది.

తమ నమాజులో వినమ్రతను పాటిస్తారు. జకాత్ విధానాన్ని ఆచరిస్తారు.

(అల్ మూ'మినూన్ : 2,4)

ప్రళయ దినాన నరకంలోకి వెళ్ళేవారు తమ అపరాధాన్ని ఇలా ఒప్పుకుంటారు.

దానికి వారు ఇలా అంటారు, "మేము నమాజు చేసే వారిలోని వారం కాము, నిరుపేదలకు అన్నం పెట్టేవాళ్లం కాము". (అల్ ముద్దస్సిర్ : 43-44)

మానవుడు దేవుని ఆరాధనాపరుడుగా, మానవుల శ్రేయోభిలాషిగా మారనంత వరకు ధర్మం అతనికి మోయలేని బరువుగా మారుతుంది. దాన్ని మోస్తూ అతను ఎంతో దూరం నడవలేడు.

మానవ ప్రేమ, దైవదాస్యం

కాస్త ఆలోచిస్తే ఈ రెండూ ఒక్కటే అనిపిస్తుంది. దైవ సన్నిధిలో భక్తిపూర్వకంగా, ప్రేమపూర్వకంగా తలవంచడం, ఆయన మార్గంలో తనకు ఇష్టమయిన వాటిని త్యాగం చేయడం, రెండూ ఒకే వాస్తవానికి భిన్నరూపాలు. ఇది ఒకే భావన. క్రియారూపం ధరించగానే రెండు భిన్న ఆకారాలలో దర్శనమిస్తుంది. దైవ దాస్యమున్న చోట దేవుని దాసుల పట్ల ప్రేమ కూడా తప్పనిసరిగా ఉంటుంది. లేకపోతే దైవదాస్యంలో ఏదో లోపముందన్నమాట.

బహుదైవారాధకులు దైవారాధన చేసేవారు. కాని ఖుర్ఆన్ వారికి దైవాగ్రహాన్ని గురించి వినిపించింది. వారు దైవారాధనకు తాము కల్పించుకున్న సొంత విధానాన్ని అనుసరిస్తున్నారని, ఆరాధనా స్ఫూర్తికి బహుదూరంగా ఉన్నారని

చెప్పింది. దానికి నిదర్శనంగా, వారి హృదయాలు, అగత్యపరుల కొరకు, నిరుపేదల కొరకు ఆర్ద్రమవ్వవని, వారు వారిని కసరుకుంటారని, గెంటివేస్తారని, వారి సంకుచిత మనస్తత్వానికి పరాకాష్ట ఏమిటంటే సాధారణంగా వాడుకునే వస్తువులు కూడా ఇతరులకు ఇవ్వరని ఎత్తి పొడిచింది.

పరలోక శిక్షను, బహుమానాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా? అతడే అనాథలను కసరికొట్టేవాడు, పేదవాళ్ళకు అన్నం పెట్టు అని ప్రోత్సహించని వాడు. పోతే, తమ నమాజుల పట్ల అశ్రద్ధ వహించేవారు, ప్రదర్శనా బుద్ధితో వ్యవహ రించేవారు, వాడుకునే మామూలు వస్తువులను (ప్రజలకు) ఇవ్వటానికి వెనుకాడేవారు సర్వనాశనమవుతారు. **(అల్ మాఊన్ సూరా)**

ఖుర్ఆన్, నిరుపేదల సహాయాన్ని నమాజ్ వల్ల తప్పనిసరిగా ఏర్పడే ఫలిత మని అంటుందని దీనివల్ల తెలుస్తోంది; ఈ రెండూ ఒకదానికొకటి అవినాభావ సంబంధమున్న అంశాలుగా అది పరిగణిస్తుంది. ఈ రెండూ ఒకే మూలం నుంచి వెడలుతాయి. దైవ ప్రేమ నిండిన హృదయం దాసుల కష్టాలకు పరితపించడం సహజం. ఈ కారణంగానే ఖుర్ఆన్ దైవదాస్యాన్నీ దైవదాసుల పట్ల ప్రేమ భావాన్నీ, శ్రేయోభిలాషను ఒకేసారి ప్రస్తావిస్తుంది. రెంటికీ ఒకే లాంటి ప్రాముఖ్యాన్నిస్తుంది. దాని దృష్టిలో ఆ రెంటికీ అవినాభావ సంబంధముంది. అందువల్లనే కొన్ని చోట్ల ప్రేమ సానుభూతుల్ని దైవారాధనకు మారుగా పేర్కొన్నది. అంటే మానవుల పట్ల శ్రేయోభిలాషా భావన వారి ప్రభువుతో సంబంధానికి నిదర్శనమన్నమాట.

రోజా (ఉపవాస వ్రతం) పూర్తిగా ఆరాధనారూపం. ఇందులో మానవుడు దైవం కొరకే అన్న పానీయాలు వదలి ఆకలి దప్పులతో గడుపుతాడు, తన భావోద్రేకా లను అదుపుచేసుకుంటాడు. కాని మీరు గమనిస్తే, బాధితులయిన మానవుల సహాయాన్నీ, వారి పట్ల శ్రేయోభిలాషను ఈ స్వచ్ఛమయిన దైవారాధనకు సమానంగా ఎంచుతుంది దివ్య ఖుర్ఆన్.

ఎవరయినా తన భార్యను తల్లితో సమానంగా పరిగణించి, తరువాత భార్యగా పొందాలని కోరుకుంటే దానికి ఆదేశం, అపరాధ పరిహారంగా ఒక బానిసను విడుదల చేయించడం; లేదా అరువయి దినాలు ఎడతెగకుండా

ఉపవాసాలు పాటించడం, లేదా అరువయి మంది నిరుపేదలకు భోజనం పెట్టడం అని నిర్ణయిస్తుంది ఖుర్‌ఆన్. (ముజాదిలా : 2,3)

ఒట్టుకు పరిహారం, పది మంది నిరుపేదలకు భోజనం, బట్టలు పెట్టడమని, లేదా ఒక బానిసను విడుదల చేయించడం, లేదా మూడు రోజులు రోజా వ్రతాన్ని పాటించడం అని బోధించడం జరిగింది. (అల్ మాఇద:89)

హజ్ కాలంలో, హజ్‌కు పూర్వం ఉమరా చేయదలిస్తే కుర్బానీ చేయాలి, కుర్బానీ చేయలేకపోతే పది రోజులు రోజా వ్రతాన్ని పాటించాలి. (అల్ బకర: 196)

ఈ ఆదేశాలు బానిసను విడుదల చేయించడాన్నీ, నిరుపేదలకు భోజనం, వస్త్రాలు పెట్టడాన్నీ, కుర్బానీ చేయడాన్నీ రోజాకు సమానంగా పరిగణించడం జరిగింది.

ఆరాధనల్లో ఏదయినా లోపం ఉండిపోతే వాటి పరిహారంగా కూడా దైవదాసుల పట్ల సానుభూతి, దయ చూపడాన్నే పేర్కొనడం జరిగింది. హజ్‌కోసం ఇహ్రామ్ దుస్తులు ధరించిన తరువాత క్షవరం చేయడాన్ని నిషేధించడం జరిగింది. కాని ఏదయినా కారణం వల్ల క్షవరం చేయించవలసి వస్తే రోజా పాటించడం లేదా కుర్బానీ చేయడం లేదా దాన ధర్మాలు చేయడాన్ని సూచించడం జరిగింది. (అల్ బకర: 196)

రమజాన్ రోజాల తరువాత ఫిత్రా దానాన్ని నియమించడం జరిగింది. దీనికి కారణంగా, రోజాలలో అభిలషణీయంకాని వ్యర్థకార్యాలేవయినా జరిగితే వీటివల్ల ఆ లోటు తీరుతుందని సూచించడం జరిగింది. (అబూదావూద్)

దీన్ని మించి మరో విషయం. ఎవరయినా వృద్ధాప్యం, వ్యాధి కారణంగా రోజా వ్రతాన్ని పాటించే స్థితిలో లేకపోతే వారు రోజాకు బదులుగా ఒక నిరుపేదకు భోజనం పెట్టాలన్నది ఆదేశం.

దేవుని వరప్రసాదాలు

ఈ నిదర్శనాల ద్వారా, ఆరాధనల్లోనూ మానవ ప్రేమలోనూ ప్రగాఢ,

సన్నిహిత సంబంధముందన్న విషయం రుజువవుతోంది. ఆరాధనాసారం ఏమిటంటే మానవుడు దేవుని వరప్రసాదాలు, మహోపకారాల స్పృహతో, కృతజ్ఞతా భావాన్ని తన హృదయంలో నింపుకోవాలి. సమధికోత్సాహంతో తన్నుతాను దైవం సమక్షంలో అర్పించుకోవాలి. ఇదే ఆరాధనాసారం. మానవ ప్రేమాభిమానాల సారం కూడా ఇదే కృతజ్ఞతాభావం. మానవుడు, తనకు చూసే కళ్ళు, మాట్లాడే నోరు, ఆలోచించే, అర్థంచేసుకునే బుద్ధి, జీవితం గడిపేందుకు సౌలభ్యాలు, విలాస సామగ్రి ప్రాప్తమవడం చూసుకుంటాడు. ఇతర మానవ సోదరులనేక మంది ఈ వరప్రసాదాలకు దూరమయి ఉన్నారన్న విషయమూ గమనిస్తాడు; కొందరికి జీవించే కనీస అవసరాలైన తిండి బట్టలు కూడా ప్రాప్తం కాలేదని గమనిస్తాడు, వెంటనే అసంకల్పితంగా దేవునికి కృతజ్ఞతలర్పించుకుంటాడు. తన సంపాదనలో కొంత భాగాన్ని వాళ్ళకై కేటాయిస్తాడు. నేడు నేను ఈ ఉపేక్షిత జనావళిని ఆదుకుంటే రేపు పరలోకాన నా అవసరాన్ని దైవం తీరుస్తాడని ఆలోచిస్తాడు. నేడు దేవుని దాసునికి వస్త్రాలు ధరింపజేస్తే రేపు దైవం నాకు ధరింపజేస్తాడు, నేడు నేను ఆకలిగొన్న వానికి తినిపిస్తే రేపు నాకు ఆకలిదప్పుల నుండి దైవం రక్షిస్తాడు అనే ఆలోచనలు, కృతజ్ఞతా భావాలు అతన్ని చుట్టుకుంటాయి.

దైవం అందజేసిన వరప్రసాదాల పట్ల ఎవరిలోనయినా ఇలాంటి భావాలు ఉత్పన్నం కాకపోతే అతని హృదయంలో దేవుని వరప్రసాదాల స్పృహ కూడా లేదన్న భావం ద్యోతకమవుతుంది. దైవభక్తి భావనలేని మనస్తత్వంలోగల లోపం ఇదే. మనిషి తన ఉనికి ద్వారానూ, ఈ విశ్వం ద్వారాను ప్రయోజనం పొందుతుంటాడు కాని దీన్ని దేవుని అనుగ్రహమని భావించడు. ఇతని దృష్టిలో మహావర ప్రసాదాలు నిండిన ఈ విశాల జగతి కేవలం యాదృచ్ఛిక మహిమ. తన ఉనికిలో అనేక శక్తి సామర్థ్యాలు సమకూరడం, వాటి ద్వారా స్వేచ్ఛగా అతను విశ్వాన్ని వినియోగించుకోవడం కూడా అతని దృష్టిలో యాదృచ్ఛికమే. ఈ భావన మనిషిలో దయ, ప్రేమ భావాలను అంతమొందిస్తుంది. మనిషికి ప్రాప్తమయింది ఏదీ ఎవ్వరూ ఇవ్వనప్పుడు అందులో ఇతరుల వాటా అంటూ ఉండటానికి ఆస్కారమేది?

బహుదైవ ప్రధానమయిన మనస్తత్వం, దైవభావన కలిగి ఉన్నా అది ఎంతో అస్పష్టంగా, చిక్కులతో కూడుకున్నదిగా ఉంటుంది. అది మానవునికి దేవుని

వరప్రసాదాల గ్రహణం, నిజ స్పృహ ప్రసాదించదు. దివ్యఖుర్ఆన్, మానవునికి ప్రపంచంలో లభించిందంతా దైవం తరఫుననే లభించిందన్న భావనను ప్రేరే పిస్తుంది. దాన్నిబట్టి, దైవదాసులయిన తోటి మానవుల హక్కు మానవునికి విధ్యుక్త మయిపోతుంది.

మేము అతనికి రెండు కళ్ళూ, ఒక నాలుకా, రెండు పెదవులూ ప్రసాదించ లేదా? ఇంకా స్పష్టమైన రెండు (మంచీ చెడుల) మార్గాలను అతనికి చూపాము. కాని అతడు కష్టతరమైన కనుమ దాటిపోవటానికి సాహసించలేదు. కష్టతరమైన ఆ కనుమ అంటే ఏమిటో మీకు తెలుసా? ఎవరినైనా బానిసపు బంధనాల నుండి విముక్తి గావించటం లేదా ఆకలిగొన్న రోజున సమీప అనాథుడికి లేదా దిక్కులేని నిరుపేదకు అన్నం పెట్టడం. (అల్‌బలద్: 8-16)

వరప్రసాదాలు దైవం ప్రసాదించినవిగా భావించడం మానవునిలో కృతజ్ఞతా భావాన్ని సృజిస్తుంది. అది అతన్ని ఇతరుల పట్ల సానుభూతిపరునిగా, శ్రేయోభి లాషిగా తీర్చిదిద్దుతుంది. ఇతరులకు ఏదయినా ఇస్తూ తాను వారికి ఉపకారం చేస్తున్నానన్న భావం కన్నా దైవం తనకు దయతో అనుగ్రహించిన దాన్నే ఇస్తున్నానన్న స్పృహ అతనిలో జాగృతమవుతుంది. నేడు తనకు ప్రాప్తమయిన వరాలన్నీ తన ప్రయత్నం వల్ల దొరికినవీ, తన కష్టార్జితమూ కావని, అవి తనకు దూరమూ కావ చ్చని, తన నుండి వాపసు తీసుకోబడగలవనీ ఆలోచిస్తాడు. ఈ స్పృహ కలగగానే మనిషి తనకు దొరికిన వరాలపైన నిధినాగులా కూర్చోకుండా అవి దైవ ప్రసాదితా లన్న భావనతో ఆయన మార్గంలో వ్యయపరచాలన్న భావం అతన్ని పీడిస్తుంది.

ఇస్లామ్‌లో ఈ భావానికే అసలు విలువ. ఈ భావం లుప్తమయి మనిషి ఎన్ని ఖర్చు పెట్టినా ఇస్లామ్ దాన్ని వ్యర్థమని భావిస్తుంది. ఒక బండరాయి పైన కొంత దుమ్ము పేరుకుపోగా దాని మీద విత్తనాలు వెదజల్లి పంట పండుతుందని ఎవరయినా ఆశించడం లాంటిదే ఈ విధమైన దానధర్మాలు.

ఈ భావనను ప్రేరేపించడంతోపాటు ఇస్లామ్ నిర్ధారితంగా తెలుపుతుంది- న్యాయసూత్రాలేమిటో, అన్యాయం ఎక్కడి నుండి ప్రారంభమవుతుందో; తోటి మానవులతో ఏ విషయాల ఆధారంగా వ్యవహారాలు నెరపాలో, ఏ విధానాల వల్ల

ఈ వ్యవహారాలు తప్పయినవిగా, అసత్యాలు, అధర్మాలుగా రూపొందుతాయో చెబుతుంది. ఈ నిర్ధారణ వల్ల వ్యక్తికీ సమాజానికీ – ఉభయులకు సులభమయి పోతుంది – మానవుని వ్యవహారాలను ఈ ప్రమాణాల ఆధారంగా పరిశీలించ గలగటమయినా అందులో ఏమయినా పొరపొచ్చాలుంటే సంస్కరించడమయినా.

దైవ విశ్వాసం, ఆయన మార్గదర్శకత్వం ఆధారంగా ఏర్పడిన సంబంధాలు, ఇలాకాక ఇతర ఆధారాల మీద ఏర్పడ్డ సంబంధాలు – రెంటికీ భూమ్యాకాశాలంత తేడా ఉంటుంది. మొదటి కోవకు చెందిన సంబంధాలు దైవాదేశాలను భంగపరచ నంత వరకు తెగజాలవు. కాని రెండవ కోవకు చెందిన సంబంధాలు ఏ క్షణమైనా ముక్కలుచెక్కలు కావచ్చు. దైవాన్ని విశ్వసించే వ్యక్తి, దైవం నెలకొలపాలని ఆదేశిం చిన సంబంధాలనన్నింటినీ, తనకు ఇష్టమయినా కాకపోయినా, కాపాడవలసి ఉంటుంది. అతని పట్ల అన్యాయం జరిగినా, న్యాయం జరిగినా సరే ఆ సంబంధా లను కొనసాగించడానికి దైవ విశ్వాసి బద్ధుడై ఉంటాడు. కాని దైవాన్ని విశ్వసించని వ్యక్తి తనకు నష్టకరమయిన ప్రతి సంబంధాన్ని త్రెంచివేయగలడు, తనకు లాభకర మయితే తనకు అత్యంత సమీప బంధువునయినా మోసగించగలడు. అతనికి జవాబు చెప్పుకోవలసిన స్పృహ ఉండదు. అందువల్ల అతను అన్ని రకాల విద్రోహా లకు పాల్పడడం సాధ్యమే. కాని విశ్వసించిన వ్యక్తి తన శత్రువునయినా వంచించ లేడు, అతని పట్ల విద్రోహానికి పాల్పడలేడు. అతని దైవం అతన్ని అలా చేయరాదని వారిస్తాడు.

ప్రేమాభిమానాలు ప్రారంభం

మనిషి, తోటి మానవుల పట్ల సానుభూతితో, బాధలను పంచుకునే భావాలతో క్రియారంగంలో దిగినప్పుడు అతని ముందు మొట్టమొదట అతని భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, సోదరీ సోదరులు, పొరుగువారు, బంధువులు కనిపిస్తారు. వీరిని అనునిత్యం అతను ఎదుర్కొంటూ ఉంటాడు. ఇస్లామ్ దృష్టిలో ఈ దగ్గరి వ్యక్తులే అందరికన్నా అధిక సద్వర్తనకు, సేవకు అర్హులు. వీరిని కాదని వేరే వారి కోసం అతను తన ధనాన్ని ఖర్చుపెట్టలేడు.

ఒకసారి ఒక వ్యక్తి వచ్చి ప్రవక్త మహనీయులను ప్రశ్నించాడు, 'నా వద్ద ఒకే దీనారుంది, దాన్ని ఏం చేయాలి?' అని. దానికి ఆయన, 'దాన్ని నీ స్వంత అవసరాలకు ఖర్చు చేసుకో' అని సెలవిచ్చారు. అతడు నా వద్ద మరో దీనారుంది అని అడిగాడు. ఆయన 'దాన్ని నీ సంతానం కొరకు ఖర్చుపెట్టు' అన్నారు. అతను, 'నా వద్ద మూడో దీనారుంది' అని ప్రశ్నించాడు. 'దాన్ని నీ భార్య కోసం ఖర్చు చేయి' అని ఆయన చెప్పారు. 'నా వద్ద నాల్గవ దీనారుంది' అని అతను మళ్ళీ అడిగాడు. ఆయన 'ఇది నీ బానిస (నౌకరు)కు ఇవ్వవలసిన వాటా'అన్నారు. అతను, 'నా వద్ద ఇంకా ఒక దీనారుంది' అని అంటే ఆయన, 'దీన్ని ఎలా ఖర్చు చేయాలో నీవే నిర్ణయించుకో' అని బదులిచ్చారు. **(అబూ దావూద్, నసాయి)**

మానవుడు సద్వర్తనను, శ్రేయోభిలాషను తన ఆత్మీయుల నుండి ప్రారంభిం చాలి. ఇది సహజమయిన విషయం. వీరికి తోడ్పడడం మనిషికి భారమనిపించదు. తనకు ఆత్మీయులయిన వారి విషయంలో ఖర్చుపెట్టాలన్న ప్రేరణ అతనిలో కలుగుతూ ఉంటుంది కూడా. ఇస్లామ్ ఈ సహజ భావానికి చట్టపరమయిన రూపమిచ్చింది. దీనివల్ల ప్రతి వ్యక్తి సర్వావస్థల్లో దాన్ని పాటించడానికి బద్ధుడయి ఉంటాడు. మానవుడు తనకు చెందిన ఏ వస్తువు, ఏ విత్తు విషయంలోనయినా, తన చుట్టూ ఉండే, తన సుఖదుఃఖాల్లో పాలుపంచుకునే వారే దానికి అర్హులయిన వారని భావిస్తాడు. ఒకరి తండ్రి ఆకలిదప్పులతో బాధపడుతూ ఉంటే అతను తన ధనాన్ని, తనకు కేవలం మానవీయ సంబంధమున్న ఇతరుల కొరకు ఖర్చుపెట్టడం సరయినది కాదు. అతని తండ్రికి అతనితో మానవీయ సంబంధమూ ఉంది, రక్త సంబంధమూ ఉంది. అందువల్ల అతను రెండు విధాలుగా అతని సద్వర్తనకు అర్హుడు. ప్రవక్త మహనీయులు(స) ఇలా సెలవిచ్చారు:

"ఒక అగత్యపరునికి దానం చేయడం కేవలం దానమే అవుతుంది. కాని ఒక బంధువు కోసం ఖర్చుపెట్టడం దానమూ అవుతుంది, బంధుత్వపు బాధ్యతా అవుతుంది." **(అహ్మద్, తిర్మిజి, నసాయి, ఇబ్ను మాజ)**

అంటే బంధువుల ఎడ సద్వర్తనకు రెండింతల పుణ్యఫలం ప్రాప్తింస్తుం దన్న మాట. దీనివల్ల ఎంతో ప్రయోజనం ఒనగూడుతుంది. సమాజంలో ఏ వ్యక్తి

కూడా తన్నుతాను అశక్తునిగా, నిరాధారునిగా, అభాగ్యునిగా భావించడు. అతని చుట్టూ సహాయ సహకారాలు అందజేసేవారు మెండుగా సతతం ఉంటారు. తండ్రి కొడుకుకు సహాయకుడుగా, కొడుకు తండ్రికి సహాయకుడుగా, సోదరుడు సోదరునికి సహాయకుడుగా, బంధువులు పరస్పరం సహాయకులుగా ఉంటారు. ఈ నమ్మకం మనిషిలో బలోపేతమయిన శక్తిని ఉత్పన్నం చేస్తుంది.

ప్రేమభావానికి విస్తృతి

ప్రతి వ్యక్తి చుట్టూ ప్రేమభావనతో ఒక పరిధిని సూచించడం అంటే ఆ పరిధికి వెలుపల ప్రేమానురాగాలకు ఎలాంటి విలువలేదని అర్థం కాదు, లేదా ఇస్లామ్ దాన్ని తప్పుగా పరిగణిస్తుందని కూడా భావం కాదు. దీని భావం కేవలం, మానవునికి ఆత్మీయులయిన వారు అతని సిరిసంపదలకు దూరం కారాదన్నదే. మొదట ఎవరు, తరువాత ఎవరు అన్నదే ఇక్కడ ప్రశ్న. నిజానికి మానవ సమాజంలో కొందరు విలాసమయ జీవితాన్ని భోగభాగ్యాలను అనుభవిస్తూ ఉండగా మరికొందరు ఆకలిదప్పులతో, బట్టలు లేక అలమటిస్తూ ఉండటాన్ని మానవతకే అవమానకరమని ఇస్లామ్ భావిస్తుంది. అది మానవత ఆధారంగా సమాజాన్ని నిర్మిస్తుంది. దాని బోధన ప్రకారం, మిత్రులు, శత్రువులు, తనవారు, పరాయివారు, పరిచితులు, అపరిచితులు, దేశీయులు, పరదేశీయులు అని కాకుండా అందరిపట్ల కూడా సద్వర్తన కలిగి ఉండాలి. దాని దృష్టిలో మానవుడు, మానవునిగానే విలువగలవాడు. అది ఏ విధంగానూ మానవత వ్యర్థమవడాన్ని సహించదు. ప్రతి మనిషి ఎదుటి మనిషిని కాపాడటానికి సాధ్యమయిన ప్రతి ప్రయత్నం చేయాలని, అది అతని విధి అని భావిస్తుంది. అలా కాపాడకపోతే అతను దేవుని వరప్రసాదాన్ని వ్యర్థపరచిన అపరాధిగా పరిగణించబడతాడని అంటుంది.★

అత్యాచారం అన్నది సదా అధికారసత్తాతో, ప్రభుత్వంతోపాటు ఉంటూ

★ వివరాలకు రచయిత పుస్తకం "మానవ సేవ" చదవండి. అందులో ఇక్కడ ప్రస్తావించిన విషయాన్ని అన్ని కోణాలలో సవివరంగా చర్చించడం జరిగింది.

వచ్చింది. మనిషికి అధికారం ప్రాప్తంకాగానే అతను తన్నుతాను నిరంకుశ ప్రభువని భావించాడు. ఎక్కడ బలహీనుడు దొరికినా గొర్రెల్లా, మేకల్లా భావించి వధించడం మొదలెట్టాడు. ఈ అత్యాచారానికి సాధారణంగా మూడు వర్గాలు గురయ్యాయి. స్త్రీలు, బానిసలు, పాలిత ప్రజలు. ఈ మూడు వర్గాలు బానిసత్వపు భావనలకు ప్రతీకలయ్యాయి. న్యాయం ధర్మం అన్నవి అసలు వీరి హక్కు కాదన్న భావన స్థిరపడిపోయింది. స్త్రీ గాధ అంతా పీడన గాధ. అత్యాచారానికి సంబంధించిన ప్రతి ఆయుధం ఆమెపై ప్రయోగించడం జరిగింది. ఇస్లామ్ స్త్రీని పురుషునిలోని భాగంగా ప్రకటించింది. ఈ విధంగా పురుషుడు స్త్రీపై చేసే అత్యాచారాలన్నీ నిజానికి అతను తన స్వయం మీద చేసుకుంటున్నాడన్న యదార్థాన్ని చాటిచెప్పింది. స్త్రీపైన అత్యాచారం చేసే పురుషుడు దాన్ని స్త్రీపైన కాదు తన మీదనే చేసుకుంటాడు.

బానిసత్వపు అవశేషాలు కొన్ని నాగరిక దేశాల్లో నేటికీ దర్శనమిస్తుంటాయి. వీటిని బట్టి గతాన్ని ఊహించుకోవచ్చు. ఇస్లామ్ నౌకరు, యజమానుల మధ్య సోదర సంబంధాన్ని నెలకొలిపింది. యజమాని, తాను తిన్నదే నౌకరుకు పెట్టాలని, తాను తొడిగిందే నౌకరుకు కూడా ధరింపజేయాలని ఆదేశించింది. పాలకుడు, పాలితుల సంబంధం కూడా యజమాని, బానిసల కన్నా మెరుగ్గా ఉండేది కాదు. మానవుల ఒక వర్గం మరో వర్గాన్ని తన దాస్యం, సేవల కొరకు కేటాయించుకుని పెట్టుకుంది. ఇస్లామ్ పాలకుడు, పాలితుల ఈ భావనను అంతమొందించింది. పరిపాలన అంటే సేవకు మరో పేరుగా ప్రకటించింది. పాలకుడు తన పాలిత ప్రజల సేవకుడే తప్ప స్వామి కాదని చాటింది.

4. దైవ శాసనం

శాసనకర్త దేవుడే

సమాజంలో ప్రజల మీద పరిపాలన చేసే శక్తి చట్టానికి ఉంది. చట్టం వ్యక్తుల స్వేచ్ఛను నియంత్రిస్తుంది. వారి ఆచరణా పరిధుల్ని నిర్ధారిస్తుంది. ఇస్లామ్ ప్రకారం చట్టం అన్నది దైవానిదే. ఒక పనిని చేయమని లేదా చేయరాదని ఆదేశించే అధికారం కేవలం దైవానికే చెందినది. ఈ విశ్వంలో ఆయనకే సర్వసత్తాక అధికారం, ఆధిక్యతలు ప్రాప్తమయి ఉన్నాయి. మానవులంతా సమాన స్థాయి గలవారు. ఎవరికీ మరొకరిపైన పెద్దరికం, ఆధిక్యతల్లేవు. ఎవరయినా ఇక్కడ తన అధికారాన్ని చెలాయించాలని కోరుకుంటున్నాడంటే అతడు దేవుని హక్కును సవాలు చేస్తున్నాడన్న మాట. అలాగే ఎవరయినా మరొకరి ఆజ్ఞకు తలవంచి నట్లయితే అతను తన ముగింపునూ, పరాధీనతనూ ప్రకటిస్తున్నాడన్న మాట. మరింత విశదంగా చెప్పాలంటే కేవలం దైవాదేశమే శాసనం. ఏ చక్రవర్తి ఫర్మానా అయినా, ఏ వర్గం, పార్టీల తీర్పు అయినా, మరేజాతి సంప్రదాయాలయినా శాసన స్థాయిని చేరలేవు. అందువల్ల మానవులు స్వయంగా కల్పించుకుని ఏర్పరచుకున్న సమస్త విధానాలను తప్పయినవిగా అధర్మమయినవిగా పరిగణిస్తుంది ఇస్లామ్. మానవులెవరయినా సరే, దైవ విధేయతకు బదులుగా తమకు ఊడిగం చేయాలని పిలుపునిచ్చే స్థానాన్ని వారికి ఇవ్వడానికి అది సిద్ధంగా లేదు.

ఇస్లామీయ శాసనం సర్వజనీనత

దైవాన్ని శాసనకర్తగా అంగీకరిస్తే తారసపడే మొదటి విషయం శాసనం. శాసనం అనగానే అది కేవలం సామూహిక వ్యవస్థకే పరిమితం అనుకోరాదు. వ్యక్తిగత జీవితంలోనే దైవ శాసనం అమలుజరగాలన్న భావాన్ని అంగీకరించవలసి ఉంటుంది. దైవంతో మానవుని సంబంధం, బజారులో, న్యాయస్థానాల్లో మాత్రమే కాదు, మొదట అతను వ్యక్తిగా దైవంతో సంబంధం నెలకొలుపుకుంటాడు. అతను తొలుత దైవాన్ని తన భావాల్లో అనుభూతుల్లో గ్రహిస్తాడు. తరువాత సామాజిక రాజకీయ రంగాల్లో వెదుకుతాడు. అతను దైవాన్ని తన భావాల, అనుభూతుల

జగతిలో కనుగొనలేకపోతే జీవితపు కార్యకలాపాల్లో అతనికి దైవం కానరాడు. ఈ కారణంగానే ఇస్లామీయ శాసనాంగం పరిధి సువిశాలమయింది. అది మానవుని అంతరంగంలోని భావాలు, బాహ్యంలోని అతని ఆచరణలు రెంటినీ ఆవరిస్తుంది. ఒక వైపున మానవుడు దైవం సమక్షంలో తన ఆరాధనా భావాలను ఏ విధంగా వ్యక్తం చేయాలో అది నేర్పుతుంది, ఆయన మార్గంలో త్యాగం చేయదలిస్తే పాటించవలసిన మర్యాదలేమిటో చెబుతుంది. మరోవైపున ఆచరణా రంగంలో దేవుని విధేయత, దాస్యం చేసే విధానం నేర్పుతుంది. దాని పట్టు నుండి మానవ జీవితపు ఏ కోణమూ స్వతంత్రం కాజాలదు. అది అతని అంతర్ బాహ్యాలను రెంటినీ స్వాధీనపరచుకుంటుంది; రెంటికీ దారి చూపుతుంది.

మానవ చట్టాలలోని లోపం

మానవులు స్వయంగా కల్పించుకున్న చట్టాలలోని అతి పెద్ద లోపం, అవి ఏ పనినయినా అమలుజరిగిన తరువాతి సందర్భాలనే చర్చిస్తాయి. ఈ చర్యకు వెనక పనిచేసే భావాలు, అనుభూతులు వాటి చర్చా పరిధికి దూరమయిన అంశాలు. మానవుని ఆంతర్యంలో దాగి ఉండే భావాలను సరిగ్గా గ్రహించడం ఎవరి తరమూ కాదు. వాటి వరకు చేరడమే సాధ్యం కాదు. వాస్తవంగా మానవ జీవితంలో అత్యంత ప్రముఖమయిన అంశం అతని భావాలే. భావోద్రేకాలే ఏ వ్యవహారం లోనయినా నిర్ణాయకమయి ఉంటాయి. వీటి కారణంగానే మనిషి ఏ విషయాని కయినా ముందడుగు వేయడమయినా, వేసిన అడుగు వెనిక్కి లాక్కోవడమయినా జరుగుతుంది.

ఒక వ్యక్తి దారిలో నడుస్తూ తనకు ముందు నడుస్తున్న వ్యక్తి పర్సు పడిపోయిందని గమనిస్తాడు, దాన్ని పట్టుకుని, పరుగెత్తి, ఆ ముందు వ్యక్తిని అందుకుని అతనికి దాన్ని అప్పజెబుతాడు. మరో వ్యక్తి తోటి వ్యక్తి ఏమరుపాటును గుర్తించి అతని జేబు ఖాళీ చేసి వేస్తాడు. ఈ రెండు సందర్భాలలోనూ మనోభావాల భిన్నత్వమే రెండు విభన్న చేష్టల రూపంలో వ్యక్తమయింది. చట్టంలోని బలహీనత ఏమిటంటే అది దొంగ చేతికి బేడీలు తగిలించడానికయితే సిద్ధంగా ఉంటుంది. కాని తోటి మానవుని సొమ్మును దోచుకునేందుకు పురికొలిపే అపవిత్ర మనస్తత్వానికి ఆంక్షలు

విధించజాలదు. ఒక వ్యక్తి మరొక వ్యక్తికి ఏదయినా భౌతిక హాని కలిగిస్తే అతన్ని విచారించడానికి చట్టం సర్వసన్నద్ధమయి ఉంటుంది. కాని మనిషి గుండెల్లో విద్వేషం, వైషమ్యం, శత్రుత్వం దురభిలాషల మంటలు రగులుతుంటే దాన్ని పట్టించు కోదు. వాస్తవంగా ఆ మంటలు ఉన్నంత వరకు ఆ వ్యక్తి హానికలిగించడం మానుకో జాలడు.

మానవుడు తన చేష్టల ద్వారా తన్ను తాను చాలా కొద్దిగా వ్యక్తం చేసు కుంటాడు. అతని వ్యక్తిత్వంలో అత్యధిక భాగం అతని అంతరంగంలో దాగి ఉంటుంది. అంతరంగంలో కదలిక ఏర్పడినప్పుడే అతని అవయవాలు, అంగాలు కదలడం మొదలెడతాయి. దీన్నే ఆచరణ అని అంటాము. మానవుని ఆచరణలన్నీ, అతని సంతోషం, దుఃఖం, ప్రేమ, ద్వేషాలకు లోబడి ఉంటాయి. మానవుని నిజ స్థితి అతని 'లోనిస్థితి'ని బట్టి నిర్ణయించబడుతుంది. దాన్ని ఏ కన్నూ చూడజాలదు. అతని ఆచరణ కేవలం అతని ఆంతర్యంలోని వ్యక్తిత్వానికి అసంపూర్ణమయిన, లోపభూయిష్టమయిన వ్యక్తీకరణ మాత్రమే. మానవుడు రేబవళ్ళల్లో కొన్ని గంటలు మాత్రమే పనిచేస్తాడు. కాని అతను మూర్తీభవించిన ఆచరణగా రూపొందినా, అనునిత్యం కదులుతూ, పనిచేస్తూనే ఉన్నా అతనిలోని వ్యక్తిత్వం పూర్తిగా వ్యక్త మవదు.

చట్టం మానవ జీవితం మొత్తాన్ని చర్చించదు. అది కేవలం మానవుని ఆచరణాత్మక జగత్తు వరకే తన పరిధిని పరిమితం చేసుకుంటుంది. కాని నిజాని కయితే మానవుని అంతరంగంలో నిజమయిన మార్పు తీసుకురావడానికి అతని జీవితాన్నంతటినీ మార్చగల చట్టం చేయడం అవసరం. ఇస్లామ్ ఇలాంటి శాస నాంగాన్నే మనకు ప్రసాదిస్తుంది. దాని మూలాలు మానవుని భావాలు, అనుభూతు లలోకి జొచ్చుకుపోయాయి. దాని శాఖోపశాఖలు సమాజం మొత్తాన విస్తరించి ఉన్నాయి. అది మొదట మానవుని అంతరంగ ప్రపంచాన్ని స్వాధీనపరచు కుంటుంది. తరువాత బాహ్యంలో విధేయతను పాటించే పిలుపునిస్తుంది. దైవాన్ని తన స్వామిగా, ప్రభువుగా నమ్మడం వల్ల మానవునిలో పుట్టే ఆరాధనా భావం ఒక్కటే బజారుల్లోని హంగామాలోనూ మానవుణ్ణి దేవుని దాసునిగా నిలుపుతుంది.

ఇస్లామీయ శాసనాంగంలోని ప్రత్యేకత ఇదే. అది సమాజంలో శాసనాంగానికి బద్ధునిగా జీవించాలని వ్యక్తిని కోరే ముందు అతని వ్యక్తిత్వాన్ని పూర్తిగా తన మూసలో పోతపోసి మలచుకుంటుంది. అది మనిషికి, నికాహ్, తలాక్, చట్టాలు, శిక్షాస్మృతి తదితర న్యాయానికి, శాంతిభద్రతలకు సంబంధించిన చట్టాలు అందజేసే సమయానికి, మానవుని మనస్సు, మస్తిష్కాలు దైవం సమక్షంలో పూర్తిగా లొంగిపోయి ఉంటేనే అది వాటిని ప్రతిపాదిస్తుంది. మానవుని అంతరంగం మీద దేవుని శాసనాంగం అమలుజరిగితే అతని బాహ్యం దైవాదేశాలకు భిన్నంగా మన జాలదు. చట్టానికి మనో మస్తిష్కాలే తిరగబడితే ఈ తిరుగుబాటు ఆచరణా జగతిలో అడుగడుగునా దర్శనమివ్వడం మొదలెడుతుంది.

ఒక ద్వంద్వ స్వభావి, కపటాచారి తన కాపట్యాన్ని, ద్వంద్వనీతిని దాచి పెట్టలేడు; అది చాలా కష్టం. అందువల్ల మానవుని ఆంతర్యం దైవం సమక్షంలో పూర్తిగా లొంగిపోనంత వరకు అతన్ని నిజంగా చట్టాన్ని పాటించే విధేయునిగా ఇస్లామ్ పరిగణించదు. అతడు తోటి మానవుల పట్ల వ్యవహరించే తీరులో ఇస్లామీయ శాసనాంగాన్ని పాటిస్తూ ఉన్నప్పటికీ అతనికి గుర్తింపు లభించదు. ఎవరి హృదయాంతరాళాలలో ఇస్లామ్ గట్టిగా పాదుకుంటుందో, ఆచరణారంగంలో ముందుకు వచ్చినప్పుడు ఎవరి మనోభావాలు, అనుభూతులు అన్నీ దేవుని ఆదేశాలకు లోబడి ఉంటాయో, ఎవరిని చూసి ప్రపంచంలో జనులు, అతడు కేవలం ఒక నియమబద్ధుడయిన, సౌజన్యశీలుడయిన వ్యక్తి, వ్యక్తి మాత్రమే కాదని, అతడు ఒక దైవభక్తి పరాయణుడు, విధేయతాతత్పరుడు అయిన వ్యక్తి అనీ గ్రహిస్తారో అతనే ఇస్లాం దృష్టిలో నిజమయిన ముస్లిమ్.

ఇలాంటి వ్యక్తి న్యాయస్థానంలో తీర్పు చెప్పక ముందే తన్ను తాను దేవుని తీర్పుకు బద్ధుడుగా రూపొందించుకోవాలి. బహిరంగ స్థలాలలో దైవాజ్ఞా పాలన చేసే ముందు తన ఏకాంత కుహరాల్లో దైవవిధేయతను స్వీకరించి ఉండాలి. ఈ కారణంగానే ఇస్లామ్ దేవుని ఆరాధన, దైవ దాస్యాలకు సామాజిక, రాజకీయ శాసనాల కన్నా అధిక ప్రాముఖ్యాన్నిస్తుంది. దేవుని దాస్యం మానవుని జీవితపు సమస్త వ్యవహారాలలో దైవవిధేయతకు సచేతన స్పృహ కలిగిస్తుంది, మనిషి విశ్వాసానికీ ఆచరణకూ మధ్యన వైరుధ్యం లేకుండా పరిశుద్ధుడైపోతాడు. అతని

వ్యక్తిగత, సామూహిక జీవితం ఒకే వర్ణం పూసుకుంటుంది. దాని ఒక కోణాన్ని చూపి మరో కోణాన్ని ఊహించడం సులభసాధ్యమవుతుంది. ప్రపంచంలోని ఏ చట్టమూ దాన్ని అనుసరించే వారికి ఈ విధమయిన సచేతన శిక్షణ గరపదు.

చట్టాన్ని నమ్మేవారు, నమ్మని వారి మధ్య వ్యత్యాసం

వ్యక్తిగత జీవితంలోనూ సామూహిక జీవితంలోనూ ఉభయత్రా చట్టపరిపాలనను కోరుతుంది ఇస్లామ్. దాన్ని నమ్మేవాళ్ళు ఏ జీవన రంగంలో నయినా చట్టాన్ని ఉల్లంఘిస్తే అది వారిని పట్టుకుంటుంది. దొంగతనం చేస్తే హస్తఖండన, వ్యభిచారానికి కొరడా దెబ్బలు శిక్షగా పడినట్లే వారు నమాజ్ వదలివేస్తే ఖైదులో పడవెయ్యబడతారు. వారు సామూహిక జీవితంలోనయినా, వ్యక్తిగత జీవితంలోనయినా సరే దైవాదేశాలను ఉల్లంఘిస్తే, దైవ విధేయతను తిరస్కరిస్తే ఎట్టి పరిస్థితిలోనూ వారు ఇస్లామ్ దృష్టిలో తిరుగుబాటుదారులుగా పరిగణించబడతారు. దాని చట్టంలో ధర్మభ్రష్టుని శిక్ష మరణమే. అల్లకల్లోలాలు సృష్టించే వారి శిక్ష కూడా మరణమే. ఇస్లామ్ స్వీకరించిన వ్యక్తి తన విశ్వాసం, ఆచరణలు అన్నీ ఇస్లామీయ శాసనాంగానికి లోబడి ఉంటాయని అంగీకరిస్తాడన్న మాట. అతను ఏ రూపంలోనూ చట్టాన్ని పాలించకపోతే తన ఈ అంగీకారానికి విముఖుడవుతాడన్న మాట.

అయితే ఇస్లామే సత్యమన్న విషయంలో సంతృప్తి చెందని వారికి, ఇస్లామ్ తన విశ్వాసాలు, ఆలోచనలు బలవంతాన రుద్దదు. అది వారిని ఇస్లామీయ శాసనాంగంలోని దేశ పరిపాలనా పరమయిన విభాగానికి నిబద్ధత చూపాలని, దాని చట్టాలను మాత్రం పాటించాలని కోరుతుంది. దేశ శాసనాలను పాటిస్తూ అన్ని విధాలా కృషి జరుపుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది. ఇస్లామీయ సమాజం ఏ సిద్ధాంతాల ఆధారంగా స్థాపితమయిందో వాటికి హాని కలిగించే కార్యకలాపాల్లో వారు పాల్గొన్నప్పుడు వారిపై ఇస్లామీయ శాసనాంగం ఆంక్షలు విధిస్తుంది. అలా కాని పక్షంలో వారి హక్కుల్ని సవాలు చేసే అధికారం ఏ వ్యక్తికీ ఉండదు. వారిని తమ నమ్మకాలను వదలుకోవాలని బలాత్కారం చేయడం జరగదు. వారి సామాజిక వ్యవస్థలో జోక్యం చేసుకోవడం జరగదు. వారు వ్యాపారం, వ్యవసాయం చేయడానికి, పరిశ్రమలు, చేతి పనులు స్థాపించుకోవడానికి స్వేచ్ఛ కలిగి ఉంటారు.

వారు భావ ప్రకటనా స్వేచ్ఛను మాట మూలకంగానూ, వ్రాత మూలకంగానూ కలిగి ఉంటారు. ప్రతి వ్యక్తి సహజసిద్ధంగా జన్మతః కలిగి ఉండే ప్రాథమిక హక్కులలో దేన్నుంచీ వారిని దూరం చేయడం జరగదు. అయితే ఇస్లామ్ ఇలాంటి వారి మీద తన సిద్ధాంతాలను అమలుజరిపే బాధ్యత ఇవ్వదు; దేశ పరిపాలనా వ్యవస్థలో పాల్గొనేందుకు నిర్బంధించదు. ఏ వ్యవస్థనయినా నడపడానికి తమ భావాలు, అనుభూతుల్ని దాని కనుగుణంగా మలచుకున్న వారే తగిన వారు. ఆ వ్యవస్థను తమ హృదయాల్లో చోటు కల్పించని వారు దాన్ని నేల మీద ఎన్నటికీ స్థాపించలేరు.

చట్టం సార్వజనీనత - అభ్యంతరం

చట్టం సర్వ వ్యాపకమవడం, సర్వజనీనమవడం సర్వసాధారణంగా జనం ఇష్టపడరు. దాని పరిధి కేవలం సామూహిక జీవితం వరకే పరిమితమని భావిస్తారు. ఒక చట్టం మంచిదనడానికి అది వ్యక్తుల జీవితంలో, కేవలం శాంతి భద్రతల సంస్థాపనకు, న్యాయ వ్యవస్థను నెలకొలపడానికి అవసరమయిన మేరకే జోక్యం చేసుకోవాలని భావించబడుతుంది. కాని ఈ దృక్పథం చాలా సార్లు మానవుణ్ణి ఆలోచన ఆచరణల్లో వైరుధ్యానికి గురిచేస్తుంది. అతని సిద్ధాంతాలు అతని శీలస్వభావాలను ప్రతిఫలించవు. అతని బాహ్యం ఆంతర్యాని కనుగుణంగా అలరారదు. అతనిలో ద్వంద్వనీతి చోటు చేసుకుంటుంది; కాపట్య వ్యాధి అతనికి సోకుతుంది. అతని ఆలోచన ఒక ప్రత్యేక రూపంలో ఉంటే సామూహిక శాసనం మరో విధంగా నడవమంటుంది. అతని భావాలు, అనుభూతులు చట్టంతో ఏకీభవించవు. కాని అతన్ని ఆ చట్టాన్ని అనుసరించవలసిందిగా కోరడం జరుగుతుంది. చట్టం, ఏ విషయాలనయితే సామూహిక వ్యవస్థకు ప్రయోజనకరమయినవిగా, అవసరమయినవిగా భావిస్తుందో వాటిని వ్యక్తి అనవసరమయినవిగా హానికరమయినవిగా తలుస్తాడు. ఈ విధంగా విభిన్న విషయాల్లో వ్యక్తి ఆలోచనలు చట్ట నైజంతో సామరస్యం పొందవు. మనిషిని, అతనికి ఏ విధంగానూ ఇష్టం కాని పనులు చేయాలని నిర్బంధించడం జరుగుతుంది లేదా అతని భావాలకనుగుణంగా ఆచరించేందుకు అతనికి ఏ రంగమూ కానరాదు.

దీనికి సమాధానంగా ఇలా అంటారు: ఆలోచనల్లో భేదభావం ఉన్నప్పటికీ చట్టం పట్ల గౌరవభావం ప్రతి వ్యక్తిలోనూ ఉంటుంది. చట్టాన్ని వ్యతిరేకిస్తూ మనిషి అంతరాత్మ అసహ్యతకు గురవుతుంది. మనిషి అలా చేస్తూ తాను సామాజిక దోషినని భావిస్తాడు. చట్టాన్ని అంతం చేసిన తరువాత, ఏ విధమయిన సామూహిక వ్యవస్థనూ నిలుపడం సాధ్యం కాదు. చట్టమే సామూహిక వ్యవస్థను క్రమబద్ధం చేసే దారం. అందువల్ల మనిషి సామూహిక జీవితం ప్రారంభించినప్పటి నుంచి చట్టం ఆవశ్యకతను కూడా గుర్తించాడు. చరిత్ర ముందుకు సాగిన కొద్దీ ఈ స్పృహ పటిష్టమయి మనిషి మనోమస్తిష్కాల్లో అది పాదుకుపోయింది.

కాని ఈ వాదనలో యదార్థం తక్కువగానూ అతిశయం పాలు అధికంగానూ ఉంది. చట్టం పవిత్రమయిందన్న భావన మనిషిలో అంత బలీయమయినది కాదు. అది చట్టాన్ని కాలరాయకుండా మనిషిని ఆపజాలదు. చట్టం ఒక సామూహిక అవసరం. కాని మనిషికి తన వ్యక్తిగత ప్రయోజనం పట్లనే ఆసక్తి మెండుగా ఉంటుంది. వ్యక్తిగత లాభనష్టాల ఆధారంగానే అతను ఆలోచిస్తాడు, ఆచరిస్తాడు. ఒక చర్య వల్ల సమాజానికి నష్టం, అతని స్వయానికి లాభం కలిగే మాటయితే అతను ఆ చర్య నుంచి విరమించుకోవడం బహు కష్టం. చట్టాన్ని పాలించడం వల్ల కలిగే ప్రయోజనం సమాజం మొత్తాన వ్యాపిస్తుంది. అందులో వ్యక్తికి ప్రాప్తమయ్యేది బహుస్వల్పం. అలాగే సమాజానికి కలిగే కీడు ప్రభావం కూడా, సాధారణతః మనిషికి చేరేవరకు పరోక్షంగానూ, చాలా స్వల్పంగాను పడుతుంది. అందువల్ల మనిషి ఏ విషయాల మేలు కీడుల ప్రభావం ప్రత్యక్షంగా అనుభవిస్తాడో వాటి ప్రాముఖ్యమే మనిషి దృష్టిలో అధికంగా ఉంటుంది. అతని ఇంటి ఇటుక ఒకటి జారిపోయినా అతనికి అమితమయిన బాధ కలుగుతుంది. దాన్ని బాగుచెయ్యడానికి తాపత్రయపడతాడు. కాని ఏదయినా ప్రభుత్వ భవనానికి మంటలంటుకున్నా అతనికి అంతగా బాధ అనిపించదు. ఇల్లంటే అతనికి వ్యక్తిగత ప్రయోజనం ముడివడి ఉన్న అంశం. అది అతన్ని ఎండనుండి, వాన నుండి రక్షిస్తుంది. అతని భార్యాపిల్లల్ని రక్షిస్తుంది. కాని ప్రభుత్వ భవనంతో అతనికి ప్రత్యక్ష ప్రయోజనమేదీ ప్రాప్తమయ్యే ఆస్కారం లేదు.

ఈ స్వప్రయోజనాభిలాష కారణంగానే మనిషి చట్టం ఆవశ్యకతను, దాని

ప్రాముఖ్యాన్ని గుర్తించినా చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఉంటాడు. ఒక స్మగ్లరు తన దేశ సంపదను ఇతర దేశాలకు దొంగచాటుగా రవాణా చేస్తూ తాను స్వదేశాన్ని బీదరికానికీ దారిద్ర్యానికీ గురిచేస్తున్నాడని భావించడు. దానికి బదులుగా దీనివల్ల తన కూతురు పెళ్ళి వైభవోపేతంగా జరుపవచ్చని, తన ఇంటికి నాల్గవ అంతస్థు కట్టించవచ్చని ఆలోచిస్తాడు. అదే విధంగా ఒక సాధారణ క్లర్కు లంచంగా కొన్ని రూపాయలు తీసుకుని వాటివల్ల మంచి బట్టల జత ఒకటి కొనుక్కోవచ్చని ఆశపడ తాడు. జత బట్టలు న్యాయాన్నీ సత్యాన్నీ హత్యచేయగా వచ్చాయన్న తలంపు అతనికి కలగదు.

చట్టం ప్రభావవంతం, శక్తిమంతం అంటూ చేసే మరో వాదన, దాని వెనక ప్రజాభిప్రాయం ఉంటుంది అనేది. చట్టమే సమాజంలో అందరి హక్కుల రక్షణకు గ్యారంటీనిస్తుంది. చట్టాన్ని అంతమొందిస్తే ప్రతి వ్యక్తి ధనమాన ప్రాణాలు ప్రమాదానికి లోనవుతాయి. అందువల్ల చట్టాన్ని ఉల్లంఘించడాన్ని ఏ సమాజమూ ఇష్టపడదు. ఏ వ్యక్తీ బజారులోని వస్తుసామగ్రిలో కల్తీని ఇష్టపడడు, ఎందుకంటే ఆ తరువాత తాను కూడా స్వయంగా ఏ వస్తువునూ స్వచ్ఛమయినదిగా ఆశించలేడు. మనిషి తన శత్రువు ఇంట దొంగతనం సరయినదే అని భావిస్తే తన ఇంట కూడా దొంగతనానికి ఆహ్వానం పలుకుతున్నాడన్న మాట. ఏ చిన్న దుర్మార్గాన్ని సహించడం, ప్రోత్సహించడమయినా నలువైపులా దౌర్జన్యానికి అత్యాచారానికి తలుపులు తెరవడమవుతుంది. అందువల్ల వ్యక్తి ప్రయోజనం కూడా సమాజం నిర్మించిన చట్టాలను పాటించడంలోనే ఇమిడి ఉంది. చట్టాన్ని ఉల్లంఘించే వ్యక్తులకు అలాంటి అవకాశాన్ని ఇవ్వరాదు. సమాజం ప్రతిపాదించే ఈ భావాన్ని కాదనడం ఏ వ్యక్తికీ అంత సులువు కాదు.

ప్రజాభిప్రాయం ఎన్నడూ చట్టాన్ని కాదనదన్నది వాస్తవమే. కాని ఇది నిజానికి కేవలం సైద్ధాంతికంగానే సాధ్యం. ఆచరణ రంగంలో మొదటి అడుగే ఓ ప్రశ్నను ఎదుర్కొంటుంది. ఏ చట్టం ప్రజాభిప్రాయానికనుగుణంగా ఉంది, ఏ చట్టానికి ప్రజాసమర్ధన పూజ్యమయింది? జాతి మొత్తం అభిప్రాయాన్ని సంగ్రహించే ఏ విధానమూ నేటి వరకు కనుగొనబడలేదు. ఇప్పటి వరకు ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునే ఎన్ని విధానాలయితే కనుగొనబడ్డాయో వాటి ద్వారా మహా అయితే

అత్యధికుల మొగ్గు ఎటు ఉన్నదో మాత్రమే తెలుసుకోవడం సాధ్యమవుతుంది. ఆ అత్యధికులలోనూ ఒక చిన్న సంఖ్య అభీష్టం మాత్రమే సాధారణంగా నిర్ణయాత్మ కమవుతుంది. ఏ చట్ట నిర్మాణంలో జాతి మొత్తం పాలుపంచుకోదో దాని పట్ల ఆ జాతి విశ్వసనీయతను ఆశించడం కష్టమే.

ఈ సందర్భంలో సాధారణంగా చెబుతారు, చట్టం ప్రతి ఒక్కరి ఇష్టానికి అనుగుణంగా లేకపోయినప్పటికీ అందరూ దాన్ని సమర్థించడం తప్ప గత్యంత రముండదు. న్యాయం, నియమం, శాంతి భద్రతలను కాపాడటానికి చట్టం అవసర మయిందే. కాని ఇదొక ఊహ. చట్టాన్ని ఉల్లంఘించడం ప్రతి ఒక్కరికీ నష్ట దాయకం, హానికరమన్నది తప్పనిసరి కాదు. దీనివల్ల కొందరికి లాభమూ కలుగు తుంది. అందువల్లనే నేరస్థునికి చట్టాన్ని ఉల్లంఘించినందుకు కొందరి వ్యక్తుల తిట్లూ, అభిశాపాలు ఎదురయ్యే ప్రమాదమున్నా కొందరు ఇతరుల ప్రోత్సాహం, ప్రోద్బలం కూడా ప్రాప్తమవుతాయి. శాసనోల్లంఘనను సమర్థించే వారు సాధారణంగా అలా చేసే వ్యక్తితోపాటు జీవించేవారు, అతనికి అతి సన్నిహితులయిన వారు. అందువల్ల అలాంటి వారి ప్రతిఘటనకయినా, సమర్థనకయినా అతను ప్రాముఖ్యాన్నిస్తాడు. సమాజంలోని అసంఖ్యాక జనుల విరోధానికి ప్రతిగా ఆ కొందరి ప్రోద్బలం అతనికి ప్రముఖమయి ఉంటుంది. అనేకసార్లు మనిషి ఈ వ్యక్తుల ప్రోత్సాహంతోనే చట్టాన్ని కాలరాస్తాడు. బహుశా ఒక ప్రభుత్వాధికారి లంచానికి దూరంగా ఉండటం సాధ్యమే. అతని సమీపాన ఉండే వారు, అతనికి దొరికే ధర్మబద్ధమయిన ఆదాయం పట్ల అతణ్ణి సంతుష్టుడయి ఉండనిస్తే, అక్రమంగా తన ఆదాయాన్ని పెంచాలని అతనిపై ఒత్తిడి తేకుండా ఉన్నట్లయితే ఇది సాధ్యమవుతుంది.

మానవ చట్టం విజయవంతమయిందా?

శాసనోల్లంఘన భావాలు స్వయంగా సమాజంలోనే ఉంటాయన్నది మాత్రమే ప్రశ్న కాదు. అసలు ప్రశ్న చట్టం విషయంలోనే ఉత్పన్నమవుతుంది. చట్టాన్ని పాలించాలని ఏ ఉద్దేశ్యంతో అంగీకరించబడుతుందో ఆ ఉద్దేశ్యం ప్రతి చట్టం ద్వారా సాధ్యమవుతుందన్న గ్యారంటీ ఏమిటీ? శాసన నిర్మాణ సుదీర్ఘ

చరిత్ర మనముందుంది. ఎన్నో చట్టాలు నల్ల త్రాచులా మానవ హక్కుల్ని మింగే శాయి. వాటి విషం సోకిన సమాజం ఆక్రోశిస్తూ విలపిస్తూనే ఉండిపోయింది. చట్టంచేసే మహత్యాలెన్నో! చట్టం కారణంగానే వేశ్యావృత్తిని సామాజిక అవసరంగా నిరూపించి మానవులు దాని చెడు ఫలితాలు అనుభవించేలా చేయడం జరిగింది. జాతీయ ప్రయోజనాల పేరుతో బలహీనుల దోపిడిని చట్టబద్ధం చేశారు. నేటికీ అన్యాయాలు, అత్యాచారాల ప్రతి తెరువు చట్టం పేరుతోనే తెరుస్తారు. వీటిలో కొన్నింటినయితే కేవలం ఏదో ఒక వ్యక్తి ఒక జాతి కాదు, మొత్తం ప్రపంచం ఆమోదముద్రతో సత్కరించింది.

చట్ట నిర్మాణం మానవులకు హక్కుగా ప్రాప్తమయి ఉన్నంతకాలం దాన్ని మానవుల కోరికలు, అభిలాషల నుండి వేరు చేయలేము. అది ఒక్కోసారి వ్యక్తి కోరికలకు ఊడిగం చేస్తే మరోసారి ఒక సముదాయానికి బానిసయి ఉంటుంది. అదీ మరీ విస్తృతి నొందితే మొత్తం జాతి కోరికలకు అద్దంపట్టేదిగా రూపొందు తుంది. సర్వమానవ సంక్షేమం, సాఫల్యం ఇమిడి ఉండే చట్టాన్ని నిర్మించడం ఏ వ్యక్తి వల్లనూ సాధ్యపడదు. ఏ వ్యక్తి అయినా, అతని మీద వ్యక్తి, జాతి, దేశ ప్రయోజనాలు అలుముకుని ఉంటాయి. వాటికి పైగా ఎదిగి ఆలోచించడం అతనికి కష్టసాధ్యమయిన విషయం. అంతేకాదు, చట్టం పరిపాలనా శక్తిగా పనిచేయాలంటే, మానవ భావాలు, ఉద్రేకాలు దానికి లోబడిపోవాలి. అతను చట్టాన్ని కేవలం సామాజిక ఒత్తిడివల్లనో, సామాజిక అవసరం అన్న భావనతోనో పాటించడం కాక దాన్ని తన విశ్వాసంగా, నమ్మకంగా తన భావోద్రేకాలకు, వ్యక్తిగత, జాతీయ, దేశీయ, వంశానుగత ప్రయోజనాలకు అతీతమయినదిగా భావించి, స్వీకరించి, తాను ఏకాంతపు కుహరాల్లో ఉన్నప్పటికీ జవదాటడం సరయినది కాదని భావిం చాలి. అప్పుడే చట్టం పాలనాశక్తిగా మారుతుంది.

ఇస్లామీయ శాసనం - విజయ కారణాలు

ఇస్లామీయ శాసనాంగం, ఒక మానవుని ఆంతర్యం కలుషితం కాగల సకల పక్షపాతాలకు, దురభిమానాలకు అతీతమయిన శక్తి చేసే పరిపాలనాధికార ప్రకటన. ఆ శక్తి, ఎప్పటికయినా తన నిర్ణయాలలో ఒక ప్రత్యేక పక్షానికి

అనుకూలంగా మొగ్గుతుందన్న ఆలోచన కూడా కలగదు. అది ఇలాంటి వాటికన్నింటికీ అతీతమయింది; అందరినీ ఒకే కంటితో చూసే శక్తి. శాసనం దైవం తరఫున వచ్చిందన్న భావన, దాని మహత్తును, ఔన్నత్యభావాన్ని మనిషి ఆంతర్యంలో ఉత్పన్నం చేస్తుంది. మనిషి ఆ చట్టాన్ని ఎటువంటి భేదాభిప్రాయానికి తావులేని విషయంగా స్వీకరిస్తాడు. చట్టం ఫలవంతం కావాలంటే, మొదటి షరతు, అది అఖండనీయమని భావించి దాన్ని స్వాగతించాలి.

మానవ భావోద్రేకాల శిక్షణ ఇస్లామ్ ప్రత్యేక రీతిని అనుసరిస్తుంది. ఫలితంగా మనిషి ఇస్లామ్‌ను తన ప్రాణం కన్నా ప్రియమయినదిగా భావిస్తాడు. అది ప్రదానం చేసే చట్టాన్ని ఉల్లంఘించడం ఎట్టి పరిస్థితిలోనూ అధర్మమని భావిస్తాడు. పగటి వెలుగులో పాటించినట్లే దాన్ని, రాత్రి నిశ్శబ్ద అంధకార వాతావరణంలోనూ పాటిస్తాడు. ఏకాంతపు మూలలోనయినా సభాసదుల మధ్యన నయినా అతనికి అంతా సమానమే. ఈ కోణంలో చూస్తే చట్టం ఇచ్చే గ్రంథాల్లో దివ్యఖుర్ఆన్ ప్రత్యేకమయిన 'శాసన గ్రంథం'. అది మానవునికి కేవలం చట్టం మాత్రమే అందజేయదు, అతని భావనలు, అనుభూతుల్ని సయితం చట్టానికి అనుకూలంగా మలచుతుంది. అది మానవుని మానసిక దౌర్బల్యాలను సంస్కరించ డానికి ఎంత వివరమయిన ప్రతిపాదనలు చేసిందో అంత వివరంగా చట్టాన్ని కూడా ఇవ్వలేదు. జీవితానికి సంబంధించిన ఏ సమస్య విషయంలోనయినా అది అయిదు, పది ఆదేశాలను మించి ఇవ్వలేదు. ఇంకా చెప్పాలంటే దాని ఆదేశాలన్నింటినీ, శాసనాలన్నింటినీ వేళ్ళపైన లెక్కపెట్టవచ్చు. అయితే అది చట్టాన్ని అనుసరించే బలమయిన భావాన్ని మనిషిలో ప్రేరేపించింది. దానివల్ల మనిషి స్వయంగానే చట్టంలోని ఉద్దేశ్యాన్ని, దాని ఆంతర్యాన్ని అన్వేషించాడు. ఫలితంగా నేడు ముస్లిముల వద్ద గర్వించదగ్గ చట్ట భాండాగారం ఒకటి తయారయింది. ఈ భాండాగారమంతా, చట్టం ఉద్దేశ్యాన్ని, ఆశయాన్ని అన్వేషించి దానికి లోబడేలా జీవితాన్ని మలిచే విధానాన్ని కనుగొన్న క్రమంలో ప్రాప్తమయిందే. ఈ అన్వేషణ, మీమాంస ఎంతో పవిత్రమయిన భావాలతో, మరెంతో చిత్తశుద్ధి, పరిశ్రమలతో జరిగింది. ఇస్లామ్ అందజేసిన చట్టాలను మరిన్ని వివరాలతో అందజేసి ఉన్నా, ఉద్దేశ్యం దృష్ట్యా అవి, ఈ అన్వేషణ ద్వారా సాధించిన వివరాల

కన్నా భిన్నంగా ఉండేవికావు. ఇది సాధించడం వెనక ఉన్న భావం, చట్టం ఉన్నత మయినదన్నది, మనిషి దాని అధీనతలో జీవించాలన్నది. ఈ భావం ఆంతర్యంలో ఉద్భవించకపోతే మానవుడు ఎన్ని శృంఖలాలనయినా త్రెంచివేయగలడు.

దీని భావం, కఠినమయిన చట్టం వల్ల లేక సామాజిక ఒత్తిడి వల్ల మానవుని పైన ఎలాంటి ప్రభావం పడదని కాదు. ఈ రెండు విషయాల్లో గొప్ప శక్తి ఉన్న మాటలో సందేహం లేదు. కాని ఇవి ఒక వ్యక్తిని చట్టానికి బద్ధునిగా చేయజాలవు. అయితే మనిషిని తప్పుడు దారిన పోకుండా ఆపడంలో సహాయపడగలవు. అందువల్ల ఇస్లామీయ చట్టంలోని మహత్తు ఏమిటంటే అది ఈ సహాయక శక్తుల ద్వారా కూడా ప్రయోజనం పొందుతుంది. ఇంకా అపరాధికి అతని అపరాధానికి గాను ఇచ్చే శిక్ష ద్వారా ఇతరులు ఆ అపరాధానికి ఒడిగట్టే సాహసం చేయనివ్వదు. శాసనంలో ఈ మాత్రం కాఠిన్యం లేకపోతే న్యాయం, శాంతి భద్రతలు నెలకొని స్థిరంగా నిలువడం కష్టమయిపోతుంది. ఇస్లామ్ మానవుణ్ణి చట్టానికి బద్ధునిగా మలచడంతోపాటు చట్టాన్ని కూడా అది ఎంతో కఠినమయిందిగా రూపొందించింది. ఈ కాఠిన్యం ఒక్కటే శాసనోల్లంఘన నుండి మనిషిని ఆపడానికి పెద్ద సాధనమవుతుంది.

కాని ప్రతి విషయంలోనూ చట్టం కఠినమయిందిగా ఉండటాన్ని ఇస్లామ్ సరయినదిగా భావించదు. దాని దృష్టిలో కాఠిన్యం అన్నది చివరి మందు. నేరస్థుని సంస్కరణకు మరో మార్గమేదీ మిగలక సమాజం మీద అతని వల్ల దుష్ప్రభావాలు పడుతున్న పరిస్థితిలో మాత్రమే దాన్ని వినియోగించాలి.

మూడు పరిస్థితుల్లో శాసనం కఠినమయిందిగా ఉండాలన్నది ఇస్లామ్ దృక్కోణం. ఒకటి, ఇస్లామ్ స్వీకరించినట్లు ప్రకటించిన తరువాత వెనుతిరిగిన సందర్భంలో. ఎందువల్లనంటే, సమాజం ఏ పునాదుల మీద నెలకొని ఉందో అవి సత్యమయినవని సాక్ష్యం పలికి తిరిగి అవి తప్పయినవని ప్రకటించడం ఆ సమాజాన్ని బలహీనపరచడమవుతుంది. రెండవది, దేశ పరిపాలన, ప్రభుత్వం పట్ల తిరుగుబాటుకు పాల్పడడం. మూడవది, మానవుల ధన, మాన ప్రాణాలపై చెయ్యి చేసుకోవడం. ఈ మూటిలో ఏ ఒక్కదాని విషయంలోనయినా సరే చట్టం కఠినం కావాలని ఇస్లామ్ కోరుతుంది. దాని దృష్టిలో వ్యభిచారిని క్షమించడం

తిరుగుబాటుదారునికి తిరుగుబాటు చేసే అవకాశం ఇవ్వడం స్వయంగా ఒక సామూహిక నేరం. ఇదే విధంగా ఇస్లామ్ సాంఘిక ఒత్తిడి ద్వారా కూడా ప్రయోజనం పొందుతుంది. అందువల్ల అది శిక్షా స్మృతిని అమలుపరచడం బహిరంగంగా ప్రజల ముందు జరగడం ఆవశ్యమని భావిస్తుంది. దీని ద్వారా నేరస్థునికి శిక్ష నివ్వడంతోపాటు అతని నైతిక పరాభవం కూడా జరగాలని అది భావిస్తుంది. సమాజంలో నేరాన్ని నేరతత్వాన్ని బలపరచడం కాదు, అన్ని వైపులా దాన్ని బలహీనపరిచే అవకాశం ఏర్పడాలని అభిలషిస్తుంది. అది ఇస్లామీయ మూల్యాల రక్షణ, సమాజం మనుగడ, దాని పరిరక్షణ, ఎవరో కొందరి బాధ్యతగా కాక ఆరాధ్యతను సమాజంలోని వ్యక్తులందరిపైనా మోపింది. ఇస్లామీయ వ్యవస్థకు ఏదయినా విఘాతం కలిగి, దాన్ని రక్షించే ప్రయత్నం ఏదీ జరగకపోతే సమాజం మొత్తం అపరాధిగా నిలుస్తుంది. ప్రతి ముస్లిమ్ ఇస్లామ్ రక్షకుడే. ఇస్లామ్ మీద జరిగే ఎలాంటి దాడినయినా రక్షించడం అతని విధ్యుక్తధర్మం.

ఖుర్ఆన్ ప్రతిపాదించే కొన్ని చట్టాలు

పైన పేర్కొన్న విషయాల వివరణగా మేము ఖుర్ఆన్‌లోని కొన్ని చట్టాలను ముందుంచుతున్నాము:

ప్రతి మానవుని ప్రాణం పవిత్రమయింది. దానికి హాని కలిగించడానికి, దానిపై చెయ్యి చేసుకోవడానికి ఎవరికీ ఎలాంటి హక్కులేదు. ఈ విషయంలో నియమం ఏమిటంటే మానవ శరీరం, ప్రాణాల పట్ల చిన్న దయినా పెద్దదయినా ఎలాంటి దౌర్జన్యం జరిగితే అలాంటి ప్రతీకారమే తీసుకోబడుతుంది.

> **తౌరాతు గ్రంథంలో మేము యూదుల కొరకు ఈ ఆజ్ఞను వ్రాశాము : ప్రాణానికి బదులు ప్రాణం, కన్నుకు బదులు కన్ను, ముక్కుకు బదులు ముక్కు, చెవికి బదులు చెవి, పన్నుకు బదులు పన్ను, ఇలా సమస్త గాయాల కొరకు సమానమైన ప్రతీకారం. కాని ఎవరైనా ప్రతీకారం చెయ్యకుండా క్షమిస్తే, అది అతనికి కప్ఫారా (పాప పరిహారం) అవుతుంది. అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చెయ్యని వారే దుర్మార్గులు.**
>
> **(అల్ మాఇద: 45)**

ప్రాణం తరువాత ప్రముఖమయింది ధనం. ఇస్లామ్ దాని రక్షణను

కూడా సునిశ్చితం చేసింది. అది ఇచ్చిన ఆదేశం ప్రకారం దొంగతనం చేసిన వ్యక్తి పట్ల ఎలాంటి ఉదారత చూపరాదు, అతని చెయ్యి నరికివేయాలి.

దొంగ-స్త్రీ అయినా పురుషుడైనా, ఉభయుల చేతులూ నరకండి. ఇది వారి సంపాదనకు ప్రతిఫలం. అల్లాహ్ తరఫు నుండి గుణపాఠం నేర్పే శిక్ష. అల్లాహ్ సర్వశక్తిమంతుడు, అత్యంత వివేక సంపన్నుడు.

(అల్ మాఇద: 38)

ఇస్లామ్ సమాజంలో ఏ ఉన్నత నైతిక విలువలను వికసింపజేయాలని కోరుకుంటుందో వాటిలో సౌశీల్యత, మాన రక్షణకు ప్రాథమిక ప్రాముఖ్యత ఉంది. అందువల్ల అది వ్యభిచారం, నీతిబాహ్యతల్ని హీనాతిహీనమయిన అపరాధాలుగా పరిగణించింది. దానికి కఠిన శిక్షను నిర్ణయించింది.

వ్యభిచారిణి, వ్యభిచారి - ఈ ఇద్దరిలో ప్రతి ఒక్కరినీ నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి. మీరు అల్లాహ్‌పై, అంతిమ దినంపై విశ్వాసం ఉన్నవారే అయితే, వారి మీద కనికరం చూపే తలంపు అల్లాహ్ ప్రసాదించిన ధర్మ (నిర్వహణ) విషయంలో మిమ్మల్ని అడ్డుకోరాదు. వారిని శిక్షించేటప్పుడు విశ్వాసుల వర్గం ఒకటి అక్కడ ఉండాలి. (అన్ నూర్ : 2)

ఇస్లామ్ ప్రతి వ్యక్తి మాన మర్యాదలు సురక్షితంగా ఉండాలని కోరుతుంది. వాటిపైన ఎవరి పక్షాననయినా దాడి జరగకుండా కాపాడాలని అది అభిలషిస్తుంది. దాని ఆదేశం:

ఎవరైనా శీలవంతులైన స్త్రీలపై నిందమోపి తరువాత నలుగురు సాక్షులను తీసుకురాకపోతే, వారిని ఎనభై కొరడా దెబ్బలు కొట్టండి, వారి సాక్ష్యాన్ని ఇక ఎన్నడూ అంగీకరించకండి. వారే దుర్మార్గులు. (అన్ నూర్ : 4)

పరిపాలనా వ్యవస్థ పట్ల, ప్రభుత్వం పట్ల విద్రోహం, తిరుగుబాటు, భువిలో కల్లోలాన్ని సృష్టించడం ఎంత భీకర నేరమో అంతే కఠినమయిన శిక్ష దానికి నిర్ణయించడం జరిగింది. ఆదేశం:

అల్లాహ్‌తో, ఆయన ప్రవక్తతో పోరాడే వారికీ, ధరణిలో కల్లోలాన్ని సృష్టిస్తూ

తిరిగే వారికీ శిక్ష ఏమిటంటే: వారిని చంపటం లేదా శిలువపైకి ఎక్కిం చటం లేదా చేతులను, కాళ్ళను అభిముఖ దిశలలో ఖండించటం లేదా దేశం నుండి బహిష్కరించటం. ఇవి వారికి ఇహలోకంలో జరిగే అగౌరవం, అవమానం. పరలోకంలో వారికి అంతకంటె ఘోరమైన శిక్ష ఉంటుంది.

(అల్ మాఇద : 33)

ఈ ఆయత్‌ల ద్వారా తెలిసేదేమిటంటే చట్టం కేవలం సామాజిక బంధనం మాత్రమే కాదు. అదొక శక్తి, అస్తిత్వం అందజేసే ఆదేశం. ఆ శక్తి పట్టునుండి మానవుడు ఎన్నడూ తప్పించుకోలేడు. ఈ చట్టంలో ఒక వైపున చట్టం ఉల్లంఘిస్తే కఠినాతి కఠినమయిన శిక్షలు విధించబడ్డాయి. మరో వైపున పరలోక భావన ద్వారా వాటిని పాటించేందుకు ప్రేరేపించడం జరిగింది. దానితోపాటు ఈ శాసనాలు, వీటిని సత్యమయినవిగా విశ్వసించే వారినందరినీ సంబోధించి ఇవ్వడం జరిగింది. తద్వారా సమాజం మొత్తంలో వాటి అమలు పట్ల చేతన జాగృతమయి ఉంటుందని ఆశించడం జరిగింది. అప్పుడే ప్రతి వ్యక్తి శాసనోల్లంఘనను నిరోధిం చడం తన స్వంత విధిగా, దాని రక్షణ తన బాధ్యతగా భావిస్తాడు.

5. ఇస్లాం - ఒక శాశ్వత వ్యవస్థ

గతం, భవిష్యత్తు

అప్పుడప్పుడు మీరు ఇస్లామ్ విషయంలో ఒక విమర్శ వింటూ ఉంటారు. 'ఇస్లామ్ 14 వందల ఏళ్ళ క్రితం నాటి వ్యవస్థ; ఇప్పుడు దాన్ని పునరుజ్జీవింప జేయడం సాధ్యం కాదు.' ఇలాంటి వాక్యాలు ప్రత్యేక మనస్తత్వానికి నిదర్శనాలు, వీటిలో ఒక ప్రక్కన ఇస్లామీయ వ్యవస్థను గతించిన ఒక వాస్తవంగా అంగీకార ముంది, మరో ప్రక్కన దాని భవిష్యత్తు పట్ల నిరాశాభావం వ్యక్తమవుతుంది. నిజానికి ఒకసారి వాస్తవంగా సంభవించిన సంఘటన మరోసారి ఉనికిలోకి వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. దీనికి భిన్నంగా కేవలం ఊహలో మాత్రమే రూపు దాల్చిన సంఘటన వాస్తవ రూపు ధరించే అవకాశాలు తక్కువ. గతం సునిశ్చితతను, నమ్మకాన్ని అందజేస్తుంది. భావిని గురించి కేవలం ఊహించడం మాత్రమే సాధ్యం. గతం ఒక సంఘటనకు నిదర్శనంగా నిలుస్తుంది. భావి మటుకు కేవలం అవకాశాన్ని చర్చిస్తుంది. మనం ఒక అవకాశాన్ని సాధ్యంకాదని ఖండించగలం కాని జరిగిన ఒక సంఘటనను కాదనలేము.

ఈ విధంగా ఇస్లామీయ వ్యవస్థ తిరిగి నెలకొల్పేందుకు అవకాశాలు బల మయినవిగా రూపొందుతాయి. అది గతంలో సునిశ్చితంగా, ప్రస్ఫుటంగా జరిగినది వాస్తవం. చరిత్రలో అంతకన్నా స్పష్టంగా ముందకు వచ్చే మరే వాస్తవ సంఘటన కానరాదు. ఎవరయినా జిజ్ఞాసువులు చరిత్ర పుటల్ని తెరచి చూస్తే బహుశా వారి చూపు మొట్టమొదట, ఈ సంఘటనపైనే నిలిచేది. గతంలో జరిగిన ఈ సంఘటన భావిలోనూ వ్యక్తమవగలదని దానంతట అదే ప్రకటిస్తోంది.

సంఘటనలు చరిత్రకు లోబడి జరగవు

ఇస్లామీయ వ్యవస్థ భవిష్యత్తును గురించి తిరస్కరించేవారు ముందుంచే వాదన ఏమిటంటే, ప్రతి సంఘటన ఒక ప్రత్యేక చారిత్రక కారణాలు, పరిస్థితుల వల్ల రూపొందుతుంది; ఆ పరిస్థితులు లేకపోతే ఆ సంఘటన కూడా జరిగేది

కాదు; పరిస్థితులు ఒకరి ఇష్టాయిష్టాల ప్రమేయంలేకుండా తమ సహజ ధోరణిలో సాగిపోతుంటాయి. మనిషి వాటిని ఎంత మాత్రం అదుపులో ఉంచలేడు. పరిస్థితులు ఒక మార్గాన సాగిపోతుంటే వాటికి భిన్నంగా మరో మార్గం నిర్ణయించుకుని సాగడం మనిషి వల్ల అయ్యే పనికాదు. మరో మాటలో చెప్పాలంటే ఏ సిద్ధాంత మయినా తన స్వశక్తితో స్వంత బలంతో భువిలో నెలకొనజాలదు. బయటి పరిస్థితులే, బయటి శక్తులే సిద్ధాంతానికి జన్మనిస్తాయి. మనిషి ఆ శక్తులకు పనిముట్టు మాత్రమే తప్ప మరేమీ కాడు. అవి ఎలా అనుకుంటే అలా అతనిచేత పని చేయించుకుంటాయి.

కాని ఈ భావన వాస్తవికతకు విరుద్ధమయింది. సంఘటనలు, చరిత్ర గతికి లోబడి రూపొందుతాయి అన్నది తప్పు. మనిషి సంకల్పం, నిశ్చయం సంఘటనలుద్భవించడానికి మూలమవుతుంది. కొన్ని పర్యాయాలు ఒక సంఘటన జరగబోతుంటే చరిత్ర గతి దానికి సహాయ సహకారాలు అందించడం అన్నది కూడా జరుగుతుంది. కాని మరోలా కూడా జరుగుతుంది, అలా చాలా తరచుగా జరుగుతుంది కూడా – అత్యంత ప్రతికూల వాతావరణంలో ఒక బలోపేతమయిన సిద్ధాంతం ముందుకు వస్తుంది, అది తన సహజశక్తి, సామర్థ్యాలతో వాతావరణ మంతా అలుముకుంటూ ముందుకుసాగుతుంది. చరిత్ర దాని పురోగమనాన్ని చూసి తన గతిని మలచుకుంటుంది. కాలం ఆ సిద్ధాంతం కొరకు సుపరిచిత మయిన, అంగీకృతమయిన విలువల్ని వదలిపెట్టవలసి ఉంటుంది.

అన్యాయం, అత్యాచారం, అశాంతి, అలజడి అన్నవి పరిస్థితుల పర్యవసానంగా ఉనికిలోకి వస్తాయనడం, పరిస్థితులే మానవాళికి న్యాయం ధర్మం అన్న వాటిని పరిచయం చేస్తాయనడం ప్రసిద్ధ వాస్తవాన్ని కాదనడమే అవుతుంది. రాచరిక వ్యవస్థ పడిపోయి సామ్యవాద పీడన రష్యాలో రాజ్యమేలిందంటే అక్కడి పరిస్థితులు దానికి సానుకూలంగా ఉన్నాయని అర్థమా లేక ఒక అన్యాయం పట్టు సడలగానే మరో దౌర్జన్యం తన పిడికిలి బిగించిందనడం భావ్యమా? ప్రజాస్వామ్యం స్థానే నియంతృత్వం చోటుచేసుకుంటే దానికి కారణం ప్రజాస్వామ్యం వైఫల్యమా లేక అధికార పిపాస ప్రజాస్వామ్యం మెడ నరికిందని అర్థమా? సంఘటనలు పరిస్థితులకు లోబడి ఉన్నట్లయితే మానవుడు సత్యానికీ ధర్మానికీ సదా వంచితుడయి

పోయేవాడు. 'సత్యం' స్వంత చరిత్ర తెలిపే దాని ప్రకారం అది సదా అన్యాయానికీ, అధర్మానికీ, అత్యాచారానికి వ్యతిరేకంగా పైకి వచ్చింది. పరిస్థితులు, కాలం ఎలా ఉన్నా వాటికి ఎదురీది అది విజయాన్ని సాధించింది.

పధ్నాలుగు వందల ఏళ్ళ క్రితం అరేబియాలో ఇస్లామ్ సందేశోద్యమం ప్రజ్వరిల్లడం, అది దాని వాతావరణాన్ని ఆక్రమించుకోవడం, చరిత్ర తెలిపే ప్రస్ఫుట మయిన వాస్తవం. ఈ సందేశం ముందుకు వచ్చినప్పుడు ఆనాటి భావనలు, ప్రజాభిప్రాయాలు దానికి పూర్తిగా విరుద్ధమయినవిగా ఉండేవి, మా చెడ్డగా ఘర్షించేవి. అడుగడుగునా ఈ రెంటి మధ్య పోరు జరిగేది. చివరికి ఆనాడు ప్రచారంలో ఉన్న భావనలు పరాజయాన్ని అంగీకరించవలసి వచ్చింది, జీవిత పటమంతా ఈ సందేశానికి సానుకూలంగా, సామరస్యం చెంది రూపొందసాగింది.

ఇస్లామీయ వ్యవస్థ విజయం పొందడాన్ని ఈ కోణంలో చూస్తే ప్రపంచ చరిత్రలో అనన్యమయిన ఏకైక దృష్టాంతం. పరిస్థితులు దీనిపై ఏ విధంగానూ ప్రభావం చూపలేకపోయాయి. ఈ వ్యవస్థ ఆచరణాత్మకంగా నెలకొన్నప్పుడు దీని ఏ అంశాన్నీ సవరించవలసి రాలేదు. సోషలిజం నేడు★ ప్రపంచంలో జనులకు చాలా ప్రియప్రదమయిన సిద్ధాంతం. కాని ఏ దేశం దాన్ని అమలు జరపాలని స్వీకరించినా తమ దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా దాన్ని రూపుమాపి స్వీకరిస్తుంది. కాని ఇస్లామీయ వ్యవస్థ నెలకొన్నప్పుడు, ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) ఏ రూపంలో దాన్ని అందజేశారో అదే విధంగా అది స్థాపించ బడింది. ప్రపంచంలోని ప్రతి సిద్ధాంతంలోనూ సైద్ధాంతిక, ఆచరణాత్మక రూపాల్లో కానవచ్చే వైరుధ్యం ఇస్లామీయ వ్యవస్థలో ఏ కోశానా కానరాదు.

గతంలో ఇస్లామ్ ఇలా పూర్తిగా ఆధిపత్యం, ఆధిక్యత వహించడం, నేడు కూడా అది ఆధిక్యత వహించగలదనడానికి నిదర్శనం. పరిస్థితులు దాని మార్గంలో అవరోధమూ కాజాలవు, వాటితో అది సయోధ్య చేసుకునే అవసరమూ కలగదు.

పరిస్థితులు ఎన్నడూ మానవునిపైన ఆధిపత్యం వహించవు. అవి అతని భావసరళికి అడ్డం పడతాయి. మానవుడు ఏ విధమయిన సామాజిక వ్యవస్థను,

---

★ ఈ పుస్తక రచన జరిగింది 1960లో అని గమనించాలి.

ఎలాంటి సంస్కృతిని ఇష్టపడతాడో, నైతికత, చట్టం విషయంలో అతని అభిప్రాయ మేమిటో అవి తెలుపుతాయి. బలోపేతమయిన సిద్ధాంతం ఏదయినా మానవ ఆలోచనా పథాన్ని మార్చగలిగినట్లయితే నిస్సందేహంగా పరిస్థితులూ మారగలవు. ఇక్కడ ఘర్షణ అయినా సంఘర్షణ అయినా నిజానికి సిద్ధాంతం, పరిస్థితుల మధ్య జరగదు. ఒక సిద్ధాంతం మరో సిద్ధాంతాల మధ్య జరుగుతుంది. ఏ సిద్ధాంతం బలమయినదో, ఆధిక్యత వహిస్తుందో పరిస్థితులు దాన్ని అనుసరిస్తాయి. అది ఏ దిశలో పయనిస్తుందో పరిస్థితుల ప్రవాహం కూడా అదే దిశలో సాగుతుంది. ప్రస్తుత కాలం పూర్తిగా స్వచ్ఛమయిన భౌతికవాద కాలం. అది మానవుని చుట్టూ భౌతికతత్వపు వల పరచి పెట్టింది. మానవుడు దాని వెలుపలికి కాలిడడం దుర్లభ మయిపోయింది. సంస్కృతి, నాగరికత, సామాజికత, విద్య, పరిశ్రమలు, వ్యాపారం- ప్రతిదీ భౌతిక భావజాలంలో చిక్కుకుపోయింది. మనిషి భౌతిక భావనలకు లోబడి ఆలోచిస్తాడు, భౌతిక విలువలతోనే ప్రతిదాన్నీ కొలుస్తాడు. కాని, దానికి ఎదురుగా దైవభక్తి, పరలోక చింతనా భావనలు సరయిన రూపంలో అందజేస్తే పరిస్థితుల్లో విప్లవం వర్ధిల్లవచ్చని, భౌతికత పేర్చిన సమస్త కొలమానాలు తునాతునకలయిపోతాయని మేము నమ్ముతున్నాము. పరిస్థితులు భౌతికతత్వ మార్గంలో అవరోధం కాకపోయినప్పుడు పరలోకాభిలాష మార్గంలో అవరోధాలయ్యే కారణమూ లేదు. నేడు మానవుడు తన భౌతికతా ప్రధానమయిన బుద్ధి కారణంగా, ప్రపంచంలోని సకల విలాసాలు సన్మార్గాననయినా, దుర్మార్గాననయినా సాధించా లని తప్పనిసరి అయినట్లు వ్యవహరిస్తున్నట్లే పరలోక చింతన అతణ్ణి వివశుణ్ణిచేసి రాబోయే శాశ్వత ప్రయోజనం కొరకు ప్రస్తుత సుఖాన్ని త్యజించడానికి సిద్ధం చేస్తుంది.

సత్యమయినా మిథ్య అయినా, నిజమయినా అబద్ధమయినా, అన్యాయ మయినా న్యాయమయినా ఇవి ఏ కాలంలోనయినా వ్యక్తం కావచ్చు. పరిస్థితుల ప్రభావంవల్ల వాటి రూపాలు మారవచ్చు కాని వాస్తవికత దృష్ట్యా ఎలాంటి వ్యత్యాసం ఏర్పడదు. దొంగతనం భారత దేశంలోనూ అమెరికాలోనూ ఉభయత్రా జరుగు తుంది. భేదమల్లా రూపంలోనే. భారత దేశంలో దొంగ ఇంటికి కన్నం వేయాలను కుంటాడు, అమెరికాలో మారిన వాతావరణంలో కారు దొంగిలించడం భావ్యమని

భావిస్తాడు. నేడు వ్యాపారంలో మోసం, వంచన సరయినదే అని భావించే వ్యక్తి వందేళ్ళకు పూర్వమయితే తన వ్యాపారాన్ని అలా కాకుండా పరిశుద్ధంగా చేయాలని అనుకోడు. అయితే వంచన, మోసానికి సంబంధించిన నేటి పద్ధతులు ఒక శతాబ్దికి పూర్వం భిన్నంగా ఉండి ఉంటాయి. శత్రువును ఎదుర్కొని రక్షించుకోవడం గతం లోనూ జరిగేది, నేడూ జరుగుతూ ఉంటుంది. భేదం ఒక్కటే; గతంలో మనిషి శత్రువు మీదికి రాళ్ళు, బల్లేలు విసిరే వాడు నేడు బాంబులు విసురుతున్నాడు.

మానవ నైజం మారదు

మానవుడు పుడమిపైన కాలు మోపినప్పటి నుంచి సాంస్కృతికమయిన, నాగరికమయిన, రాజకీయ, భౌగోళికమయిన వేలాది మార్పులు పరివర్తనలు సంభవించాయి. కాని అతని భావోద్రేకాలు, అనుభూతులు ఏ విధంగానూ మార లేదు. మనిషి అతి సాధారణంగా అనాగరిక జీవితం గడిపిన కాలంలోనూ మంచీ చెడుల భావనలు లేకుండా బ్రతకలేదు, నేడు ఆడంబరాలు, కృత్రిమతలు ముసుగ్గా వేసుకున్నప్పుడు కూడా అతని ఈ అనుభూతులు ఎక్కడా మాయమవలేదు.

నేటి కాలంలో విస్తృతమయిన అవసరాల పరిపూర్తికి మనిషి అన్యాయం అత్యాచారాల మార్గం అవలంబిస్తున్నట్లే గతంలోనూ తన అవసరాలు పరిమిత మయినప్పటికీ వాటికి పాల్పడే వాడు. గతంలో అతను దయార్ద్రత, ప్రేమ, న్యాయం లాంటి భావనలను గురించి ఎరిగి ఉన్నట్లే, ఇప్పుడూ అతను వాటిని గురించి ఏమీ ఎరుగని వాడు కాడు. అందువల్ల, మానవుడు కాస్త తక్కువ స్థాయి నాగరిక కాలంలో ఉన్నప్పుడు అనుభవంలోకి వచ్చిన సిద్ధాంతం నేడు నాగరికత జిలుగుల్లో అది పునరావృతమెలా అవుతుంది అని అనుకోవడం అవివేకమే అవుతుంది. నేటి నాగరిక మానవుడు, నాటి అనాగరిక మానవుని భావోద్రేకాలు, అనుభూతల రీత్యా భిన్నమయిన వాడయితే ఈ ప్రశ్న తలెత్తుతుంది. భువిలో మొదటి మానవుడు ఉనికిలోకి వచ్చినప్పటి నుంచి నేటి మానవుని మధ్య ఈ విషయం దృష్ట్యా ఎలాంటి వ్యత్యాసం లేదు. గతంలోని ఒక సిద్ధాంతం మానవుని భావోద్రేకాలపై ఆధిపత్యం చెలాయిస్తే, పరిస్థితుల్లో వచ్చిన ఎలాంటి మార్పు అయినా సరే, అది భావిలోనూ ఆధిపత్యం వహించకుండా ఆపలేదు. కాని అదే సమయంలో ఒక అత్యాధునిక సిద్ధాంతంలో ఇలాంటి సామర్థ్యం ఏదీ లేకపోతే అది ఇట్టే రూపుమాసిపోతుంది.

తాత్కాలిక సిద్ధాంతాలు

కాలంతోపాటు చెల్లిపోయే సిద్ధాంతాలు రెండు రకాలు. ఏవో తాత్కాలిక సమస్యలు వాటి పుట్టుకకు కారణమవుతాయి లేదా ఏదో ప్రత్యేక వర్గంతో వాటి సంబంధముంటుంది. ఉదాహరణకు, యువకులకు విద్య గరపాలన్న ఉద్దేశ్యంతో ఏర్పడిన సంఘం; విద్యా ప్రాప్తికి సకల సౌకర్యాలు ప్రాప్తమయినప్పుడు దాని ఉనికికే అర్థముండదు. నైతిక పునర్నిర్మాణానికి ఏదయినా సంఘం కమిటీ ఏర్పడితే దానికి బోధన హితోపదేశం కలిగించే అవకాశాలున్నంత కాలం, జనుల సంస్కరణ సముద్ధరణకు అవకాశాలున్నంతకాలం అది మనగలుగుతుంది. అలాగే ఏదయినా జాతి, కులం కొరకు ఏర్పరచుకున్న కార్యక్రమం ఆ జాతితోపాటు అంతమయి పోతుంది. తరువాత అది చరిత్ర పుటల అలంకారంగానయితే మిగులుతుంది కాని దాన్ని తిరిగి పునరుద్ధరించడం సాధ్యపడదు. ఏ సిద్ధాంతమయినా ఒక జాతి, దేశం ప్రాతిపదికగా పైకి వస్తే దాని సమక్షంలో ఆ జాతి, ఆ దేశ పరిస్థితుల సమస్యలుంటాయి. దానికి ఇతర జాతుల ప్రయోజనాల పట్ల ఎలాంటి ఆసక్తి ఉండదు. ఓ ప్రత్యేక వర్గం ప్రయోజనాల కోసం రూపొందిన కార్యక్రమం మరో వర్గం ప్రయోజనాలు సంక్షేమాలకు మార్గం వెదకడం, ఒక ఇరుకయిన వీధిలో ఒకే బండి పోగల చోటున్నప్పుడు, మరిన్ని బండ్లు తోలడానికి ప్రయత్నించడం లాంటిదే.

ఇలాంటి సిద్ధాంతాలు పుట్టడానికి ప్రతి రాజకీయ, సామాజిక పరివర్తన లోనూ ఆస్కారముంటుంది. అందువల్ల అలాంటివి మాటిమాటికీ మానవుల ముందుకు వస్తుంటాయి. వాటిలో తాత్కాలిక ఆకర్షణ కూడా ఉంటుంది. అందువల్ల మానవుడు వాటి వైపునకు వేగంగా మరలుతాడు కూడా. ఒక్కోసారి వాటిలో అతనికి అతని జాతీయ భావాలకు తృప్తి లభిస్తుంది. ఒక్కోసారి అతనికి వాటిలో దేశప్రేమ భావాలకు బలం చేకూరుతుంది. మరోసారి అతనికి వాటిలో మంచిని ప్రేమించే భావాల సంతృప్తి ప్రాప్తిస్తుంది. కాని ఈ తాత్కాలిక సిద్ధాంతాల వల్ల రెండు పెద్ద నష్టాలు కలుగుతాయి. మొదటిది మనిషి దృష్టి ఆలోచనల్లో సంకుచితత్వం పుడుతుంది. మానవుని దౌర్బల్యం ఏమిటంటే, ప్రత్యేక పరిస్థితుల్లో ప్రత్యేక సమస్యలకు లోబడి ఏర్పరచుకున్న భావన ఆధారంగా సత్యం అన్నది

కూడా అందులోనే పరిమితమయి ఉంటుందని అనుకుంటాడు. నిజానికి వాస్తవం లేక సత్యం అంతకన్నా ఎన్నో రెట్లు విశాలమయింది.

ఉదాహరణకు, నేడు ప్రపంచంలో ప్రతి దేశం అది సామ్యవాద దేశమయినా, పెట్టుబడిదారీ దేశమయినా ఆర్థిక దోపిడిని వ్యతిరేకిస్తోంది. దాన్ని అంతమొందించాలని కోరుకుంటుంది. అయితే ప్రతి దేశం దృష్టిలో దోపిడీ అన్న దానికి వేరువేరు నిర్వచనాలున్నాయి. అది స్వయంగా దేన్ని దోపిడిగా భావిస్తుందో అదే లేక దాని కనుగుణమయిందే నిజమయిన దోపిడి. సామ్యవాదం, వ్యక్తిగత ఆస్తి కలిగి ఉండటాన్ని దోపిడిగా భావిస్తుంది. కాని వ్యక్తిగత ఆస్తి రాజ్యం ఆధీనమయితే అది దోపిడి కాదంటుంది. దీనికి భిన్నంగా పెట్టుబడిదారీ విధానంలో వ్యక్తిగత ఆస్తి కలిగి ఉండటం ఏ విధమయిన దోపిడీ కాదంటుంది. అయితే రాజ్యం దాన్ని స్వాధీనం చేసుకోవడం దోపిడిగా భావిస్తుంది. నిజానికి వీటిలో ప్రతి విధానంలోనూ దోపిడి ఉంటుంది. వ్యక్తి కూడా దానికి పాల్పడతాడు రాజ్యమూ దానికి ఒడిగడుతుంది. కాని ఆయా సిద్ధాంతాల్లోని పరిమితి వాస్తవాన్ని కూడా పరిమితం చేసివేసింది.

కొన్నిసార్లు మనిషి ఒక సత్య విషయాన్ని అవలంబించాలని అనుకుంటాడు, కాని తన దృష్టిలోని పరిమితి వల్ల దాని ఒక్క కోణాన్నో లేక కొన్ని కోణాలనో చూడగలుగుతాడు, అందువల్ల సత్యం ఆ కోణాల్లోనే పరిమితమయి ఉందని తలపోస్తాడు. అందువల్ల సత్యాన్ని దాని పరిపూర్ణ రూపంలో, అన్ని కోణాల్లో అవలంబించలేకపోతాడు.

ఈ తాత్కాలిక సిద్ధాంతాల వల్ల కలిగే మరో నష్టం, దేశకాల పరిస్థితులకు పుట్టని, పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు సంభవించినా మనగలిగే ఏదయినా ఒక సిద్ధాంతం సాధ్యమా అని మనిషి ఊహించలేకపోవడం.

మరో మాటలో చెప్పాలంటే, సత్యం, యదార్థాల ప్రతి మూలాన్ని మానవుడు తాత్కాలికమయిందని నమ్మాడు. దాని విలువ కూడా సమయం దాటగానే అంతమయిపోతుందని భావించాడు. ఇక మనిషికి మరో విషయం అర్థంకాదు. సమాజ నిర్మాణానికి శాశ్వత విలువలు కూడా ఉంటాయన్న మాట, వాటి ఆధారంగా మనుషులు పరస్పరం విశ్వసించగలరన్న మాట మానవునికి బోధపడదు. ప్రతి

వ్యక్తి తన స్థానంలో భయవిహ్వాలుడయిపోయాడు. ఆ భయం ఆధారంగానే అతను తనలాంటి వ్యక్తులతోనయినా, రాజ్యవ్యవస్థతోనయినా వ్యవహారం సలుపుతున్నాడు. ఇలాంటి ఆధారం ఎంత కాలమని మనగలదు?

ఇస్లామ్ ఒక శాశ్వత యదార్థం

ఇస్లామ్, శాశ్వతమయిన, చిరస్థాయి జీవన ప్రమాణాలను మనకు అందజేస్తుంది. ఈ విలువలు వ్యక్తుల జీవితంలో ప్రతి కాలంలోనూ కొట్టవచ్చినట్టు కానవచ్చాయి, నేడూ కానవస్తూనే ఉన్నాయి. ఒక ప్రత్యేక చారిత్రక యుగంలో సామూహిక జీవితంలోనూ అవి దర్శనమిచ్చాయి. ఇస్లామ్‌ను ఒక ప్రత్యేక చారిత్రక కాలం నాటి సామూహిక వ్యవస్థ అన్న దృక్కోణంతో ఇస్లామ్‌ను అధ్యయనం చేసేవారు, ఆ కాలం తరువాత ఇస్లామ్ ప్రాముఖ్యం ఏమిటో అర్థం చేసుకోవడం కష్టం. నిజానికి ఇస్లామ్ ఒక చారిత్రక సత్యం అవడంతోపాటు, అంతకన్నా అధికంగా అదొక శాశ్వత సత్యం. దాని వ్రేళ్ళు మానవుని అంతరాత్మలో అంతర్లీనమై ఉన్నాయి. మానవుని మనస్తత్వం, నైజం మారనివయితే ఇస్లామ్‌కు కూడా అంతం లేదు, వినాశంలేదు. ఒక ప్రత్యేక కాలంలో, ప్రత్యేక వాతావరణంలో అది సామూహిక వ్యవస్థపైన అధికారం చెలాయించిందన్నది వాస్తవమే. కాని అది ఆ కాలం, ఆ వాతావరణానికి అనుగుణంగా పుట్టలేదు, ఆ కాలం దాటిపోగానే అది అంతమైపోవడానికి. అది ఏ ఒక్క ప్రత్యేక సమస్యనూ తీసుకుని ముందుకు రాలేదు, లేక దాని ముందు ఏ ప్రత్యేక జాతి ప్రయోజనమూ లేదు. అదొక శాశ్వత వసంతం. ఏ సమాజమయినా దాన్ని ఆహ్వానిస్తే అందులో ఆ వసంతం వచ్చేస్తుంది, కాని సంకుచిత దృష్టి దాన్ని ఆ సమాజంలోని వసంతమే అని అనుకుంటుంది.

రెండు మౌలిక ప్రశ్నలు

మానవుడు ఏ కాలంలో, ఎలాంటి వాతావరణంలో, ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొంటాడో, ఆ పరిస్థితుల్లో అతనికి ఏ సమస్యలు ఎదురవుతాయో, వాటి పరిష్కారానికి ఏ ఉపాయాలు అవలంబించాలో అనే విషయాలు ఇస్లామ్ చర్చించదు. వ్యావసాయిక కాలంలో మానవుని ఆర్థిక సమస్య ఎలా ఉంటుందో, పారిశ్రామిక కాలంలో అది ఏ రూపు దాల్చుతుందో, ఇరువయ్యో శతాబ్దిలో అతని సంస్కృతి

ఏ స్థాయిలో ఉంటుందో, ఆ తరువాత అందులో వచ్చే మార్పులేవో చర్చించదు. దానికి బదులు అది మానవుణ్ణి గురించి మానవునిగా చర్చిస్తుంది. మానవుడు చరిత్ర యుగానికి మునుపటి వాడయినా తరువాతి వాడయినా, దాని దృష్టిలో నాగరిక, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ సమస్యలు, మానవుని అసలు సమస్యలు కావు. ఈ సమస్యలు రెండు మౌలిక ప్రశ్నలకు లోబడి ఉన్నాయి.

ఆ ప్రశ్నలకు సమాధానమే అతని సమస్యల పరిష్కారాల రూపాన్ని నిర్ణయిస్తుంది. అందువల్ల ఆ సమస్యల్ని సంస్కృతీ నాగరికతల ఏ విప్లవంలో ఉన్నా పరిష్కరించడం అవసరం. వాటిలో ఒకటి విధేయత, దాస్యానికి సంబంధించింది, రెండవది మానవుని అంతిమ పరిణామానికి సంబంధించింది.

మొదటి ప్రశ్న

మొదటి ప్రశ్నకు భావమేమిటంటే మనిషి తన్నుతాను దైవానికి అర్పించుకోవాలి, తన స్వేచ్ఛను వదలుకోవాలి. దేవుని విధేయతను పాటించడమో పాటించక పోవడమో చాలా ప్రముఖ ప్రశ్న. దాని ప్రతిధ్వని మానవుని ఆంతర్యంలోనూ, విశ్వ వ్యవస్థ అంతటిలోనూ వినవస్తోంది. ఈ జగతి ద్వారా ప్రయోజనం పొందాలంటే మనం ఒక నిర్ణయానికి రావలసి ఉంటుంది. మనం ఈ విశ్వకర్తకు విధేయులుగా జీవించాలా లేక స్వతంత్రులుగా, స్వేచ్ఛాయుతులుగా జీవించాలా అని తేల్చుకోవాలి.

ఈ ప్రశ్న గత కాలానికి వర్తించినట్లే వర్తమానానికీ, భవిష్యత్తుకీ వర్తిస్తుంది. ఈ ప్రశ్న కేవలం సైద్ధాంతికమయింది కాదు, ఇది ఎంతగా సైద్ధాంతికమయిందిగా అగుపడుతుందో అంతకన్నా అధికంగా ఆచరణాత్మకమయింది. మానవుడు ఎన్నో సమస్యల్ని ఉపేక్షించి ముందుకు సాగిపోతాడు. కాని ఈ ప్రశ్నను పరిష్కరించకుండా అతను జీవితంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేడు. అతని ముందు మనో కాంక్షలున్నాయి; జాతి, దేశానికి సంబంధించిన కోరికలున్నాయి; ఆచార వ్యవహారాలున్నాయి; వీటిలో ప్రతిదీ అతన్ని తన్ను అనుసరించమంటుంది. అతడు ఆరాధించడానికి ఈ ఆరాధ్యుల్లో ఏదో ఒకదాన్ని ఎన్నుకోవలసి ఉంటుంది లేదా దైవాన్ని ఎన్నుకోవలసి ఉంటుంది. ఈ ప్రశ్నను పాత ప్రశ్నగా, జీవంలేని ప్రశ్నగా

అభివర్ణించే వ్యక్తి ఈ జగతిలోని ఒక్కొక్క వస్తువును, స్వయంగా తన్ను తాను కాదనే సాహసంగలవాడే కాగలడు.

రెండవ ప్రశ్న

రెండవ ప్రశ్న ఇస్లామ్ లేవనెత్తేది పరలోకానికి సంబంధించింది. అది పరలోకాన్ని భవిష్యత్తులో సునిశ్చితంగా సంభవించే సంఘటనగా ముందుపెడు తుంది. పరలోకం ఒక జీవితం. అది, మన ప్రస్తుత జీవితపు సరిహద్దు ముగిసే చోటున ప్రారంభమవుతుంది. నాగరికతా సంస్కృతుల ఏ దశకు చెందిన వ్యక్తి అయినా తాను పరలోకం నుంచి సురక్షితంగా ఉన్నానని చెప్పలేడు. అదొక సంభవించనున్న సంఘటన, దాన్నుండి కాపాడుకునే ఏ ఉపాయమూ ఎవరివద్దా లేదు. అతను ఒక ఘటనను ఎదుర్కోబోతున్నాడు; దాన్ని ఎదిరించడానికి తన వద్ద ఎలాంటి ఆయుధమూ లేదు. అతను ఒక గమ్యం వైపునకు పురోగమిస్తున్నాడు; అటు కొన్ని అడుగులు ముందుకు పోగానే అతని ప్రయాణ సామగ్రి ముగిసి పోతుంది. ఈ స్పృహ ఏ కాలపు, ఏ స్థితిలోని మనిషినీ పరలోక చింతన పట్ల ఉపేక్షించనివ్వదు. ఒక నగరవాసులకు అక్కడ బాంబు వేయబోతున్నారని తెలిస్తే అందులోని ప్రతి పౌరుడు అతడు కూలీ వాడయినా, యజమాని అయినా, రైతు అయినా పారిశ్రామికుడయినా, వ్యాపారి అయినా, పరిశోధకుడయినా అక్కడి నుండి పలాయనం చిత్తగించాలని ప్రయత్నిస్తాడు. పరలోకం కూడా అచ్చంగా ఇలాంటిదే. ఇది ప్రతి వ్యక్తికి చెందిన వ్యక్తిగత సమస్య. ఇది జరగబోదని అనుకునే వ్యక్తి మాత్రమే దీని పట్ల ఏమరుపాటుకు గురి అవుతాడు. దీన్ని విశ్వసించే వ్యక్తిని అతని విశ్వాసం ప్రమత్తంగా నిద్రపోనివ్వదు.

దైవం, పరలోకాలకు సంబంధించిన ప్రశ్న మనిషి జీవితం మొత్తానికి సంబంధించిన సమస్య. ఈ ప్రశ్నకు లభించే ప్రతి సమాధానం ప్రకారమే, జీవిత చక్రం మొత్తం మలచాలన్నది అనివార్యమవుతుంది. దీని సంబంధం మానవుని అంతరాత్మ, అతని భావాలు, ఉద్రేకాలతో కూడా ఉంది, సామాజిక సమస్యలతోనూ ముడివడి ఉంది. జీవితంలోని ఏ కోణాన్నీ దానికి వెలుపల నిర్మించడం సాధ్యం కాదు. దైవం, పరలోకాలు మానవుని భావనల్లో లేకపోతే మనిషి తన వ్యక్తిగత,

సామూహిక అవసరాలను మరే విధంగానయినా నెరవేర్చుకోడానికి స్వతంత్రుడై పోతాడు. అలాగే దాన్ని విశ్వసించిన తరువాత మానవుని ఆలోచన ఆచరణల ప్రతి కోణంలోనూ దాని అధికారమే కొనసాగుతుంది.

దైవాన్నీ పరలోకాన్నీ నమ్మినదాని మొదటి ప్రభావం, మనిషి వ్యక్తిత్వం మీద పడుతుంది. ఎందుకంటే ఈ నమ్మకం మానవుని ఆంతర్యంలో ఉత్పన్నమయ్యే ప్రశ్నలకు సమాధానం. విశ్వంలో ఒక అగోచర అస్తిత్వం ఉందన్న యదార్థాన్ని గురించి మనిషికి తెలిసినప్పుడు అంతా మారిపోతుంది. ఆ అస్తిత్వం చేతుల్లోనే సర్వాధికారాలున్నాయని, ఆ అస్తిత్వమే మనిషి సృష్టికర్త, స్వామి అని, ఆయన సమక్షంలోనే మనిషి ఒకనాడు హాజరుకావలసి ఉందని, అప్పుడు తన ఆచరణల లెక్కలు ఇవ్వవలసి ఉంటుందని తెలుసుకోగానే అతను తన కర్త, స్వామి పట్టుకు భయపడతాడు, ఆయన వరప్రసాదాలు కావాలని, మేళ్ళు కావాలని కోరుకుంటాడు. అతను మూర్తీభవించిన ఆవశ్యకతగా, ఆపేక్షాపరుడుగా, భయాక్రాంతునిగా రూపొం దుతాడు. దేవుని ప్రేమానుగ్రహాలను ఆశలతో చెయ్యిచాచి అర్థిస్తాడు, ఆయన సమక్షంలో తలవంచి, అశక్తునిగా, వినమ్ర మనస్కునిగా, బలహీనతను అంగీకరిస్తూ నిలబడతాడు.

ఆరాధనా నియమం

మానవునిలో కలిగే ఈ స్పృహ శాశ్వతమయింది, యదార్థమయింది. మనిషి కష్టాల్లో ఉన్నా సుఖాల్లో ఉన్నా, నాగరిక కాలంలో ఉన్నా, అజ్ఞాన కాలంలో ఉన్నా – దైవాన్ని తలచినప్పుడల్లా తన ఆంతర్యం ఈ భావాలతో, అనుభూతులతో జ్యోతిర్మయమయినట్లు కనుగొంటాడు. భావాలు, అనుభూతులు మానవుని ఆంతర్యానికి సంబంధించినవి. మానవుని ఆంతర్యంలో ఏ పరివర్తన సంభవించినా అతని నైజానికి సుపరిచితమయిన రూపంలోనే వస్తుంది. అందువల్లనే ఇస్లామ్‌లో ఆరాధనా నియమాలు సుస్థిరమయినవి. వాటిలో ఏ విధమయిన మార్పు చేసే అధికారం ఎవ్వరికీ లేదు, నిజానికి ఆ అవసరమూ లేదు. ఆరాధన, దేవుని దైవత్వం, మహత్తు, మానవుని అశక్తత, వినమ్రతల అభివ్యక్తికి అత్యంత సరైన విధానం. అలా సరైన విధానం నిర్ధారించే అవసరముంది కూడా. ఎందుకంటే

తద్వారా తప్పుడు విధానాలు, నిజ లక్ష్యానికి వ్యతిరేకమయిన విధానాలు అన్నింటి నుండీ అదే రక్షిస్తుంది. అలా జరగకపోతే మానవుడు సత్యాన్ని చేరడానికి బదులు దానికి పూర్తిగా దూరమయిపోవడం కూడా సంభవమే.

వ్యవహారాల్లో పరిశోధన

మానవుల పరస్పర వ్యవహారాల విషయంలో ఇస్లామ్ స్వల్పమయిన ప్రతి విషయాన్నీ చర్చించలేదు. దానికి బదులుగా రాజకీయాల్లో, నైతికతలో మౌలికమైన సూత్రాలను అందజేసింది. మానవుని బాహ్య ప్రపంచం సదా పరివర్తనలు, మార్పుల కూడలి. నేడున్న నాగరిక దశను, కొన్ని వందల సంవత్సరాల క్రితం మనిషి బహుశా ఊహించనయినా ఉండడు, ఊహించడం దుర్లభం కూడా. వ్యవహారాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు నేడు భిన్నరీతుల్లో జరుగుతున్నాయి. రేపు మరో విధంగా మారిపోవచ్చు. గతంలో ఏ సామాజిక మర్యాదల్ని మనిషి పాటించేవాడో నేటి కాలంలో అవి మనిషికి అపరిచితమయిపోయాయి.

చట్టాలకు సంబంధించిన ఒక పట్టిక తయారుచేసి అవి అన్ని కాలాల్లోనూ మానవ వ్యవహారాలకు వర్తించాలని అనుకోవడం సాధ్యమయ్యే విషయం కాదు. రాజకీయాలకు, నైతికతకు ఇస్లామ్ అందజేసిన సూత్రాలు, సంస్కృతీ నాగరికతల ఏ విప్లవంలోనయినా మనిషికి సముచితంగానే అన్వయిస్తాయి, మనిషి వాటిని ఎట్టి పరిస్థితిలోనూ కాదనలేడు. అవి ప్రతి కాలంలోనూ అన్ని పరిస్థితుల్లోనూ అతనికి మార్గం చూపుతాయి. ఈ సూత్రాలు, రాజకీయాలకు, నైతికతకు మార్గ చిహ్నాల వంటివి. వీటిద్వారా మానవుడు తన దైవాన్ని చేరుతాడు. ఈ చిహ్నాలను దారి నుండి తొలగించినట్లయితే మానవుడు ప్రపంచ వ్యవహారాలలో దేవుని అభీష్టమేమిటో గ్రహించలేడు. నాగరికత, రాజకీయాలు, సంస్కృతి, సామాజికత తదితర రంగాల్లో మానవుడు ఏ ఏ మలపుల్లో, ఎక్కడెక్కడ దారితప్పి రుజుమార్గానికి దూరమయ్యే ప్రమాదం ఉంటుందో అలాంటి ప్రతి చోటా దైవం ఈ సూత్రాల ద్వారా మార్గం చూపే, దారితప్పకుండా వారించే ఏర్పాట్లు చేశాడు.

ఈ మార్గ చిహ్నాల వల్ల భువిలో దేవుని పరిపాలన నెలకొని ఉందని రుజు

వవుతుంది. అందువల్ల వీటిని ఎన్నటికీ చెరపరాదని ఇస్లామ్ నిర్ణయిస్తుంది, వాటిని సదా ప్రస్ఫుటంగా ఉజ్వలమానంగా ఉంచాలని అంటుంది. ఈ సూత్రాలు లెక్కలో కొన్ని మాత్రమే. కాని జీవిత వ్యవహారాలు ఎంతో విస్తృతమయినవి, వాటినన్నింటినీ ఈ సూత్రాల ద్వారా పరివేష్టించడం అసాధ్యం. కాని వీటి ఆధారంగా దేవుని అభీష్టం ఏమిటో తెలుసుకోవచ్చు. ఇవి కాంతి గోపురాలు, గమ్యం ఏదో చూపుతుంటాయి. ఈ సూత్రాలను కాదనడమో లేక వీటికి తిరగబడటమో జరగనంత వరకు వీటి ఆధారంగా జరిగే ప్రతి ప్రయత్నం దైవాన్ని పొందే ప్రయత్నంగా పరిగణించబడుతుంది. ఈ ప్రయత్నాన్నే షరీఅత్‌లో ఇజ్తిహాద్ (పరిధనా ప్రధానమయిన అన్వయింపు) అని అంటారు. ఇజ్తిహాద్ అంటే నిజానికి దైవం ప్రబోధించిన మార్గదర్శకత్వపు కాంతిలో ఆయన ఇష్టం ఏమిటో కనుగొనడం. ఇలా అన్వేషణ, అన్వయింపుల ద్వారం ప్రళయం వరకు తెరచుకునే ఉంటుంది.

6. తిరుగుబాటు - ఎందుకు?

ఒక్క ఇస్లామ్ మాత్రమే జీవితపు సమస్త సమస్యలకు పరిష్కారమని, దీని ద్వారానే మానవుల చిక్కులూ ఇక్కట్లూ అన్నీ తీరిపోతాయని, వారికి సుఖశాంతులు, సమృద్ధి, సంతృప్తి ప్రాప్తిస్తాయని, దీన్ని కాదని వారు మరే మార్గం ద్వారానూ తమ సమస్యల్ని పరిష్కరించుకోలేరని అన్నప్పుడు ఈ వాదనకు ప్రతిగా వెంటనే ఒక ప్రశ్న తలెత్తుతుంది. అలాంటప్పుడు ప్రపంచం మొత్తం ఇస్లామ్ వైపునకు పరుగిడి రావలసిందే మరి ఏ కారణం వల్ల అది దానికి తిరగబడుతోంది, దాన్ని ద్వేషిస్తోంది, అదంటే దూరంగా పరుగెడుతోంది?

మొదటి కారణం

మొదటి కారణం మానవునికి ఈ ప్రపంచం, ప్రాపంచిక ప్రయోజనాలు చాలా ఇష్టం. ఈ ప్రయోజనాలకు వ్యతిరేకమయిన ఏ సిద్ధాంతాన్నయినా మానవుడు స్వీకరించడం బహు కష్టం. స్వప్రయోజనాలూ, సత్యం, వాస్తవికతల మధ్య అతను ఎన్నుకోవలసి వచ్చినప్పుడు అతను స్వప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తాడు. ఫలానా సత్యం కొరకు ఫలానా నష్టాన్ని భరించమని కోరినప్పుడు అతడు దానికి సిద్ధపడడు. ఏదయినా లాభం కలుగుతుందన్న ఆశ ఉంటే అతడు తన తోటి సోదరి పట్ల కూడా మోసం దగాకు పాల్పడగలడు. అతి సాధారణ లాభాలకు అతడు తన పొరుగువాని ఇంట కన్నం వేయడానికీ, తరచూ, జాతికి, దేశానికి విద్రోహం తలపెట్టడానికీ ఎంత మాత్రం జంకడు.

ఇస్లామ్ ఇలాంటి స్వార్థప్రయోజనానికి వ్యతిరేకం. దాని దృష్టిలో మానవుల మధ్య చెలరేగే సమస్యలన్నింటినీ చిక్కులన్నింటినీ పరిష్కరించాలంటే మనిషి అధికారాలు, ప్రయోజనాల పోరాటం మానుకోవాలి. ఇతరుల హక్కులు కొల్లగొట్ట డానికి బదులు వారి ప్రయోజనానికి తన హక్కును సయితం త్యాగం చేయగలగాలి. ఇతరుల సౌలభ్యం, సౌఖ్యాలకు తన సౌఖ్యంపైన ప్రాధాన్యత ఇవ్వాలి. తనకు అన్యాయం, అత్యాచారం జరిగినా తాను మటుకు న్యాయం, నీతిని వదలరాదు.

ఎదుటివాడు దురహంకారం, పొగరు చూపినా తాను మాత్రం వినయం, వినమ్రతలే ప్రదర్శించాలి. దురభిలాషకు బదులు శ్రేయోభిలాష, ద్వేషానికి మారుగా ప్రేమను పంచిపెట్టాలి. ఎవరయినా మీ సోదరుని హత్యచేస్తే దానికి ప్రతిగా పగతీర్చుకునే హక్కు మీకుంటుంది, కాని గొప్పదనం ఔన్నత్యం అనేవి అతన్ని క్షమించడంలోనే ఉన్నాయి. ఇదంతా ఏదో భౌతిక ప్రయోజనాలు, ప్రాపంచిక ఉద్దేశ్యాలతో కాదు, కేవలం మీ దైవం మీ పట్ల ప్రసన్నత పొందాలని, పరలోకంలో ఆయన అనుగ్రహాలకు మీరు పాత్రులు కావాలని మాత్రమే.

ఇస్లామ్ చేసే ఈ ప్రతిపాదనను మనిషి నెరవేర్చాలంటే అతను ప్రపంచం లోని లాభనష్టాలకన్నా పరలోకంలోని లాభనష్టాలను సునిశ్చితమయినవిగా భావించవలసి ఉంటుంది. కాని ఒక విషయం భవిష్యత్తు తెరల మధ్య దాగి ఉండగా, మనిషి తలపైని కళ్ళు దాన్ని చూడలేనప్పుడు దాన్ని గురించి విశ్వాసం ఆ మేరకు కలగడం చాలా కష్టం. అనుదినం తాను కళ్ళారా చూస్తున్న అనుభవిస్తున్న తన ప్రయోజనాలను దాని కొరకు త్యజించడం అంటే అది మరీ దుర్లభం.

రెండవ కారణం

ప్రతి యుగంలోనూ ఏవో కొన్ని మంచి విషయాలు ఉంటాయి. ఆ మంచి విషయాలే ఆ కాలానికి ప్రత్యేక గుర్తింపునిస్తాయి. వాటి కారణంగా అది ఇతర కాలాలకు సదృశంగా భిన్నంగా అలరారుతుంది. ఈ మంచితనాలు మనుషుల చూపులను పూర్తిగా ఆక్రమించుకుంటాయి. ఫలితంగా జనం ఆనాటి చెడులను, స్పష్టంగా కనిపించే చెడులను సయితం గమనించలేకపోతారు. ఒక కాలంలో మానవుడు రాజుల విజయాలు, వారి జనరంజక పరిపాలన, వారి దాతృగుణం, వారి బహుమానాలు, ఉదార స్వభావాలను గురించి పొగడ్తలు గానం చేసేవాడు. ఆ కాలం అంతరించిపోయిన తరువాత, ప్రజాస్వామ్య వ్యవస్థ రాగానే దాన్ని ప్రశంసాగానాలు ఆలాపిస్తున్నాడు. అతనికి ఆనాడు రాచరికంలోని చెడులూ కనిపించలేదు, ఈనాడు ప్రజాస్వామ్యంలోని లోపాలూ అతను గుర్తుపట్టలేక పోతున్నాడు.

నేడు విజ్ఞాన శాస్త్రం బాగా వృద్ధి చెందింది. ఈ ప్రగతి వల్ల మనిషికి

నిస్సందేహంగా ఎంతో ప్రయోజనం ఒనగూడింది. దీనితోపాటు ఆధునిక దుష్ట ఆలోచనలు, సిద్ధాంతాలు మానవునికి ఎంతో కీడు చేశాయి. కాని విజ్ఞాన శాస్త్రం లోని ప్రగతీ వికాసాలు అతన్ని ఆవహించి మంత్రముగ్ధుణ్ణిగా చేశాయి. ఈ కాలపు లోటుపాట్లేమిటో, చెడుగులేవో వాటిని గురించి ఆలోచించడానికీ మనిషి నేడు సిద్ధంగా లేడు. ఉదాహరణకు, మీరు స్త్రీపురుషులు విచ్చలవిడిగా కలసుకోవ డాన్ని విమర్శిస్తే మిమ్మల్ని తెలివితక్కువ వానిగా చూస్తారు, దానికి ఆధారం కేవలం, స్త్రీ పురుషుల విశృంఖల సమావేశాలను ఈ కాలం ఎంతో ప్రగతిశీలమయినదిగా భావించడం. అలాగే నేటి ఆలోచనలు, సిద్ధాంతాలు మతాన్ని, దాని సూత్రాలను, విశ్వాసాలను పూర్తిగా ఖండించాయి, తిరస్కరించాయి, అందువల్ల అవి నిరాధార మయినవని, నిరర్థకమయినవని కూడా రుజువయిందన్న మాట!

భారత దేశాన్నే తీసుకోండి. ఇక్కడ నివసించే జాతుల్లో ఏదీ మతాన్ని కాదనదు, తిరస్కరించదు. అన్నింటి ప్రాతిపదికనా మత ప్రధానమయిన సూత్రాల ఆధారంగానే ఏర్పడ్డాయి. భారత దేశం నిర్మాణంలోనే మతం అంతర్లీనమయి ఉందంటే అది అతిశయోక్తికాదు. కాని ఇక్కడి మేధావులు తమ సమస్యల పరిష్కా రానికి ప్రస్తుతం చెలామణిలో ఉన్న సిద్ధాంతాల్లో ఏదో ఒకదాన్ని ఎన్నుకుంటారు లేదా వీటిలో కొన్నింటిని కాస్త ఇటూ అటూ కత్తిరించి ఏదయినా కలగూర గంపను తయారుచేస్తారు. ఎవరయినా మేధావికి లేక ఒక మతాన్ని ఆశ్రయించే వ్యక్తికి మతం వెలుగులో తమ సమస్యల పరిష్కారాన్ని అన్వేషించే సాహసం కలగదు. లేదా మతాన్ని ఆచరణ శూన్యమయిందిగా, అశాస్త్రీయమయిందిగా భావించే వారి వాదనలను, ఆధారాలను కనీసం విమర్శనాత్మకంగా పరిశీలించేందుకు సాహసించే వారు కూడా ఎవరూ కానరావడం లేదు.

ఈ కాలపు ప్రతి పాలక సిద్ధాంతం, అది సోషలిజం అయినా ప్రజాస్వామ్య మయినా, నిరంకుశత్వం అయినా తన నైజం, తత్వం రీత్యా పూర్తిగా ఇస్లామ్ వ్యతిరేకమయింది. దాని తొలి అడుగే దైవ తిరస్కారం, ప్రళయం, పాపఫలం, పుణ్యఫలం ఇత్యాది వాటి తిరస్కారంతో ప్రారంభమవుతుంది. ఇలాంటి కాలం, స్వయంగా ముందుకు వచ్చి తన గుండెను ఇస్లామ్ కోసం తెరుస్తుందని ఆశించడం నిరర్థకం.

మూడవ కారణం

ఈ ఆధునిక సిద్ధాంతాల ప్రభావానికి, ఇస్లామ్‌ను గురించి తెలియనివారే కాదు, స్వయంగా ఇస్లామ్ అనుయాయులు కూడా గురయిపోయారు. వీరిలో ఒక వర్గం ఇస్లామ్ వ్యతిరేక సిద్ధాంతాలను మనఃపూర్వకంగా స్వీకరించింది. ఈ సిద్ధాంతాలకు వంతపాడుతూ బహిరంగంగానే ఇస్లామ్‌కు కాలం చెల్లిందని, అది అర్థరహితమని ప్రకటిస్తోంది. ఈ వర్గం తన పేరులో, తన వంశంలో, తన జాతిలో ఇస్లామీయ సంప్రదాయాలు వ్యక్తమవుతున్నందుకు బాధపడుతుంది కూడా. ఇస్లామ్ పట్ల ఈ మేరకు తృణీకారభావం ఉన్న వర్గం, ఆచరణ రీత్యా, ఇస్లామ్ వైపునకు మరలడం, మానవ సమస్యలకు దాన్ని సంప్రతించడం వ్యర్థమని, ఇస్లామ్ దానికి తగదని ప్రకటిస్తోందన్న మాట. దాని దృష్టిలో మానవ సమస్యలకు పరిష్కారం ఇస్లామ్‌లో కాదు, ఇస్లామ్‌కు వెలుపల లభిస్తుందన్న మాట.

రెండవ వర్గం విశ్వాసం రీత్యా, ఇస్లామేతర సిద్ధాంతాలనే నమ్ముకుంది. కాని ఇస్లామ్ పేరు చెప్పుకునే జాతిలో పుట్టడం చేత జాతీయ ప్రభావాలు సయితం అందులో ఉన్నాయి. అందువల్ల అనుసరించడమయితే ఆసాంతం ఇస్లామ్ వ్యతిరేక సిద్ధాంతాలనే అనుసరిస్తుంది కాని అదే సమయాన తన జాతికి దూరమవడానికి ఇష్టపడదు. ఈ ఉద్దేశ్యంతో ఈ వర్గం, తనకు ఇష్టమయిన సిద్ధాంతాలు ఇస్లామ్‌ను పట్టించుకోని జీవితపు విభాగాలలో ఇస్లామ్‌ను కొనసాగనిస్తుంది, కాని ఇస్లామ్‌తో అవి ఘర్షించే విభాగాలలో మాత్రం అది నిస్సంకోచంగా ఆ సిద్ధాంతాలనే అవలంబిస్తుంది. నిజం చెప్పాలంటే ఈ వర్గం తన జీవితంలో ఇస్లామ్, తిరస్కారాలు; దేవుని ఏకత్వం, బహుదైవారాధనలు; పరలోక తిరస్కారం, పరలోక విశ్వాసం అన్నీ తోడుగా ఉండాలనే కోరుకుంటుంది. ఈ వర్గం అనుసరించే ఈ పరస్పర విరుద్ధ వైఖరుల వల్ల ఇస్లామ్ ఎంతో హాస్యాస్పదంగా గోచరిస్తుంది. దాని వైపునకు కన్నెత్తి చూడటానికి కూడా ఏ వ్యక్తీ ఇష్టపడదు.

మూడవ వర్గం సాంప్రదాయిక ముస్లిములది. అది ఇస్లామ్‌ను సశాస్త్రీయ విధానంలో ఎన్నడూ పరిశీలించలేదు, దానికి ఆ సామర్థ్యమూ లేదు. ఈ వర్గం కొన్ని అస్పష్ట విశ్వాసాలు, జాతీయ సంప్రదాయాలను తనకు ప్రియమయినవిగా తన గుండెకు హత్తుకుని బతుకుతోంది. దాని విశ్వాసాలపైన ఏ ఏ దిశల నుండి

దాడులు జరుగుతున్నాయో దానికి ఏ మాత్రం తెలియదు. అది ఏ సత్యాలనయితే తిరుగులేని యదార్థాలుగా భావిస్తోందో అవి ఏ ఏ రీతిలో సవాళ్ళను ఎదుర్కొం టున్నాయో అది ఎరుగదు. అది తన విశ్వాసాలపైన నిలకడగా సుస్థిరంగా నిలబడి ఉందంటే దానికి ఒక ముఖ్య కారణం దాని విశ్వాసాలపై లేవనెత్తబడుతున్న ఈ అభ్యంతరాలను, ఆక్షేపణలను అది ఎరుగకపోవడమే. ఇవి గనక తెలిస్తే బహుశా అందులోని చాలా మంది తమ స్థానాన్ని వదలి పోవడం కూడా సాధ్యమే. ఈ వర్గం ఆధునిక దుష్ట సిద్ధాంతాలకు ప్రతిగా ఇస్లామ్ ఆధిక్యతను నిరూపించగలదని ఆలోచించడమే అర్థరహితం. సత్యాన్ని గట్టిగా పట్టుకొని నిలకడ చూపడమే దానికి చాలు.

నాల్గవ వర్గం, సమకాలీన సిద్ధాంతాలను పాలక సిద్ధాంతాలుగా గ్రహించడం చేత వాటిని వదలిపెట్టి ప్రగతీ వికాసాలను ఊహించనయినా లేదు. ఈ వర్గం చరిత్రను అధ్యయనం చేసినా జాతుల ఉత్థాన పతనాలు తన కాలం నాటి ఈ సిద్ధాంతాలు, విశ్వాసాల ఆధారంగానే జరిగాయని అనుకుంటుంది. ఈ వర్గం నిత్యం సమకాలీన పోకడలననుసరించి ఇస్లామ్‌ను నిర్వచించడానికి, వ్యాఖ్యానిం చడానికి ప్రయత్నించింది. దాని దృష్టిలో అలా చేయకపోతే ఇస్లామ్ సత్యత అసలు నిరూపించడమే కష్టం. ప్రజాస్వామ్యం సర్వాధిక్యత పొందగానే ఇస్లామ్ కూడా ప్రజాస్వామ్యాన్ని సమర్థిస్తుంది అని పలికింది ఈ వర్గం. తరువాత ప్రజాస్వామ్యాన్ని పరిమితం చేసే దృక్కోణం ప్రబలగానే ఈ వర్గం, ఇస్లామ్‌లోనూ అధికారం ఖలీఫా లేక ఇమామ్ చేతుల్లోనే ఉంటుందనసాగింది.

ఈ వర్గం మంచి ఉద్దేశ్యం గలదయినప్పటికీ ఇస్లామ్‌ని ఇతర సిద్ధాంతాలకు సదృశంగా ఉన్నతమయిందిగా నిరూపించలేకపోయింది. అందువల్లనే ఈ వర్గం చేసిన కృషి ఫలితంగా ప్రపంచం ఎన్నడూ ఇస్లామ్ వైపునకు మొగ్గుచూపలేదు. ఎందువల్లనంటే దీని అభిప్రాయంలో, ఇస్లామ్ ప్రతిపాదించే జీవితానికి సంబంధిం చిన ఏ అభిప్రాయమయినా, ఏ దృక్కోణమయినా అది ప్రపంచానికి వేరుగా ప్రత్యేకంగా ఏమీ లేదు, పైగా అది ప్రపంచంలోని అభిప్రాయాలనే సమర్థిస్తుంది.

ఈ వర్గం ఒకవైపున ఇస్లామ్‌ను ఒక ప్రత్యేక జీవన వ్యవస్థగా పరిచయ మయ్యే అవకాశం కల్పించలేదు, మరో వైపున ఇస్లామ్‌ను ఆధునిక భావాలతో సామరస్యం కుదిర్చే ప్రయత్నంలో అనేక ఇస్లామేతర భావనల్ని ఇస్లామ్‌లో ఉన్నట్లు నిరూపించడం మొదలెట్టింది. ఫలితంగా ఇస్లామ్ నిజ స్వరూపం ఛిద్రమయి పోయింది. ఒక సిద్ధాంతాన్ని దానితో మేళవించని మరో సిద్ధాంతంతో మిశ్రమం చేసినప్పుడు తప్పనిసరిగా దాని రూపు మారిపోతుంది, అంద వికారంగా తయారవు తుంది. ఉదాహరణకు, కమ్యూనిజం ప్రతిపాదించే జీవిత చట్రంలోనయితే సామూహికస్వామ్యం భావన సరిగ్గా అతుకుతుంది. కాని ఇస్లామ్‌లోనూ దానికి నిరూపణలు సాధించ మొదలిడితే అది చాలా హాస్యాస్పదంగా రూపొందుతుంది. ఇస్లామీయ వ్యవస్థ అసాంతం వ్యక్తిగత ఆస్తిహక్కు, మానవుని స్వేచ్ఛ ఆధారంగా ఏర్పడుతుంది. అలాగే ఉపాధి విషయంలో తమ పరిమిత సాధనా సంపత్తిని దృష్టిలో పెట్టుకుని ఆలోచించే సిద్ధాంతాలకు గర్భ నిరోధ భావన పూర్తిగా అనుగుణ్యా మయినదే కాని ఉపాధి నిధులు దేవుని చేతుల్లో ఉన్నాయని విశ్వసించే వారు దాన్ని సమర్థించడమంటే ఒక విధంగా తమ విశ్వాసాన్ని ఖండించడమే అన్న మాట.

ఇక పోతే మిగిలింది ఒక వర్గం. ఇది ఇస్లామ్‌ను అంతిమ నిర్ధారణగా నమ్ముతుంది. దీని విశ్వాసం ప్రకారం జీవితంలోని చిక్కులన్నీ ఇస్లామ్ ద్వారానే పరిష్కరించబడతాయి. కాని సమకాలీన పాలక సిద్ధాంతాలు, ఆలోచనలు, నాగరిక, రాజకీయ, సాంస్కృతిక సామాజిక వ్యవహారాల నుండి, శాస్త్రాలు, కళలు తదితర రంగాల నుండి ఇస్లామ్‌ను దూరం చేసివేసినందువల్ల ఈ వర్గం కూడా, జీవితపు ఈ కోణాల్లోనూ ఇస్లామ్ మార్గ నిర్దేశనాలేవో ఆలోచించడం వదలివేసింది. అది రాజకీయాల ఏ సూత్రాలను రూపొందిస్తుందో, సంస్కృతీ సామాజిక వ్యవహారాల రూపకల్పన ఎలా చేస్తుందో, విభిన్న కళలు, శాస్త్రాలలో ఏ సూచనలిస్తుందో అంతా పరిశీలించడం మానివేసింది.

ఈ విధంగా ఈ వర్గం దృష్టిలో ఇస్లామ్ క్రియాత్మకంగా రేయింబవళ్ళ సామాన్య జీవితం నుండి వెలివెయ్యబడింది; అది ఒక పరిధిలో పరిమితమయి పోయింది. ఆ పరిధిలో ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే వ్యవహారాలు ఎన్నడూ చర్చనీ

యాంశాలు కాలేదు. మానవుడు చిక్కుబడిపోయిన సమస్యల్ని పరిష్కరించడంలో ఇస్లామ్ పాత్రను అతని ముందుంచకపోయినట్లయితే ఆధునిక మానవునికి ఇస్లామ్ పట్ల ఆసక్తి కలిగే అవకాశమేముంటుంది? అతను ఇస్లామ్‌ను తన బాధల నివారిణిగా ఎందుకు భావిస్తాడు?

ఈ వైఖరి వల్ల నష్టపోయింది స్వయంగా ఈ వర్గమే. అది ఇజ్తిహాద్ (అనువర్తింపు శాస్త్రం) సామర్థ్యం కోల్పోయింది. ఈ సామర్థ్యం లేకుండా ఆయా కాల పరిస్థితులలో, సమస్యలలో ఇస్లామ్ అందజేసే మార్గదర్శకత్వం ఏదో కనుగొనడం దుర్లభమయిపోతుంది. ఈ వర్గంలో, ఇస్లామ్‌ను ఏ కాలంలోనయినా సరే ఆనాటికి అదే ఏకైక సత్యధర్మం అని పరిచయం చేసే యోగ్యత లేకపోయింది. తప్పుడు సిద్ధాంతాలకు ప్రతిగా ఇస్లామ్ సిద్ధాంతాల ఆధిక్యతను అది నిరూపించలేక పోయింది.

నాల్గవ కారణం

ఇన్ని రకాల ఆలోచనాత్మకమయిన లోపాలతోపాటు, కొందరు వేళ్ళమీద లెక్కించదగ్గ వ్యక్తులు తప్ప అత్యధిక ముస్లిముల వైఖరి కూడా ఇస్లామ్ అవగాహనా మార్గంలో అవరోధంగా పరిణమించింది. బహుదీర్ఘకాలంగా ఇస్లామ్‌కు మారుగా ఇస్లామేతర భావాలను వారు ఆశ్రయించారు. ఫలితంగా వారి జీవితాన్ని ఏ కోణంలో చూసినా నిజమయిన ఇస్లామ్ ప్రతిబింబించదు. వారు వ్యాపారులయితే, దైవ తిరస్కారులయిన వ్యాపారుల్లా తమ వ్యాపారంలో వంచన, మోసం, అబద్ధం, లంచం ఇత్యాది అవినీతి విధానాలను అవలంబించారు. విద్యార్థులయితే ఇస్లామ్‌ను నిరాకరించే శాస్త్రాల వృద్ధి వికాసాలు, ప్రచారాలకు కృషి సలిపారు. ధనం, సిరులు ప్రాప్తం కాగానే, పరలోకాన్ని మరచిపోయి జీవించే మనిషి ఖర్చుపెట్టే మార్గాల్లో దాన్ని ఖర్చుపెట్టారు. అధికారం ప్రాప్తమయితే అత్యాచారులు, దౌర్జన్యపరులయిన రాజుల అడుగుజాడలననుసరించారు. అలాంటప్పుడు ప్రపంచం వారివద్ద మానవాళి అంతటికీ మోక్షమార్గమయిన సిద్ధాంతాలున్నాయని ఎలా నమ్మగలుగుతుంది! న్యాయం, ధర్మాల హామీనిచ్చే సూత్రాలు వారివద్ద ఉన్నాయని ఎలా భావిస్తుంది? మానవ కళ్యాణానికి, సాఫల్యానికి దోహదపడే బోధనలు వారి వద్ద ఉన్నట్లు ఎలా

నమ్ముతుంది? వారి బాధల నివారణ, వారి కడగండ్లకు అడ్డుకట్ట ఉందని ఎలా అనుకుంటుంది?

ముస్లిముల ఈ వైఖరిని చూసి ప్రపంచం, వారికి ఇస్లామ్ ప్రతిపాదించే ఉన్నత సిద్ధాంతాలు, సూత్రాల పైన విశ్వాసం లేదని, వారు వాటిని ఎపుడో వదలి వేశారని అనుకోగలిగేది కాని ప్రపంచం అలా తలపోయలేదు. దానికి బదులుగా ప్రపంచం మరోలా ఆలోచించడం తప్ప గత్యంతరం లేకపోయింది. ఇస్లామ్, మానవునిలో కిరాతకం, క్రూరత్వం సృజించే మతం అని ప్రపంచం భావించింది. అది మానవుల్ని ప్రపంచ ప్రేమికులుగా, విలాస ప్రియులుగా తయారు చేస్తుందని, అది వంచనను, అబద్ధాలాడటాన్ని నూరిపోస్తుందని అనుకుంది. ఎందుకంటే ముస్లిములు తమ దురాచారాలు, దుష్ట చర్యలతోపాటు తమ్ముతాము ఇస్లామ్‌ని నమ్మే సముదాయంగా పరిచయం చేసుకున్నారు, ఇస్లామ్‌లోనే తమ మోక్షం ఉన్నదని నమ్మే సముదాయంగా ప్రకటించుకుంటూ చెడు నడతను కూడా ప్రదర్శిస్తూపోయారు.

ముస్లిములలోని ఆలోచనాత్మక, చింతనాత్మక స్తబ్ధత, నిష్క్రియాపరత్వం కారణంగా ఇస్లామ్‌ను ఒక ప్రత్యేక వర్గానికి సంబంధించిన మతం అని, ఆ వర్గంలోని కొన్ని నమ్మకాలనే ఇస్లామ్ అంటారని, ఆ నమ్మకాలకు నిత్య జీవితంతో, దాని సమస్యలతో ఎలాంటి సంబంధం లేదని భావించబడింది. అలాగే ముస్లిముల దుష్ట వైఖరి వల్ల, పశుత్వం, విద్వేషం, వైషమ్యం బోధించే మతంగా ఇస్లామ్ ప్రసిద్ధమయింది. ఈ రెండు భావనల్ని అనేక కారణాల వల్ల చాలా విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది; ఈ భావనలు మస్తిష్కాల్లో బాగా లోతుగా పాదు కున్నాయి. వాటిని పెకిలించి తీసివేయనంతవరకు వాటి స్థానే ఇస్లామ్ నిజ స్వరూపం ప్రతిష్ఠించడం సాధ్యం కాదు.

అయిదవ కారణం

ఇస్లామ్‌కు సంబంధించిన ఈ రెండు భావనల్ని సృజించడంలో ముస్లిముల సైద్ధాంతిక, ఆచరణాత్మక లోపాలతోపాటు ఇతర మతాల ప్రబోధాలు, వాటి వైఖరి కూడా బాగా పనిచేశాయి.

ఇస్లామ్ ఒక వాస్తవికత. అది ప్రతి యుగంలోనూ, ప్రతి ప్రాంతంలోనూ విభిన్న పేర్లతో అందజేయబడుతూ వచ్చింది. ప్రపంచంలో, ఇస్లామ్ ఏదో ఒక రూపంలో అందని ఏ ప్రాంతమూ, ఏ జనవాసమూ లేదు. కాని అనేక జనవాసాల్లో చాలా కాలంగా దాని పునరుజ్జీవనం జరగలేదు. అందువల్ల అది తన నిజ స్వరూపంలో మనగలగలేదు. కడకు కొన్ని చోట్ల మానవ కల్పిత తత్వాలు, భావాలు దాన్ని పూర్తిగా రూపుమాపాయి. ఇప్పుడు దాన్ని కనుగొనడం కూడా కష్టసాధ్యమయిపోయింది.

ప్రపంచంలో ఏ సిద్ధాంతాం, ఏ ఆలోచననయినా బౌద్ధికంగా, మానసికంగా చిత్తశుద్ధితో స్వీకరించినవారే విశ్వసనీయంగా దానికి భాష్యాలు, వ్యాఖ్యానాలు చెప్పేవారుగా స్వీకరించబడతారు. ఇలాంటి వారే నిజాయితీతో దాన్ని విశదీకరించగలుగుతారు, నిజ భావానికి ఆలోచనకు ఎక్కడా క్షతి కలిగించకుండా చెప్పగలుగుతారు. కాని దైవధర్మం విభిన్న మానవ సముదాయాలకు చేరినప్పుడు దాని పట్ల ఎంతో అన్యాయం జరిగింది, ప్రతి వ్యక్తీ అతడు ఆ ధర్మాన్ని చిత్తశుద్ధితో స్వీకరించినా స్వీకరించకపోయినా తన ఆలోచనల్ని అందులో జొప్పించడానికి ప్రయత్నించాడు. ఫలితంగా నిజ ధర్మానికి పూర్తిగా వ్యతిరేకభావాలు కూడా అందులో భాగమయిపోయాయి. నిజానికి వాటిలో దైవ ధర్మంలోని అంశాలు ఎంతో తక్కువగా ఎంతో మసకబారి మిగిలాయి. దాన్ని ఇక దైవం ప్రసాదించిన ధర్మం అనడం కూడా అన్యాయమే. ఒక వ్యవస్థను చెరిపివేసి రూపుమాపిన తరువాత అది అవసరమయిన ఫలితాలనిస్తుందని ఆశించలేము. ఇదే జరిగింది ఇస్లామ్ విషయంలోనూ. లోపభూయిష్టమయిన, రూపుమాసిన ఇస్లామ్ బోధనల్ని జీవన రంగంలో ప్రవేశింపజేసినప్పుడు తొలి అడుగులోనే తేలిపోయింది, అది జీవిత సమస్యల్ని పరిష్కరించజాలదని.

అలాంటి పరిస్థితిలో అసలు మౌలిక బోధనల వైపునకు మరలవలసింది. కాలగతిలో మారిన పరిస్థితుల ప్రభావం వల్ల, నిజ ధర్మంలో పొడసూపిన లోపాలను సంస్కరించవలసింది. కాని విచారకరమయిన విషయం ఏమిటంటే, ప్రతి వర్గం తమ తమ ఛిద్రమయిన తప్పుడు భావనలని గట్టిగా పట్టుకుని మొండిగా వ్యవహరించింది. ఆ భావనలకు భిన్నంగా దేన్ని చూసినా దాన్ని వ్యతిరేకించ

సాగింది. అంటే ప్రపంచంలోని ప్రతి యదార్థం దాని ఊహాజనిత భావాలకు తోడు నిలువాలని ఆశించింది. అలాకాకపోతే, వేనవేల కళ్ళు దాన్ని చూస్తూ ఉన్నా వందల విధాలుగా దాన్ని గ్రహించగలుగుతున్నా ఆ యదార్థాన్ని, దాని మనుగడను కూడా అది అంగీకరించదన్నమాట.

విభిన్న మతాల వైఖరి దైవం పేరిటనే కొనసాగుతుంది గనక, దైవం పేరు చెప్పి ముందుకు వచ్చే ప్రతి బోధన పట్ల ప్రపంచం కుశంకకు గురయింది. మతం అంటే క్రియాశూన్యమయిన కొన్ని అర్థరహిత భావనల కూర్పుగా భావించింది. వీటికి యదార్థ జీవితంతో ఎలాంటి సంబంధం లేదని, అందువల్ల జీవితపు సమస్యల పరిష్కారం కొరకు వాటిని ఆశ్రయించడం బుద్ధిలేనితనానికి నిదర్శనమని భావించింది.

నిజానికి ఈ వైఖరి, దైవ ప్రబోధాల పేరు చెప్పుకుని ముందుకు వచ్చిన కాల్పనిక భావాలు, దురాచారాలను మాత్రమే తిరస్కరిస్తుంది కాని దైవం వద్ద నుండి అవతరించిన అంతిమ ధర్మం విషయానికి వస్తే అది యథాతథంగా, పొల్లుపోకుండా భద్రంగా ఉంది. దాన్ని అవలంబించేవారమని చెప్పుకునే వారు అనేక తప్పిదాలకు పాల్పడ్డారన్నది వాస్తవమే అయినా, ఆ ధర్మం పిలుపునిచ్చిన బాటకు బహుదూరంగా మసలుకుంటున్నారన్న విషయంలోనూ సందేహం లేకపోయినా, వారు ఆ ధర్మాన్ని తమకు లభించిన దాని నిజస్వరూపంలో యథాతథంగా భద్రపరిచారు. నేడు ఆ ధర్మం మనముందుంది. స్వయంగా అది సత్యమని ప్రకటించుకుంటోంది కూడా. నేటి వరకు జరిగిన ఏ పరిశోధన అయినా, ఏ అనుభవమయినా ఆ ప్రకటనను తప్పుగా నిర్ధారించలేదు కూడా!

– : సమాప్తం : –